

# సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

## ఉత్తరాంధ్ర
విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం

మంగళవారం 1-7-2025 పేజీలు: 20


# బీజేపీ అధ్యక్షునిగా మాధవ్



- నేడు అధికారిక ప్రకటన
- ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు
- ఎన్నికల పరిశీలకుడిగా కర్ణాటక ఎంపీ మోహన్

**విశాఖపట్నం, జూన్ 30, మేజర్‌న్యూస్ :** ఏపీ బీజేపీ అధ్యక్షునిగా ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్‌ను అధిష్టానం ఖరారు చేసింది. దీంతో ఆయన మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. గత కొద్ది రోజులుగా పార్టీ అధ్యక్ష పదవిపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడిరది. దీంతో రాష్ట్ర బీజేపీలో నాయకత్వ మార్పు ఖాయమైంది. అధ్యక్ష ఎన్నికల ప్రక్రియను మంగళవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అధికారికంగా నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు కర్ణాటకకు చెందిన ఎంపీ మోహన్‌ను ఎన్నికల పరిశీలకునిగా పార్టీ నియమించింది. అధ్యక్ష పదవి రేసులో ముందున్న పీవీఎన్ మాధవ్‌కు పార్టీలో మంచి పేరుంది. గతంలో ఆయన శాసనమండలిలో బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా సమర్ధవంతంగా బాధ్యతలు నిర్వర్తించారు. పార్టీ సిద్ధాంతాలపై స్పష్టమైన అవగాహన, వాగ్ధాటి ఉన్న నేతగా ఆయనకు గుర్తింపు ఉంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర పార్టీ పగ్గాలను ఆయనకు అప్పగించాలని అధినాయకత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. పీవీఎన్ మాధవ్‌కు పార్టీలో, అనుబంధ సంస్థల్లో పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉంది. గతంలో ఆయన శాసన మండలి సభ్యుడిగా (ఎమ్మెల్సీ) సేవలందించడమే కాకుండా, మండలిలో (తరువాయి 2వ పేజీలో)

# ప్రభుత్వ ఉద్యోగులు నైపుణ్యం పెంపొందించుకోవాలి: జేసీ



**విశాఖపట్నం, జూన్ 30, మేజర్‌న్యూస్ :** కర్మ యోగి డిజిటల్ లెర్నింగ్ ప్లాట్ ఫార్మ్ ద్వారా ప్రతి ప్రభుత్వ ఉద్యోగి నైపుణ్యం, సామర్థ్యం పెంచుకోవాలని జిల్లా జాయింట్ కలక్టర్ మయూర్ అశోక్ అన్నారు. సోమవారం విజయవాడ ఎపిఎస్డి పిఎస్ నుండి జిల్లా అధికారులకు ఆన్ లైన్ ద్వారా ఐ గాట్ కర్మయోగి పోర్టల్ పై శిక్షణా ఇచ్చారు. ఈ శిక్షణ అనంతరం జాయింట్ కలక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులలో నైపుణ్యం, వృత్తి సామర్థ్యం పెంచుకోవడానికి సాంకేతికలో (తరువాయి 2వ పేజీలో)






### జిల్లాలో జీఎస్టీ వసూళ్లను
# వేగవంతం చేయాలి
### కలెక్టర్ విజయ క్రిష్ణన్



**అనకాపల్లి ప్రతినిధి, జూన్ 30, మేజర్ న్యూస్:** కొన్ని వ్యాపార సంస్థలు తమ కార్యకలాపాలు వస్తు సేవల పన్ను (జీఎస్టీ) చట్టం కింద నమోదు చేసుకోవాల్సి ఉన్నప్పటికీ అందుకు భిన్నంగా పను వలయానికి వ్యతిరేకంగా ఉన్నాయని వారిని వస్తూ పన్నుల జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ స్పష్టం (తరువాయి 2వ పేజీలో)

# 50 మెగావాట్ల సామర్ధ్యంతో 15 వేల సోలార్ ప్లాంట్లు
### ఏపీఈపీడీసీఎల్ సీఎండి పృథ్వీతేజ్



7వ పేజీలో

- పీఈపీడీసీఎల్ సీఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి
- రెండు నెలల్లో మరొక 5 వేల సోలార్ ప్లాంట్ల ఏర్పాటు
- వర్చువల్ నెట్ మీటరింగ్ పై అపార్ట్‌మెంట్ వాసుల ఆసక్తి
- వినియోగదారులకు రూ. 115 కోట్ల లబ్ది
- విద్యుత్ బిల్లుల్లో గణనీయమైన తగ్గుదల

# సచివాలయాల స్థాయిలోనే ప్రజా ఫిర్యాదులు పరిష్కరించాలి
### జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



**విశాఖపట్నం, జూన్ 30, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను సకాలంలో సచివాలయ స్థాయిలోనే ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాలని, ఆ దిశగా సచివాలయ కార్యదర్శులు చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందించాలని (తరువాయి 2వ పేజీలో)




# న్యాయబద్దంగా ఉన్న వినతులనే పరిష్కరించాలి



**విశాఖపట్నం, జూన్ 30, మేజర్‌న్యూస్ :** వీఎంఆర్‌డీఏ ప్రజాదర్బార్ కి వచ్చే వినతులు ఎక్కువగా భూ సంబంధితమైనవే ఉంటున్నాయని అందుకు న్యాయబద్దంగా ఉన్న వాటినే పరిష్కరించాలని విఎంఆర్‌డిఎ చైర్ పర్సన్ ఎం వి ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటిన్ కమిషనర్ విశ్వనాథన్‌లు అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం విఎంఆర్‌డిఎ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కి హాజరైన బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన వినతులు సాధ్యమైనంత వరకు వెంటనే పరిష్కరించే దిశగా పని చేయాలని సూచించారు. ఒకసారి వినతి ఇచ్చిన వారు పదే పదే కార్యాలయం చుట్టూ తిరగకూడదని, బాధితులకు సత్వర న్యాయం చేయాలని సూచించారు . వినతుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూసేకరణకి చెందిన ఫిర్యాదులను లోతుగా పరిశీలించి పారదర్శకంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. న్యాయ పరమైన వాటిని మినహా మిగిలిన ఫిర్యాదులు, వినతులు గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. బాధితుల సమస్యలు స్వయంగా విని ఆయా అంశాలపై సంబంధిత అధికారులకి సూచనలు చేశారు. సోమవారం ప్రజా దర్బార్‌కి మొత్తం ఫిర్యాదులు 11 వచ్చాయి. వీటిలో ప్లానింగ్ 5 , ఎస్టేట్ 3, సాంకేతిక విభాగం 2, ఇతర విభాగం 1 చొప్పున ఫిర్యాదులు అందాయి. ఈ ప్రజాదర్బార్ లో జాయింట్ కమిషనర్ కె రమేశ్, ఎస్టేట్ అధికారి దయానిధి , ప్రధాన గణాంక అధికారి హరి ప్రసాద్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## కార్యదర్శుల సమస్యలపై వినతి పత్రం అందజేత



**గరుగుబిల్లి, జూన్ 30, మేజర్ న్యూస్:** గ్రామపంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించడంతోపాటు కార్యదర్శులకు పని భారం తగ్గించాలని కోరుతూ ఇంచార్జ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాలి అర్జునరావుకు గ్రామ పంచాయ తీ కార్యదర్శులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు గ్రామపంచాయతీ కార్యదర్శులు బంటు అప్పారావు, నీరస రవికుమార్, బొంతల వైకుంఠరావు, మరిశర్ల భార్గవ్, పత్తి వెంకటరమణ, శివ్వాల రాంబాబులు మాట్లాడుతూ పంచాయతీరాజ్ కమిషనర్ మౌఖిక ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శుల పంచాయతీలకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఉదయం ఆరు గంటల నుండి పారిశుధ్య పనులు నిర్వహణ నిమిత్తం విధులకు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసి ఉన్నారని దీనివల్ల మహిళా కార్యదర్శులుతోపాటు, వయసు పైబడిన మరియు ఆరోగ్య సమస్యలు ఉన్న కార్యదర్శులు ఇబ్బందులకు గురవుతున్నారని ఎంపీడీవోకు అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు. అదేవిధంగా పారిశుద్ధ్య పనులలో భాగముగా రోజువారి చెత్త సేకరణ విధులు నిర్వహణ కొరకు ఐ.వి.ఆర్.ఎస్ కాల్స్ ఆధారంగా పంచాయతీ కార్యదర్శుల పనితీరును బేరీజు వేయకుండా ఉండాలని కోరారు. డీడీవోలుగా విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణలో సచివాలయ సిబ్బంది అందరూ సర్వీసు పుస్తకం (ఎస్ ఆర్)లేనందు వల్ల ఆ సర్వీస్ పుస్తకాలు నిర్వహించే లైన్ డిపార్ట్మెంట్ కు చెందిన అధికారులు జీతభత్యాలు ఇచ్చే విధంగా ఆదేశాలు జారీ చేయాలని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శుల సమస్యలను ఉన్నతాధికారులు పరిష్కరించని యెడల జులై 4వ తేదీన నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలియజేయడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శులు అప్పారావు, రవికుమార్, వైకుంఠరావు, భార్గవ్, తదితరులు తెలిపారు. అప్పటికి ఉన్నతాధికారి నుంచి ఎటువంటి స్పందన లేనియెడల తొమ్మిదవ తేదీన కార్యదర్శుల విధులకు సంబంధించి పెన్డౌన్ చేస్తూ నిరసన తెలియజేయునన్నామని పేర్కొన్నారు. 15వ తేదీ నుండి శాంతియుత నిరసన తెలియజేస్తూ రాష్ట్ర సంఘాల ఆదేశాల మేరకు తొలుత ధర్నా కార్యక్రమం చేపట్టిన అనంతరం సమ్మెబాట పట్టనున్నామని కార్యదర్శులు తెలియజేశారు. ఈమేరకు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్యదర్శులు వినతి పత్రంను అందజేయడం జరిగిందని ఈ విషయంను ఉన్నతాధికారులకు తెలియజేయడం జరుగుతుందని ఇన్చార్జ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాలి అర్జునరావు వెల్లడించారు.

(మొదటి పేజీ తరువాయి)

## బీజేపీ అధ్యక్షునిగా మాధవ్

బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. విద్యార్థి దశ నుంచే ఆర్‌ఎస్‌ఎస్‌లో చురుకుగా పనిచేసిన ఆయన, భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం)లో కూడా పనిచేశారు. మాధవ్ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారు. ఆయన తండ్రి, దివంగత నేత చలపతిరావు బీజేపీలో ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షునిగా సేవలందించారు. సుధీర్ఘ కాలం పాటు సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందారు. చలపతిరావు కూడా గతంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా పనిచేశారు. తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకుని, పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ పీవీఎన్ మాధవ్ ఇప్పుడు రాష్ట్ర అధ్యక్ష పదవిని చేపట్టబోతున్నారు. ఆయన ఎన్నిక లాంఛనమేనని నామినేషన్ల పర్వాన్ని చూస్తే ఇట్టే అర్థమవుతోంది. ఆయనకు పోటీగా ఏ ఒక్కరూ కూడా నామినేషన్ వేసిన దాఖలాలు లేవంటే ఆ పార్టీలో ఎంత క్రమశిక్షణతో ఉన్నారో ఇట్టూ అర్థం చేసుకోవచ్చు. విశాఖకు చెందిన మాధవ్ చిన్న తనం నుంచీ రాజకీయాలపై పూర్తి అవగాహనతో ఉన్నారు.

## సచివాలయాల స్థాయిలోనే ప్రజా ఫిర్యాదులు పరిష్కరించాలి

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతాధికారులకు,జోనల్ కమిషనర్లకు, సచివాలయ కార్యదర్శులకు ఆదేశించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కమిషనర్ మాట్లాడుతూ గతవారం జీవీఎంసీ కు పి.జి.ఆర్.ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల వివరాలను అందరు జోనల్ కమిషనర్లను అడిగి తెలుసుకొని ఎన్ని ఫిర్యాదులను పరిష్కరించారని ఆరా తీశారు. సోమవారం పీజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుండి స్వయంగా స్వీకరించిన ఫిర్యాదులను కమిషనర్ గమనించి, ముఖ్యంగా పట్టణ ప్రణాళిక విభాగం ,రెవెన్యూ, నీటి సరఫరా, పబ్లిక్ హెల్త్, వీధిలైట్లు విభాగాలకు సంబంధించి అధికంగా ప్రజల నుండి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇకపై ప్రతి సోమవారం స్వీకరించిన ఫిర్యాదులను అదే రోజు వాటిపై పరిష్కారమార్గ చర్యలను సచివాలయ కార్యదర్శులు చేపట్టాలని, అది ప్రతి సచివాలయానికి ప్రజల నుండి ఒకటో, రెండో ఫిర్యాదులు వస్తాయని, వాటిని నిర్ణీత సమయంలో పరిష్కరించినట్లయితే పీజిఆర్ఎస్ కు ప్రజలు ఫిర్యాదులు సమర్పించరని, ఆ దిశగా జోనల్ కమిషనర్లు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. సచివాలయ వార్డు ఎమినిటీస్ కార్యదర్శులు ప్రజలకు అందించే నీటి సరఫరా కలుషితం కాకుండా, నీటి సరఫరా పైప్ లైన్లు కాలువలలో కలవకుండా పరిశీలించేందుకు సర్వే నిర్వహించాలని, అలాగే ప్రజలకు సరఫరా జరుగుతున్న నీటి నాణ్యత పరీక్షలు నిత్యం జరపాలని, నాణ్యతతో కూడిన తాగునీరు ఎంత మొత్తంలో ప్రజలకు సరఫరా జరుగుతున్నదో తెలుసుకోవాలన్నారు. నగర సుందరీకరణ దృష్ట్యా సెంటర్ మీడియన్లు, ఓపెన్ స్పేసెస్, పార్కులు అందంగా తీర్చిదిద్దేలా నగర పచ్చదనాన్ని పెంపొందించాలని, అలాగే వీధిలైట్ల నిర్వహణలో నిత్యం ప్రత్యేక దృష్టి సారించి, లోపాలు లేకుండా సమగ్ర సర్వే చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. వర్షాకాలం అయినందున నగరంలో దోమల వృద్ధి కాకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతిచోట ఫాగింగ్, స్ప్రేయింగ్, ఏ ఎల్ ఓ కార్యక్రమాలు చేపట్టాలని, గార్బేజ్ వల్నరబుల్ ప్రధేశాలను గుర్తించి ఆ ప్రదేశాలను వ్యర్థాలు లేకుండా ఆకర్షణీయంగా తీర్చిదిద్దేలా విధులు నిత్యం వార్డు శానిటేషన్ కార్యదర్శులు చేపట్టాలన్నారు. అధికంగా టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి ప్రజా ఫిర్యాదులలో ఎక్కువగా అక్రమ, అనధికార కట్టడాలు, ఆక్రమణలు జరుగుచున్నందున వాటిని నియంత్రించేందుకు ముందస్తుగా ప్రతిరోజు వార్డులలో తనిఖీలు నిర్వహించి, అనధికార కట్టడాలకు వెంటనే నోటీసులు జారీ చేసి చర్యలు చేపట్టాలని, అలాగే కొత్తగా నిర్మాణాలు చేపట్టిన భవనాలకు పూర్తిగా గ్రీన్ మ్యాట్ కప్పి నిర్మాణాలు చేపట్టేలా బిల్డింగ్ నిర్మాణాల అనుమతులు జారీ చేసినప్పుడే ఆయా నిర్మాణదారులకు సూచించాలని, భవన నిర్మాణ వ్యర్థాలు రోడ్లపై,బహిరంగ ప్రదేశాల్లో పడవేయకుండా వాటిని వెంటనే తరలించే మార్గం చేపట్టాలని వార్డ్ ప్లానింగ్ కార్యదర్శులను కమిషనర్ ఆదేశించారు. అడ్మిన్ కార్యదర్శులు జీవీఎంసీ ఆర్థిక పరిపుష్టి దిశగా వార్డులలో సర్వే నిర్వహించి ఆస్తి పన్నులను విధించే చర్యలు చేపట్టాలని, అలాగే సచివాలయాల్లో అన్ని విభాగాల కార్యదర్శులు ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న విధివిధానాలను గమనిస్తూ చిత్తశుద్ధితో సచివాలయాల కార్యకలాపాలను నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. సచివాలయాలను నిత్యం పర్యవేక్షిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించేలా వార్డు కార్యదర్శుల పనితీరును మెరుగుపరిచేలా చర్యలు చేపట్టాలని, నగరంలో పచ్చదనం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, వాల్ పెయింట్ లను అవసరమైన చోట వేయించి అందంగా తీర్చిదిద్దాలని జోనల్ కమిషనర్లను కమిషనర్ ఆదేశించారు.

## ప్రభుత్వ ఉద్యోగులు నైపుణ్యం పెంపొందించుకోవాలి: జేసీ

ప్రతిరోజు వస్తున్న మార్పులకు అనుగుణంగా పనిచేయడానికిఐ గాట్ కర్మయోగి పోర్టల్ ఏర్పాటు చేసిందన్నారు. దీనిలో 10 కోర్సులు ఆన్ లైన్ ప్లాట్ ఫార్మ్ లో ఉంచిందని ప్రభుత్వ సీఎఫ్ఎంఎస్ ఐడి ఉన్న ఉద్యోగులందరూ యాప్ లేదా వెబ్సైట్ ద్వారా నమోదు చేసుకొని రాబోయే వారంలోగా మూడు కోర్సులు నేర్చుకొని ఆన్ లైన్ సర్టిఫికేట్ పొంది జిల్లాను ముందంజలో ఉంచాలన్నారు. కాలక్రమంగా మిగిలన కోర్సులు పూర్తి చేయాలన్నారు. జిల్లా అధికారులు అందరు తమ కార్యాలయ పరిధిలో ఉద్యోగులందరూ కోర్సులను పూర్తి చేసే విధంగా పర్యవేక్షించాలన్నారు. కోర్సులు పూర్తి ఎలా చేయాలో అన్నది తెలుసుకోవడానికి యు ట్యూబ్ వీడియో అందుబాటులో ఉన్నదన్నారు.. ఈ శిక్షణా కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో జీఎస్టీ వసూళ్లను వేగవంతం చేయాలి

చేసారు. ఇటీవల రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ ఎ. బాబు సూచనల మేరకు వస్తూ సేవల పన్ను (జీఎస్టీ ) రెవెన్యూ వసూళ్ల మరింత ప్రగతి సాధించాలనే ఉద్దేశంతో సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాల వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ వై కిరణ్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాటడుతూ రాష్ట్ర వస్తూ సేవల పన్ను (జీఎస్టీ ) రెవెన్యూ వసూళ్ల మరింత ప్రగతి సాధించాలనే ఉద్దేశంతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్ర జీఎస్టీ రెవెన్యూ వసూళ్ల మరింత ప్రగతి సాధించాలని సమన్వయ కమిటీ సమావేశంలో స్పష్టంచేసారు. ఈ మేరకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. జీఎస్టీ పరిధి వలయానికి వెలుపల ఉన్న వారిని పన్నుల పరిధిలోకి తీసుకురావడానికి వీలుగా జిల్లా పరిశ్రమల శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు, అటువంటి వర్తకులు సమాచారాన్ని వాణిజ్య పన్నుల శాఖకు తక్షణమే పంపించాలని కలెక్టర్ ఆదేశించారు, పాతబకాయిదారులను తక్షణమే గుర్తించాలని, జిల్లాలో వస్తూ సేవల పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని, బకాయిదారుల ఆస్తులను గుర్తించడంలో జీఎస్టీ అధికారులకు పూర్తి సహాయ సహకారాలు అందిచలాని సంబంధిత అధికారులకు, లీడ్ బ్యాంక్ తో పాటు ఇతర బ్యాంకు అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. జీఎస్టీ అధికారుల నుంచి జారీ చేసే నోటీసుల్లో బకాయిదారులకు సంబంధించి ఖాతా వివరాలు, వారి ఖాతాలను స్తంబింపజేయడం తదితర అంశాల ఆవశ్యకతను సమన్వయకమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ అధికారులకు వివరించారు. స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖల అధికారులకు బకాయిదారులకు సంబంధించి ఆస్తుల వివరాలు, బిల్డర్లకు సంబంధించి కొత్త రిజిస్ట్రేషన్ వివరాలను జీఎస్టీ అధికారులకు అందించాలని కలెక్టర్ స్పష్టంచేసారు. మైనింగ్ అక్రమ రవాణాను నిరోధించే చర్యల్లో భాగంగా మైనింగ్ అధికారులు, రవాణా శాఖా అధికారులు వాణిజ్య పన్నుల శాఖతో సమన్వయం చేసుకొని పనిచేయాలని కలెక్టర్ స్పష్టంచేసారు. స్థానికంగా వస్తు వినియోగం, సేవల వినియోగానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని, ఈమేరకు ఇంజినీరింగ్ విభాగాలు కాంట్రాక్టర్లను స్థానికంగా లభించే డీజిల్ ఇతర నిర్మాణ సామాగ్రి వాడకాన్ని ప్రోత్సహించాలని ఆదేశించారు. జీఎస్టీ చట్టపరిధిలోకి వచ్చే కాంట్రాక్ట్ సేవలు, ఇతర పన్నులు చెల్లించదగిన సేవలకు సంబంధించి మూలంలోనే పన్నులు వసూలు చేసేందుకు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డీ.డీ.ఓ లను జిల్లా కలెక్టర్ ఆదేశిస్తూ ఆమేరకు పంచాయతీరాజ్, రూరల్ డెవలప్మెంట్, ఇంజినీరింగ్, ఇరిగేషన్, గృహనిర్మాణ శాఖ తదితర డీడీఓ లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని తెలిపారు. వృత్తి పన్ను వసూల్లకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ, ఇంటర్మీడియట్ బోర్డు, టెక్నికల్ ఎడ్యుకేషన్, మున్సిపల్ అధికారులు తదితర శాఖల అధికారులకు ఆదేశాలు ఇస్తూ వాణిజ్య పన్నుల శాఖకు ఎప్పటికప్పుడు అవసరమైన సమాచారాన్ని అందిస్తూ వృత్తిపన్ను వసూళ్లు, పెంపుదలలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ స్పష్టంచేసారు. ఈ అంశాలకు సంబంధించి పన్ను వసూళ్లలో మరింత ప్రగతి, పురోగతి సాధించేందుకు ప్రతి నెలా జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే జిల్లా అధికారుల సమీక్షా సమావేశంలో మొదటి ప్రాధాన్యత అంశంగా పన్ను వసూళ్లకు సంబంధించి సమీక్షిస్తానని కలెక్టర్ జిల్లా అధికారులకు స్పష్టంచేసారు. ఈ సమావేశంలో ఉమ్మడి విశాఖ జిల్లాల వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ వై. కిరణ్ కుమార్, ఉప కమిషనర్ అపర్ణ, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి వి.సుదీర, జిల్లా స్టాంప్స్ మరియు రిజిస్ట్రేషన్ అధికారి మన్మధరావు, జిల్లా భూగర్భ గనులు శాఖ అధికారి ఎం. శ్రీనివాస్, జిల్లా పర్యాటక శాఖ అధికారి కె మనోరమ, జిల్లా పౌర సరఫరాల అధికారి కె వి ఎల్ ఎన్ మూర్తి, లీడ్ బ్యాంకు మేనేజర్ కె సత్యన్నారాయణ, ఎంపీడీఓలు, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు




# జూలై 6న వెంకటేశ్వర స్వామి గిరి ప్రదక్షణ

## ఆలయ కమిటీ చైర్మన్ మూడు రామ గోవిందు



**పరవాడ, జూన్ 30, మేజర్‌న్యూస్:** జూలై 6 ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా ఆరోజు సాయంత్రం ఈ బోనంగి కొండపై వేంచేసి ఉన్న భూ సమేత శ్రీ అభయ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో తొలిసారిగా గిరి ప్రదక్షిణ కార్యక్రమం ప్రారంభించడం జరుగుతున్నదని ఆలయ కమిటీ చైర్మన్ బుగుడు రామ గోవిందు తెలిపారు. ఈ ప్రదక్షణ దారి విషయాలు తెలుపుతూ కొండమీద స్వామివారి పాదాల నుండి ప్రారంభమై. గౌతు లచ్చన్న నగర్ జంక్షన్ పెట్రోల్ బంక్ జంక్షన్ఎమ్మార్వో ఆఫీస్ జంక్షన్ ఈ బోనంగి ఆంజనేయస్వామి గుడిలి నుండి బికే స్టీల్ కంపెనీ జంక్షన్ మీదుగా ఫార్మసిటీ కాలనీ మీదుగా స్వామి వారి పాదాల వరకు వచ్చి ముగుస్తుంది కావున భక్తులు ప్రజలు యావన్మంది ఈ గిరి ప్రదక్షిణలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరుతున్నానని అన్నారు.

# గంజాయి ముద్దాయికి 12 సంవత్సరాలు జైలు శిక్ష

## – లక్ష ఇరవై వేలు జరిమానా
## – సీఐ పీ.వీ. రమణ



**కొయ్యూరు, జూలై 30, మేజర్‌న్యూస్:** కోర్టు తీర్పు మేరకు గంజాయి కేసులో గొలుగొండ మండలం ,రావణ పల్లి గ్రామానికి చెందిన దేవర శివ (37) పై కోయ్యూరు పోలీస్ స్టేషన్ లో సోమవారం కేసు నమోదు చేసినట్లు సీఐ– పి .వెంకటరమణ తెలియజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2017 ఫిబ్రవరి 2వ తేదీన 96 కిలోల గంజాయి రవాణాకు పాల్పడిన నిందితుడు దేవర శివను అరెస్ట్ చేయడం జరిగిందన్నారు . విచారణ అనంత ట్రయల్ దశలో నిందితుడు దేవర శివ కు ఈ సంవత్సరం జూన్ 30వ తేదీన న్యాయస్థానం 12 సంవత్సరాల జైలు శిక్ష మరియు 1లక్ష 20 వేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిందన్నారు.ఈ కేసుకు సంబంధించి అప్పటి దర్యాప్తు అధికారి కొయ్యూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్. మల్లికార్జున రావు దర్యాప్తును అనుసరించి పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రసాద్ వాదనలు మేరకు ముద్దాయి దేవర శివకు శిక్ష పడిందని, ఈ సందర్భంగా సోమవారం కొయ్యూరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. వి. రమణ మరియు ఎస్ఐ వర్మ తెలియజేశారు. ఈ సందర్భంగా సి.ఐ మాట్లాడుతూ గంజాయి వ్యాపారం, అక్రమ రవాణా వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# జిల్లా అధికారుల సంఘం నూతన కార్యవర్గం



**అనకాపల్లి ప్రతినిధి ,జూన్ 30, మేజర్‌న్యూస్:** జిల్లా అధికారుల సమస్యలు ,సంక్షేమం కొరకు నూతన కార్యవర్గ ఎన్నికను కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ముందుగా జిల్లా అధికారుల సర్వసభ్య సమావేశం సోమవారం నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అందుబాటులో ఉన్న జిల్లాఅధికారులందరూ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో వివిధ అంశాలపై చర్చ అనంతరం, జిల్లా అధికారుల సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అధ్యక్షులుగా ముఖ్య ప్రణాళికాధికారి జి. రామారావు, గౌరవ అధ్యక్షులుగా జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా జిల్లా గ్రామ పంచాయతీ అధికారి సందీప్, జనరల్ సెక్రటరీగా పీడి డి.ఆర్.డి.ఎ శచీదేవి, జాయింట్ సెక్రటరీగా పీడి డ్వామా పూర్ణిమాదేవి, కోశాధికారిగా జిల్లా పౌర సరఫరాల అధికారి కె.వి.ఎల్.ఎన్ మూర్తి ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా ఎస్.డి.సి రమామణి, డి.ఈ.ఓ అప్పారావు నాయుడు, ఏ.పి.సి ఎస్.ఎస్.ఏ సూర్యప్రకాష్ ఎంపికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు జిల్లా కలెక్టర్ కె. విజయ కృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, “జిల్లా అధికారుల సంక్షేమం కోసం సమిష్టిగా పని చేయాలని, కార్యవర్గం కొత్త కార్యక్రమాలను ప్రారంభించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని అని సూచించారు.

# ఏపీ ఆర్ ఎస్ ఏ సంఘ భవనానికి శంకుస్థాపన



**అనకాపల్లిప్రతినిధి, జూన్ 30, మేజర్‌న్యూస్:** ఏ ఎం ఏ ఎల్ కాలేజ్ జంక్షన్ దగ్గర్లో, అనకాపల్లి జిల్లా ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నూతన భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమాన్ని సోమవారం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ విజయకృష్ణ న్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలలో ప్రతిష్టాత్మక మైన రెవెన్యూ శాఖ కు కొత్త జిల్లా ఏర్పడిన తరువాత సంఘం భవన నిర్మాణం న కు నా చేతుల మీదుగా భూమి పూజ జరగడం చాలా సంతోషంగా ఉంది అని అన్నారు. రెవెన్యూ శాఖ ఎప్పుడూ ప్రజల సమస్య పరిష్కారం చెయ్యడం లో మరింత చెరువుగా ఉండి మరింత మంచి పేరు తెచ్చుకోవాలని అలానే సంఘం భవనాన్ని త్వరితం గా పూర్తి చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఏపీ ఆర్ ఎస్ ఏ రాష్ట్ర అధ్యక్షులు మరియు ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం రెవెన్యూ శాఖ మీద ముఖ్యంగా తహసీల్దార్ల పై ఎంతో నమ్మకం కలిగి ఉంది అని, అందరూ కూడా ప్రభుత్వ సేవలను మరింత బాధ్యతాయుతంగా పారదర్శకంగా నిర్వహించి ప్రభుత్వానికి రెవెన్యూ శాఖ కి మంచి పేరు తీసుకుని రావాలని అన్నారు. అనంతరం కలెక్టర్ విజయ్ కృష్ణ న్ చేతులు మీదుగా ఏపీ ఆర్ ఎస్ ఏ అనకాపల్లి జిల్లా సంఘం భవనం శంఖు స్థాపన కార్యక్రమం జరగడం కొత్తగా ఏర్పడిన జిల్లాలో ఏపీ ఆర్ ఎస్ ఏ సంఘం భవనం ప్రారంభం తొలి జిల్లా అనకాపల్లి జిల్లా కావడం చాలా సంతోషం గా ఉంది అన్నారు ఇందుకు కృషి చేసిన అనకాపల్లి జిల్లా ఏపీ ఆర్ ఎస్ ఏ అధ్యక్ష కార్యదర్శి లను అభినందించారు. అలానే భవనాన్ని త్వరిత గతిన పూర్తీ చేసి ప్రస్తుత కలెక్టర్ వారి చేతుల మీదగానే ప్రారంభించ దానికి కృషి చేయాలని వారిని కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ రావు , అనకాపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అమరావతి రాష్ట్ర కార్యదర్శి శ్రీ ఆర్ వి రాజేష్ , ఏపీ వీఆర్వోసంఘ రాష్ట్ర అధ్యక్షులు చంటి , ప్రధాన కార్యదర్శి జి అనుపమ, ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ నాయుడు(వాసు) ఏపీ ఆర్ ఎస్ ఏ జిల్లా స్థాయి అధ్యక్షుడు పీవీ రత్నం, జిల్లా కార్యదర్శి ఎలమంచిలి శ్రీరామమూర్తి ,మరియు ఆంధ్రప్రదేశ్ వీఆర్వో సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరామమూర్తి మరియు జిల్లా లోని అన్ని మండలాల తహసీల్దార్ లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## “వేదమే భారతీయ జీవన నాదం”

# సప్త ఋషి చారిటబుల్ ట్రస్ట్ రథసారథి మాధవ్ శర్మ!



**సబ్బవరం, జూన్ 30, మేజర్‌సూర్య:** సబ్బవరం మండలం, గొల్లల పాలెం గ్రామంలో వేదమే సనాతన భారతీయ ధర్మానికి జీవన నాదమని విదేశీయులు సైతం నమ భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు ఆకర్షితులవుతున్నారని అంతేకాకుండా మన వేదాల జీవనసారాన్ని ఆధ్యాంతం ఆకళింపు చేసు కుంటున్నారని మన ముంగిట్లోనే ఉన్న ఈ మహత్తరమైన వేద సారాన్ని ప్రతీ ఒక్కరు ఔపోసన పట్టిన నాడే భావితరాలకు బాసటగా నిలవడానికి ఓ వినూత్నమైన ఆస్కారం ఏర్పడుతుందని సప్తఋషి చారిటబుల్ ట్రస్ట్ రథసారథి మాధవ్ శర్మ భావాయుక్తంగా వెల్లడించారు, గొల్లల పాలెం గ్రామంలో”సప్త ఋషి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో”వేద దివస్”కార్యక్రమాన్ని నిర్వహించారు ఇందులో భాగంగా ఉదయం 7.44 నిమిషాలకు గురు ప్రార్థన, గణపతి ప్రార్థనతో కార్య క్రమాన్ని ఆరంభించి ఎనిమిది గంటలకు ఋగ్వేద పారాయణం,తొమ్మిది గంటలకు శుక్ల యజుర్వేద పారాయణం,పది గంటలకు అతిరుద్ర పారాయణం మధ్యాహ్నం ఒంటిగంటకు కృష్ణ యజుర్వేద పారాయణం మూడు గంటలకు సామవేద పారాయణం,నాలుగు గంటలకు అథర్వవేద పారాయణాన్ని ఆహ్లాద కరమైన వాతావరణంలో అంగరంగ వైభవోపేతంగా నిర్వహించడం జరిగింది మహత్తరమైన వేడుకకు ముఖ్య అతిథిగా సప్త ఋషి చారిటబుల్ ట్రస్ట్ అధినేత ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త మాధవ్ శర్మ హాజరై జ్యోతీ ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు,అనంతరం జరిగిన సమావేశంలో పండితులను భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ మన వేదాలు ఉపనిషత్తులు పురాణాలు ప్రపంచ మనుగడను ఆధారంగా చేసుకుని ఉద్భవించిన అఖండమైనవని వేదసారమని అంతేకాకుండా మన సంస్కృతి సాంప్రదాయాలను ఇన్ని కోట్ల సంవత్సరాలుగా సజీవంగా ఉంచగలుగుతున్నది ఒక్క వేదమేనని సభికుల హర్షధ్వానాల మధ్య వినమ్రపూర్వకంగా తెలియజేశారు,”వేద సమ్మేళనం 2025”పేరిట చతుర్వేదాలకు సంబంధించిన పండితులతో నిర్వహించిన ఈ వేద పారాయణంలో పలు దూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరైన వేద పండితులు ఈ మహత్తర మైన వేడుకలో వివిధ వేదాలను అధ్యయనం చేసిన వారిని,పండితులను దుశ్శాలువ జ్ఞాపిక పూలబొక్కేలతో ఘనంగా సత్కరించిన ట్రస్ట్ యాజమాన్యం ప్రతినిధులు సభ్యులు,ఈ మహిమాన్విత మైన వేడుకలో పాల్గొన్నారు.




## మహిళ ఎమ్మెల్యేను టీడీపీ కౌన్సిలర్లు అవమానపర్చడం తగదు

### నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి




**నెల్లిమర్ల, జూన్ 30, మేజర్ న్యూస్:** నెల్లిమర్ల నగర పంచాయతీకి చెందిన టీడీపీ కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశానికి హాజరుకాకుండా అవమానపర్చారని, ప్రతిపక్ష పార్టీ వారిలా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ధ్వజమెత్తారు. నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం స్థానిక కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కాలేదు. ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, చైర్ పర్సన్ బంగారు సరోజిని, జనసేన కౌన్సిలర్లు జానా సంధ్యారాణి, పాండ్రంకి సత్యవతి, బీజేపీ కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ మాత్రమే హాజరయ్యారు. దీంతో సమావేశం రద్దయింది. ఈ సందర్భంగా హాజరైన కౌన్సిలర్లు, జనసేన పార్టీ నాయకులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ కడపలో ఒక మహిళ ఎమ్మెల్యేను ప్రతిపక్ష వైసిపి నాయకులు అవమానపర్చినట్లు ఇక్కడ టీడీపీ కౌన్సిలర్లు తాను హాజరైన సమావేశానికి డుమ్మాకొట్టారని ధ్వజమెత్తారు. సమావేశానికి హాజరై సమస్యలు ఏమైనా ఉంటే చర్చించాలే తప్ప బహిష్కరించడం సరికాదన్నారు. టీడీపీ సభ్యుల తీరును ప్రభుత్వ పెద్దలకు తెలియజేస్తానని చెప్పారు. ఇక్కడి పరిస్థితులను అధిష్టానానికి వివరిస్తానని చెప్పారు. టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు పేరిట ఏర్పాటు చేసిన నెల్లిమర్ల అన్నా క్యాంటీన్ ను సర్వనాశనం చేశారని చెప్పారు. దీనిపై జిల్లా మంత్రి, ఇన్చార్జి మంత్రికి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. నగరపంచాయతీ అభివృద్ధిని విస్మరించి టిడిపి కౌన్సిలర్లు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. అవసరమైతే నగరపంచాయతీకి స్పెషల్ ఆఫీసర్ ను నియమించి, కౌన్సిలర్ల అధికారాలు తొలగింపునకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తానన్నారు. తనకు పైసా వద్దని నగరపంచాయతీ అభివృద్ధే తన ఎజెండా అని వివరించారు. సమావేశంలో జనసేన నాయకులు రవ్వా నాని, అప్పికొండ రవికుమార్, జనా ప్రసాద్, ఎం.ఎం నాయుడు, గంటా సత్యనారాయణ, పాండ్రంకి సత్యనారాయణ, కాళ్ల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## మహా న్యూస్ కార్యాలయంపై దాడి హేయమైన చర్య



**నెల్లిమర్ల, జూన్ 30, మేజర్ న్యూస్:** హైదరాబాద్ మహా న్యూస్ ఛానల్ ప్రధాన కార్యాలయంపై దాడి హేయమైన చర్య అని జైబీమ్ రావు భారత్ పార్టీ జిల్లా అధ్యక్షులు టొంపల నరసయ్య అన్నారు. నెల్లిమర్లలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మీడియా కార్యాలయాలపై దాడి భావ ప్రకటన స్వేచ్ఛను హరించడమే అన్నారు. మీడియా ద్వారా తప్పుడు కథనాలు అభ్యంతరాలను సంబంధిత వ్యక్తుల ద్వారా గాని మీడియా ద్వారా గాని ఖండించాలని ఇటువంటి చర్యలకు పాల్పొద్దని చెప్పారు. లేదా కోర్టు నోటీసులు ఇవ్వొచ్చని వెల్లడించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కనిగిరి శ్రీనివాసరావు, పార్లమెంట్ ఇన్చార్జి చిన్నం అరుణ కుమార్ పాల్గొన్నారు.

# నియోజకవర్గానికి 'కళా' తో కాంతులు







- ప్రగతి పరుగులు.. అభివృద్ది కి వెలుగులు
- ఏడాదిలోనే మారిన రూపురేఖలు
- నాలుగు మండలాల పట్ల సమభావం
- హంగు, ఆడంబరాలకు ఆమడ దూరం
- ప్రాంత సర్వతోముఖాభివృద్దే కళా ధ్యేయం
- ప్రజలతో మమేకం.. కార్యకర్తలకు ప్రాధాన్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం

**మెరకముడిదాం జూన్ 30 మేజర్ న్యూస్:** కిమిడి కళావెంకట్రావు.. ఉత్తరాంధ్రవాసులకు పరిచయమక్కరలేని పేరు. అపార రాజకీయ అనుభవం ఆయన సొంతం. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ పొలిటికల్ ప్రస్థానంలో, ప్రభుత్వంలో పార్టీలో తాను నిర్వహించిన ఎన్నో కీలక పదవులకు వన్నెతెచ్చిన సిసలైన ప్రజానాయకుడు. శ్రీకాకుళం జిల్లాలోని ఉనుకూరు నియోజకవర్గం నుంచి 1983లో తొలిసారి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందిన ఆయన, ఆతర్వాత వెనుతిరిగి చూడలేదు. 1985,1989,2004 ఎన్నికల్లోనూ జైత్రయాత్ర కొనసాగించారు. మున్సిపల్, వాణిజ్యపన్నులు, హొంశాఖ మంత్రిగా బాధ్యతలు నెరవేర్చారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన టీటీడీ చైర్మన్ గానూ సేవలందించారు. ఒక దపా రాజ్యసభ సభ్యునిగా కూడా ప్రాతినిధ్యం వహించారు. 2014లో ఎచ్చెర్ల నుంచి విజయం సాధించిన కళా.. కొన్నాళ్లపాటు స్వీయ విరామం తీసుకొని గతేడాది జరిగిన ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా బరిలో దిగి అందరి అంచనాలను తలకిందులు చేస్తూ జయకేతనం ఎగురవేశారు. రాష్ట్ర విభజన అనంతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులయ్యారు. ప్రస్తుతం చీపురుపల్లి ఎమ్మెల్యేగా ఉన్న ఆయన, ఈ నియోజకవర్గాన్ని అభివృద్ధి పరంగా ఆదర్శంగా నిలిపేందుకు అహర్నిశలు తపన పడుతున్నారు. నియోజకవర్గంపై తన ముద్ర స్పష్టంగా ఉండేలా అహరహం శ్రమిస్తున్నారు.

### ప్రగతి వెలుగులు..

ఏడాది కాలంలో ఆయన నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు తీయిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉపాధిహామీ పథకం కింద 100 కోట్ల రూపాయల విలువ చేసే మెటీరియల్ కాంపోనెంట్ పనులు మంజూరుచేయించడం ద్వారా గ్రామాల్లో చిరకాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపారు. నియోజకవర్గ కేంద్రంలో మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టుకు నూతన భవనాన్ని మంజూరు చేయించి చిత్తశుద్ధిని చాటుకున్నారు. చీపురుపల్లి ఆర్ఈసీఎస్ పునరుద్ధరణకు నడుం కట్టారు తెప్పించే ప్రయత్నం లో అహర్నిశలు కృషి చేస్తున్నారు. వ్యవసాయ రంగానికి కీలకమైన తోటపల్లి కాలువల ఆధునీకరణకు నాలుగు కోట్ల రూపాయలు మంజూరు చేయించి మెరక ముడిదాం, గరివిడి గుర్ల, చీపురుపల్లి మండలాల రైతుల గుండెల్లో అపర భగీరథుడు గా నిలిచి రైతులకు భరోసాగా కల్పించారు. నియోజకవర్గ పరిధిలోని ఆర్ అండ్ బీ రహదారులకు కోట్ల రూపాయల నిధులతో కొత్త రూపు తీసుకొచ్చి దశాబ్దాల అగచాట్లను తొలగించారు. ఇందులో భాగంగానే గరివిడి-గర్భాం రోడ్డు పనుల నిమిత్తం 3 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. గర్భాం -బిల్లలవలస రోడ్డు కష్టాల నుంచి విముక్తి కల్పించారు. దీర్ఘకాల అనారోగ్యంతో బాధపడుతున్న వారికి నేనున్నానంటూ ధైర్యం చెప్పి ముఖ్యమంత్రి సహాయనిది నుంచి సుమారు రెండు కోట్ల రూపాయలు మంజూరు చేయించి ఎన్నో పేద కుటుంబాలకు ఆసరాగా నిలిచారు. చీపురుపల్లి ఆస్పత్రికి ఆర్థికపరమైన పరిపాలనా మంజూరు జీవో ను మంజూరు చేయించారు.

### ప్రజలతో మమేకం..

ఈ ప్రాంతీయుల్లో కొంతమందితో పరిచయాలు ఉన్నప్పటికీ, చీపురుపల్లికి కొత్తయినందున ప్రజలతో సంబంధాల విషయంలో ఉన్న సందేహాలను ఎమ్మెల్యే "కళా" గెలిచిన కొద్ది రోజులకే పటాపంచలు చేశారు. ప్రతినిత్యం ప్రజలతో మమేకమవుతూ అన్నివర్గాల వారిని కలుపుకొంటూ, వారి కష్టసుఖాలను పంచుకుంటూ, తానున్నానని భరోసానిస్తూ కొద్దికాలానికే అభిమానుల దృష్టిలో ఆత్మబంధువుగా నిలిచారు. ఎమ్మెల్యేగా పని ఒత్తిడి దృష్ట్యా అందుబాటులో ఉండని సందర్భాల్లో ప్రజలకు అసౌకర్యం కలగకుండా తనయుడు రాబోయే రోజుల్లో కాబోయే యువ నాయకుడు, రాష్ట్ర టి డీ పి ప్రధాన కార్యదర్శి కిమిడి.రామ్ మాలిక్ నాయుడును ప్రజలకు అందుబాటులో ఉంచి ప్రజలు అవసరాలుకు అన్ని ఏర్పాట్లు చేయడం ఆయన నిబద్ధతకు నిదర్శనం.

### ఆడంబరాలకు దూరం

పదవివల్ల వచ్చే ఆడంబరాలకు "కళా" ఆమడ దూరం. సీనియర్ శాసనసభ్యుడైనా ఎటువంటి హంగు ఆర్భాటాల జోలికి వెళ్లకుండా సాదా సీదాగా అందరిలో ఒకనిగా కలిసిపోతారు. వాక్చాతుర్యంతో ప్రత్యర్థిపార్టీల దూకుడుకు చిటికెలో కళ్లెం వేసే ఘనాపాటి. ఉత్తరాంధ్ర యాసను సుసంపన్నం చేసేవారి జాబితాలో ముందువరుసలో ఉంటారు. వీలైనంత వరకు నియోజకవర్గ ప్రజలను పేరుపెట్టి పిలిచి వారి మనసుల్లో "మనోడు" అనిపించుకుంటారు.

### అలుపెరుగని యోధుడు

ఎమ్మెల్యే కళా దాదాపు ఐదు దశాబ్దాల ప్రజా జీవితంలో అలుపెరుగని యోధుడని చెప్పడం అతిశయోక్తి కాదు. 73 సంవత్సరాల వయసులో కూడా ఆయన పనితీరులో యువ ఎమ్మెల్యేలకు సవాల్ విసిరేలా దూసుకుపోతుంటారు. ప్రాంత సర్వతోముఖాభివృద్దే లక్ష్యంగా,ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతుంటారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ కు ఆప్తుల్లో ఒకరిగా ఉండే కళావెంకట్రావు, ముఖ్యమంత్రి చంద్రబాబు సన్నిహితుల్లో ఒకరిగా గుర్తింపు సంపాదించుకున్నారు.

### కార్యకర్తల కష్టం తెలిసినోడు..

ఎమ్మెల్యే కళా.. కార్యకర్తల కష్టం తెలిసిన నాయకుడు. అందుకే, వారికే కష్టమొచ్చినా తానున్నానని ధైర్యం చెప్పడమేకాదు ఆ కష్టాన్ని తీర్చేందుకు తపన పడుతుంటారు. అంతేనా, పార్టీ కేడర్ ఇళ్లల్లో జరిగే కార్యక్రమాలకు భేషజాలు లేకుండా హాజరై తాను అందుబాటులో లేని సమయంలో తనయుడుడును ప్రజలకు అందుబాటులో ఉంచి సేవలందింపజేసి వారిని ఆనందపరుస్తారు.

### అందుబాటులో ఉండేందుకు..

నియోజకవర్గ పరిధిలోని కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండేందుకు పార్టీ ఆఫీసు తో పాటు నియోజకవర్గ కేంద్రంలో ఓ భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. వచ్చే కేడర్ సమస్యలను సావధానంగా విని, వాటికి పరిష్కారమార్గాన్ని చూపిస్తుంటారు. నాలుగు మండలాల నుంచి వచ్చే నాయకుల తాకిడి ఎంతగా ఉన్నా విసుగు విరామం లేకుండా వారితో మమేకమవుతుంటారు. నియోజకవర్గంలో పార్టీని తిరుగులేని శక్తిగా తయారు చేసేందుకు ప్రణాళికా యుతంగా వ్యవహరిస్తుంటారు. మొత్తమ్మీద, ఎమ్మెల్యే కళావెంకట్రావు ఏడాదిలోనే అందరివాడుగా అభినందనలు పొందుతున్నారు.ఆయన హయాంలో ఈ నియోజకవర్గం అభివృద్ధి పరంగా ఆదర్శంగా నిలుస్తుందనడంలో సందేహమే లేదని పార్టీలకతీతంగా ప్రజలంతా అభిప్రాయపడుతున్నారు. ఈరోజు ఎమ్మెల్యే" కిమిడి కళావెంకట్రావు" జన్మదినం. ఇంకెందుకు ఆలస్యం, ఆయనకు హ్యాపీ బర్త్ డే శుభాంక్షలు తెలుపు కుందాం.




## దోపిడీకి నిలయాలైన విద్యాలయాలు...

- ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై అధికారులు మౌనం
- భారీ స్థాయికి చేరిన పుస్తకాల దోపిడి...
- అనుమతులు లేకుండా నడుస్తున్న విద్యాసంస్థలు



**నరసన్నపేట, జూన్ 30, మేజర్‌న్యూస్:** నరసన్నపేట మండల కేంద్రంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాలయాలు దోపిడీకి నిలయాలుగా మారాయని, విద్యాశాఖ అధికారుల మౌనం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు వరంగా మారిందని, అధికారుల పరోక్ష సహకారంతో అన్ని ప్రైవేట్ విద్యాలయాలు అన్ని పుస్తకాలు యూనిఫారాలు పేరిట భారీ దందా నిర్వహించాయని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాస్ అన్నారు. మండలంలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో విద్యను వ్యాపారంగా మారుస్తున్నారని, పుస్తకాలు, యూనిఫామ్ పేరుతో వేలాది రూపాయలు లూటీ చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం పుస్తకాలు, యూనిఫాం, పోకెట్ పీజు పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక ఒత్తిడికి గురి చేస్తున్నారని, ఇంత వ్యాపారం జరుగుతున్న జిల్లా, మండల స్థాయి విద్యాశాఖ అధికారులు ఎటువంటి చర్యలకు ఉపక్రమించక మౌనం దాల్చారని అన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో ఉన్న అనేకమైన కాలేజీలు, స్కూల్స్ కు పక్కా బిల్డింగులు, ఫైర్ సేఫ్టీ, ప్లే గ్రౌండ్ వంటి మౌళిక వసతులు లేకపోయినా విద్యను వ్యాపారంగా చేసుకుని నడుపుకుంటున్నారని అన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి ఆయా స్కూల్స్, కాలేజీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నరసన్నపేట నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. అరవింద్, ఎన్. సాంబశివరాజు ఉన్నారు.

## ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను వివరించండి



**కోటబొమ్మాళి, జూన్ 30, మేజర్‌న్యూస్:** రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను వివరించాలని మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరి వర ప్రసాద్ అన్నారు. సోమవారం టెక్కలి నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జ్‌లతో సుపరిపాలనతో తొలిఅడుగు శిక్షణ కార్యక్రమం స్థానిక ఎన్టీఆర్ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యేడాది పాలనలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలు గూర్చి ఇంటింటికి వెళ్ళి వివరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన పార్టీ మండల అద్యక్షుడు బోయిన రమేష్, జీరు భీమారావు, పినకాన అంజయ్‌కుమార్, బగాది శేషు, నాయకులు వెలమల విజయలక్ష్మి, కామేశ్వరావు, తర్ర రామక్రిష్ణ, నంబాళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులు పరిష్కరించుటలో

## జాప్యం ఉండరాదు

**జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి**



**శ్రీకాకుళం, జూన్ 30, మేజర్‌న్యూస్:** పబ్లిక్ గ్రీవెన్స్ లో స్వీకరించే ప్రజా ఫిర్యాదుల పట్ల జాప్యం, నిర్లక్ష్యం వహించకుండా, త్వరితన ఆయా ఫిర్యాదులపై విచారణ జరిపి అర్జీదారులు సంతృప్తి పొందేలా పూర్తి స్థాయిలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి 63 మంది ప్రజల నుంచి పిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదు దారుల అర్జీలు,వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తక్షణమే సంబధిత పోలీసు అధికారులకు తెలియ పరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు.ప్రజా పిర్యాదులు పట్ల అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు.ఈ క్రమంలో జిల్లా ఎస్పీ స్వయంగా వృద్దులు వికలాంగుల అర్జీ దారులు తో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఎస్పి అధికారులు ఆదేశించారు. పిర్యాదులు వివరాలు మొత్తం 63 స్వీకరించగా అందులో కుటుంబ సమస్యలు, మోసపూరితమైన,ఆస్తి తగాదాల,సివిల్, ఇతరత్రా అంశాలపై స్వీకరించారు.

## కక్షపూరిత విధానాలు సరికాదు..

- బాధిత కుటుంబానికి అండగా ఉంటాం
- మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణ దాస్



**నరసన్నపేట, జూన్ 30, మేజర్‌న్యూస్:** నరసన్నపేట మండలం కోమర్తి గ్రామ సర్పంచ్ ఉంగటి రాజుకు చెందిన రేకుల షెడ్ ను అన్యాయంగా, అక్రమంగా కూటమి ప్రభుత్వం నేలకూల్చిందని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణ దాస్ అన్నారు. సోమవారం కోమర్తి గ్రామంలో ఉంగటి రాజు కుటుంబ సభ్యులను కృష్ణ దాస్ పరామర్శించారు. తగిన న్యాయం చేస్తామని వారికి హామీ ఇచ్చారు. 45 ఏళ్లుగా స్వ అనుభవంలో ఉన్న ఆస్తిలో వ్యక్తిగత, రాజకీయ కక్షలతో నేలకుల్చడం అధికారులకు కూటమి ప్రభుత్వానికి సరికాదన్నారు. బాధిత ఆవేదన అర్థం చేసుకోలేని ప్రభుత్వాలు ఉన్నన్నాలు ఇలాంటి చర్యలు జరుపుతారని, పరిశీలించి న్యాయం చేయవలసిన అధికారులే కూల్చివేతకు పాల్పడితే బాధితులు తమ గోడును ఎవరికి వెలబుచ్చుకుంటారని, వైకాపాశ్రేణులపై ఇటువంటి చర్యలకు పాల్పడడం భావ్యం కాదన్నారు. ఈ కార్యక్రమం లో జడ్పీటీసీ చింతు రామారావు ,రాష్ట్ర పొందర కూరకుల కార్పొరేషన్ విభాగ అద్యక్షులు రాజపు అప్పన్న, నియోజకవర్గ పంచాయతీరాజ్ అధ్యక్షులు బగ్గు రమణయ్య , మండల సర్పంచ్లు సంఘం అధ్యక్షులు యాబాజీ రమేష్, మండల యూత్ అధ్యక్షులు బుద్దల రాజశేఖర్, సర్పంచ్ కనపల శేఖర్ ఎంపీటీసీలు పంచిరెడ్డి సత్యం , రువ్వ వాసుదేవరావు , మండల కార్యవర్గ సభ్యులు కోల ఈశ్వరరావు, మండల యూత్ ఉప అధ్యక్షులు తోట భార్గవ్, కనపల అరవింద్ , తంగి అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అంశాల పరిష్కారంలో

## ప్రగతి స్పష్టంగా కనిపించాలి

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు
- జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పలాస/ శ్రీకాకుళం జూన్ 30, మేజర్ న్యూస్: ప్రజలకు రెవిన్యూ సేవలు అందించడంలో బాధ్యతగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పలాస రైల్వే గ్రౌండ్ లోని సమావేశ మందిరంలో డివిజన్లోని తాసిల్దార్లు, ఉప తాసిల్దార్లు, హెచ్.డి.టీలు, ఆర్ ఎస్ డిటీలు, మండల సర్వేయర్లు, వి.ఆర్.ఓ లతో రెవెన్యూ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాల వారిగా ప్రజా సమస్యల పరిష్కార వినతులు , 22 ఎ నిషేధ భూముల వివరాలు , ఇళ్ల స్థలాల రీ వెరిఫికేషన్, తదితర రెవిన్యూ అంశాల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి వచ్చిన వినతులను క్షేత్రస్థాయిలో ఎంత వరకు పరిష్కరించినది, పరిష్కారం చూపవలసినవి మండల గ్రీవెన్స్ మానిటరింగ్ అధికారి శ్రద్ధ వహించాలని ఆదేశించారు. వినతులు ఏ కారణం చేత పరిష్కారంకాబడలేదు కారణాన్ని ఎండార్స్మెంటులో ఫిర్యాదుదారునికి తెలపాలని సూచించారు. 22 ఎ నిషేధ భూములను గుర్తించి పరిష్కారానికి నివేదిక అందజేయాలని సూచించారు. 22 ఏ ఎటువంటి కేసులు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. ఇండ్ల స్థలాల రీ వెరిఫికేషన్ ను పక్కాగా పూర్తిచేయాలని, ఇండస్థలాల కొరకు ఎన్ని దరఖాస్తులు పెండింగ్లో ఉన్నవి, అందుబాటులో ఉన్న భూమి వివరాలను సిద్ధం చేయాలని తాసిల్దార్లను ఆదేశించారు. రీ సర్వేలో వచ్చిన డి పట్టా




భూములకు 1బి రానటువంటి కేసుల వివరాలను నివేదిక అందజేస్తే ప్రభుత్వానికి పరిష్కారం కోసం సమర్పిస్తామన్నారు. రెవెన్యూ అశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమస్యల పరిష్కారం, ప్రగతిని ఎప్పటికప్పుడు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీవో జి.వెంకటేష్, జిల్లా ఉద్యాన వన అధికారి సీహెచ్.శంకర్ దాసు, జిల్లా సెరీ కల్చర్ అధికారి పి.చంద్ర జీవన్, జిల్లా పర్యాటక శాఖ అధికారి పి.నారాయణ రావు, తాసిల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి, డివిజన్ స్థాయి అధికారులు, రెవెన్యూ అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

## ఏపీ అడ్వకేట్ టీం వర్సెస్ గౌహతి హైకోర్టు టీం మధ్య మ్యాచ్

- ఏసీఏ విడిసిఏ వేదికగా రెండు రోజుల మ్యాచ్
- ముఖ్య అతిథిగా హాజరైన నార్త్ ఏసీపీ





(మేజర్ న్యూస్ : విశాఖపట్నం)

ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్ క్రికెటర్ అసోసియేషన్ ఏసీఏ వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్ ఏపీ అడ్వకేట్ టీం వర్సెస్ గౌహతి హైకోర్టు టీం మధ్య జూన్ 30,జూలై 1 వరకు మ్యాచ్ లు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్నికి ముఖ్య అతిథిగా నార్త్ ఏసీపీ అప్పలరాజు ప్రారంభించారు. ఇరువిజట్లకు టాస్ వేసి మ్యాచ్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసిపి అప్పలరాజు టీములను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ న్యాయవాదులు క్రికెట్ ఆడడం చాలా ఆనందంగా ఉందన్నారు.అందరూ మంచి స్పోర్ట్స్ మాన్ స్పిరిట్ తో ఆడాలని చెప్పారు. అలాగే ఏపీ అడ్వకేట్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి. సురేష్ కుమార్ మాట్లాడుతూ అడ్వకేట్ క్రికెట్ ఇంటర్నేషనల్ స్థాయి వరకు ఆడడం జరుగుతుందని చెప్పారు అడ్వకేట్ క్రికెట్ మంచి కాంపిటేటివ్ గా ప్లేయర్స్ అందరూ పెర్ఫార్మ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు క్రికెట్ అభిమానులు హాజరైరు.

## హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

- రిమాండ్‌కు తరలింపు
- పథకం ప్రకారం హత్యకు ప్రయత్నం
- కేసు నమోదు తో రంగంలోకి దిగిన పోలీసులు



(మేజర్ న్యూస్ : విశాఖపట్నం)

యువతిని వేధిస్తున్న రౌడీ షీటర్ ను హత్య చేయాలని కొందరు యువకులు పథకం వేశారు. పథకం ప్రకారం ఆ రౌడీ షీటర్ ను ఒక ప్రాంతానికి పిలిపించారు. అతను రాగానే బీర్ బాటిల్, కర్రలతో దాడి చేసి హత్య చేసేందుకు ప్రయత్నించారు. కేసు నమోదు తో రంగంలోకి దిగిన 3 టౌన్ పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. వాసుపల్లి రాము అలియాస్ కుక్కల రాము అనే రౌడీషీటర్ ఒక యువతిని వేధిస్తూ ఉండేవాడు. ఆమె తన స్నేహితులైన చెన్నా లోకేష్,కర్రి భాను ప్రసాద్, ఎస్. శివకుమార్, కిల్లంపల్లి గోవిందరాజు, మరో మైనర్ అయిన ఫ్రెండ్స్ కి ఈ విషయం తెలియజేసి, ఆ రౌడీషీటర్ కు గట్టిగా బుద్ధి చెప్పాలని తెలియజేస్తుంది. జూన్ 22న మరొక మిత్రుడు పుట్టినరోజు సందర్భంగా శివాజీ పార్క్ సమీపంలో గల ఒక హోటల్లో పార్టీ చేసుకోవడం జరిగింది. వారు ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో పంది మెట్ట జంక్షన్‌లో ఆమె వారికి కనిపించింది. ఈ సందర్భంగా రౌడీషీటర్ పై వాళ్లకి చెప్పింది. వెంటనే ఆ ఫ్రెండ్స్ అందరూ కలిసి తమ వద్ద గంజాయి, డ్రగ్స్ ఉన్నాయని జేవీఎస్ ఎం కాలనీ వెనుక ఉన్న నీటి ట్యాంక్ కొండ పైకి రావాలని రౌడీ షీటర్ కు ఫోన్ చేసి తెలియజేశారు. అనంతరం రౌడీ షీటర్ రాముతో పాటు యశ్వంత్ అనే వ్యక్తి కూడా రావడం జరిగింది. వాళ్లు ఆ ప్రదేశానికి రాగానే ఆ నలుగురు ఫ్రెండ్స్ కలిపి బీరు బాటిల్ అలాగే కర్రతో రాము తలపై దాడి చేశారు. దీంతో రాము తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన చూసి భయపడి అక్కడ నుంచి రాము ఫ్రెండ్ వెంటనే వెళ్ళిపోయాడు. తీవ్ర గాయాలైన రాము తనపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

## డంపింగ్ యార్డ్ తరలించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన జేఏసీ కమిటీ సభ్యులు



పెద గంట్యాడ, జూన్ 30, మేజర్‌న్యూస్: జీ.వీ.ఎం.సీ 76వ వార్డు గంగవరం పోర్ట్ రోడ్డు లో ఉన్న డంపింగ్ యార్డు ను తక్షణమే తరలించాలి అంటూ కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జే.ఏ.సీ కమిటీ సభ్యులు సోమవారం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ డంపింగ్ యార్డ్ ఆనుకుని 16 గ్రామాల ప్రజలు నివాసముంటున్నారని అన్నారు. ఈ డంపింగ్ యార్డు వలన రోగాల బారిన పడుతున్నారని వివరించారు. గంగవరం పోర్టు వలన వస్తున్న కాలుష్యం మరింత తలనొప్పిగా మారుతుందని అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో రంభా నారాయణ మూర్తి, రాంబాబు, సత్య నారాయణ, గోవింద రావు, అశోక్, నారాయణ రావు, రమణ, రమేష్, గిరి, కమలాకర్ పలు గ్రామాల అధ్యక్ష, కార్య దర్శులు పాల్గొన్నారు.

## సూర్య కథనానికి విశేష స్పందన

- గురుకుల పాఠశాలలో అక్రమ వసూల్
- టి సి, సర్టిఫికెట్స్ వెంటనే ఇప్పించిన
- జిల్లా సమన్వయ అధికారి ఎన్. రామకృష్ణ



ఆరిలోవ, జూన్ 30, మేజర్‌న్యూస్: జీవీఎంసీ, 13 వ వార్డు పరిధిలోగల శ్రీ కృష్ణాపురం గురుకుల పాఠశాలలో విద్యార్థులను ఇబ్బందులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, పాఠశాలలో చదివి టి సి అడిగితే ముడుపులు చెల్లించాలని విద్యార్థులు చదువుకునే గదులలో ఫ్యాన్లు, తలుపులు మీరే వీరి చేశారంటూ వాటికోసం ఒక్కొక్క విద్యార్థి దగ్గర నుంచి 700 వందల రూపాయలు అక్రమ వసూలు చేస్తున్నారంటూ ఈనెల 29 న సూర్య దినపత్రికలో వచ్చిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించి సోమవారం విశాఖ జిల్లా సమన్వయదికారి, ఎన్. రామకృష్ణ విచారణ నిమిత్తం శ్రీ కృష్ణాపురం డా. బి.ఆర్.అంబేద్కర గురుకులం (బాలురు), ఆకస్మికంగా సందర్శించారు. టీసీ ల కొరకు వచ్చిన విద్యార్థులకు వెంటనే టీసీ లను ఇవ్వవలసిందిగా ఆదేశించారు. అదే విధంగా తల్లిదండ్రులతో మాట్లాడి టీసీ లు అందినట్లు అభిప్రాయం తెలుసుకున్నారు. టీసీ కు డబ్బులు వసూలు పై, ప్రిన్సిపల్ బంధువు ఓ వ్యక్తి విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆయన చెప్పినట్టు వినమని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు సమాచారం అందిందని దానిపై దృష్టి సారించి, విచారణ జరిపి నివేదికను వెంటనే రాష్ట్ర అధికారులుకు సమర్పిస్తున్నాం అని ఇటువంటివి మరోసారి జరగకుండా కఠిన చర్యలు చేపడతామని తెలియజేసారు.

# పదవీ విరమణ చేసిన సిబ్బందిని సత్కరించిన సిపి

- కుటుంబ సమేతంగా శాలువాతో సత్కరించి సీపీ
- కమిషనరేట్ లో 21 మంది సిబ్బందికి ఘన సన్మానం



(మేజర్ న్యూస్ : విశాఖపట్నం)

పోలీసు శాఖలో సుదీర్ఘకాలం పనిచేసే పదవి విరమణ చేసిన పోలీసు సిబ్బందిని విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ డా.శంఖబ్రత బాగ్చి సత్కరించారు. ఈ సందర్భంగా వారు చేసిన సేవలను కొనియాడారు. నగర పోలీసు శాఖలో విధులు నిర్వర్తించి, ఉద్యోగ విరమణ చేసిన 21 మంది అందుకే ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.పదవి విరమణ చేసిన వారిలో ఒక ఏ.డి.సి.పి, ఇద్దరు ఎస్.ఐ లు , ముగ్గురు ఏ.ఆర్.ఎస్.ఐ లు , ఏడుగురు ఏ.ఎస్.ఐ లు, ఒక ఉమెన్ ఏ.ఎస్.ఐ, ఒక హెచ్.సి, ఇద్దరు ఎ.ఆర్.హెచ్.సి, నలుగురు హెచ్.జి లు ఉన్నారు. వీరిని పోలీసు కాన్ఫరెన్స్ హాల్(టెంపుల్ ఆఫ్ లెర్నింగ్) నకు ఆహ్వానించి,వారి కుటంబసభ్యులు, పోలీసు అధికారుల సమక్షంలో శాలువాతో సత్కరించి, పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. పదవీ విరమణ పొందిన వారి వివరాలు.. పోలీసు శాఖలో సుదీర్ఘకాలం పదవి బాధ్యతలు నిర్వహించి పదవి విరమణ పొందిన వారిలో ఏ.డి.సి.పి ఎమ్. మోహన రావు,ఎస్.ఐ లు డి.తాతా రావు, జి.విలియమ్స్, ఏ.ఆర్.ఎస్.ఐ లు, డి.నారాయణ రావు, ఎమ్. లక్ష్మణ రావు, కే. జనార్ధన రావు, ఏ.ఎస్.ఐలు కే.ఎస్.కే. సత్య నారాయణ,కే. ఈశ్వర రావు,పి. రామమ్,సిహెచ్. వెంకటేశ్వర రావు, వి. వెంకట రావు,ఏ.పి పాపా రావు,జి.సూర్యనారాయణ, కే. నాగ లక్ష్మీ,హెచ్.సి, డి. కృష్ణంరాజు, ఏ.ఆర్.హెచ్.సిలు, బి. రాజా రావు, ఏ.ఎస్ గణపతి, హెచ్.జి లు చోడవరపు నరిసమ్మ, జి జే రత్నకుమార్,నందూరి శ్రీనివాస రావు,వాసిరెడ్డి ఈశ్వర రావులు ఉన్నారు.

## జీవీఎంసీ 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో 130 వినతులు



**విశాఖపట్నం, జూన్ 30, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కు 130 వినతులు వచ్చాయని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం లోని పాత సమావేశ మందిరం లో కమీషనరు కేతన్ గార్గ్ తో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 130 అర్జీలు/ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 1వ జోన్ కు 02, 2వ జోన్ కు 22, 3వ జోన్ కు 25, 4వ జోన్ కు 13, 5వ జోన్ కు 12, 6వ జోనుకు 11, 8వ జోన్ కు 14, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 31 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ అండ్ అకౌంట్సు విభాగమునకు 03, రెవెన్యూ విభాగమునకు 15, ప్రజారోగ్య విభాగమునకు 08, పట్టణ ప్రణాళిక విభాగమునకు 60, ఇంజినీరింగు విభాగమునకు 33, మొక్కల విభాగమునకు 02, యుసిడి విభాగమునకు 09 కలిపి మొత్తంగా 130 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఈ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ ఫిర్యాదులను ప్రతి రోజు పరిశీలిస్తూ, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను, జోనల్ కమీషనర్లను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి నరేష్ కుమార్, సిటీ ప్లానరు మీనాకుమారి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి. వాసుదేవ రెడ్డి, ఫైనాన్సర్ అడ్వైజర్ మల్లికాంబ, డీసీఆర్ ఎస్. శ్రీనివాసరావు, పర్యవేక్షక ఇంజనీర్లు పి.వి.వి. సత్యనారాయణ రాజు, కె.వి.ఎన్ రవి, సంపత్ కుమార్, కె .శ్రీనివాసరావు, కృష్ణారావు, కార్యనిర్వాహక ఇంజినీరు రత్నాకరరెడ్డి, డి డి హెచ్ ఎం. దామోదర రావు, యు సి డి – ప్రాజెక్ట్ ఆఫీసర్ డి. లక్ష్మి, డిపిఓ లు ఎమ్.వి.డి ఫణిరామ్, ఎల్ సురేష్, సివిఓ డాక్టర్ ఎన్. కిషోర్, డీసీపీ హరిదాస్, ఏసీపీ లు తిరుపతిరావు, రామక్రిష్ణ, రామలింగేశ్వర రెడ్డి, వెంకటేశ్వరరావు, శాస్త్రి, స్పోర్ట్సు డైరెక్టర్ అప్పలరాజు, బయాలజిస్ట్ సాంబమూర్తి, ఆర్ఎఫ్ఓ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## జీవీఎంసీ కమిషనర్ ను కలసిన సింహాచలం దేవస్థానం ఈవో, ప్రధాన అర్చకులు



**విశాఖపట్నం, జూన్ 30, మేజర్‌న్యూస్ :**ఇటీవల జీవీఎంసీ నూతన కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన కేతన్ గార్గ్ ను సింహాచలం శ్రీ వరహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, సింహచలం ఆలయ కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు మర్యాదపూర్వకంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో సోమవారం కలసి శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి చిత్రపటాన్ని కమిషనర్ కు అందించారు. అనంతరం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు కమిషనర్ ను వేదమంత్రాలతో ఆశీర్వదించి, స్వామివారి తీర్ధ ప్రసాదాలను, చందనం అందించారు. ఈ సందర్భంగా వారు జులై 9న తేదీన నిర్వహించనున్న సింహాచలం శ్రీ వరహ లక్ష్మీనరసింహస్వామి గిరి ప్రదక్షిణ లో లక్షలాది మంది భక్తులు పాల్గొంటారని, వారి సౌకర్యార్ధం తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్యం, బీచ్ లో స్నానపు గదులు, మరుగుదొడ్లు, రోడ్లు అభివృద్ధి తదితర ఏర్పాట్లను కల్పించేలా చూడాలని ఆలయ నిర్వహణాధికారి వినతి పత్రం ద్వారా కమీషనర్ ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక ఇంజనీర్ సి.హెచ్.వి రమణ, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## జీవీఎంసీలో 77 మంది ఉద్యోగుల పదవీ విరమణ



**విశాఖపట్నం, జూన్ 30, మేజర్‌న్యూస్ :** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థలో ఎంతో బాధ్యతగా సుదీర్ఘకాలం ఉద్యోగ విధులు నిర్వహించి నేడు ఉద్యోగ విరమణ పొందుతున్న ప్రతి ఒక్కరి శేష జీవితం ఆనందదాయకంగా ఉండాలని కోరుకున్నట్లు జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి పేర్కొన్నారు. సోమవారం ఆయన మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ లో వివిధ హోదాలలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న జీవీఎంసీ మున్సిపల్ కమిషనర్ గ్రేడ్–1 ఎం వి డి ఫణిరామ్ తో పాటు ఇతర ఉద్యోగులను జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్.ఎస్. వర్మ, ప్రాజెక్ట్ డైరెక్టర్ (యు సి డి) పిఎమ్.సత్యవేణి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి. నరేష్ కుమార్ లతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తన ఉద్యోగ కాలంలో తన కుటుంబము కంటే అధిక కాలాన్ని సంస్థ కొరకు పని చేశారని పేర్కొన్నారు. నేడు ఉద్యోగ విరమణ పొందుతున్న 64 మంది పర్మినెంట్ ఉద్యోగుల తో పాటు 13 మంది పొరుగు సేవల సిబ్బంది తో కలిపి మొత్తం 77 మంది ఉద్యోగ విరమణ పొందారని, వారందరి శేష జీవితాలు ఆనందదాయకంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అలాగే నేడు మున్సిపల్ కమిషనర్ గ్రేడ్–1 గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందుతున్న ఎం.వి.డి. ఫణిరామ్ జీవీఎంసీలో జూనియర్ అసిస్టెంట్ గా చేరి అంచలంచెలుగా ఎదుగుతూ రాష్ట్రంలో పలాస, కాశీబుగ్గ, విజయనగరం, బొబ్బిలి లలో మున్సిపల్ కమిషనర్ గా రాజమండ్రి, తిరుపతి లలో అదనపు కమిషనర్ హోదాలో విధులు నిర్వహించారని తెలిపారు. ఆయన ఉద్యోగ కాలంలో ఏ కమిషనర్ వచ్చినా ఒక్క రోజులోనే ఆయన అభిమానాన్ని పొందుతారని తెలిపారు.అనంతరం జీవీఎంసీ అదనపు కమిషనర్ చేతుల మీదగా పదవి విరమణ పొందుతున్న ఉద్యోగులకు సంబంధించిన ప్రావిడెంట్ ఫండ్ సుమారు రూ.7.23 కోట్లను అందించి పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు కనకమహాలక్ష్మి, శివప్రసాద్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పద్మజ, జెమ్స్ ప్రతినిధులు అప్పలనాయుడు డిపిఓలు, ఏపీడీలు, పర్యవేక్షకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## రోగులకు సేవచేయడం దేవుడిచ్చిన గొప్పవరం



**విశాఖపట్నం, జూన్ 30, మేజర్‌న్యూస్ :**డివిజనల్ రైల్వే హాస్పిటల్ లో చీఫ్ నర్సింగ్ సూపరింటెండెంట్ గా పదవీ విరమణ చేసిన నీలి శ్యామల , ఉషారాణి సారథి ల వీడ్కోలు సభలో వాల్టేర్ డివిజనల్ హాస్పిటల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డా. డి . శరత్ బాబు అన్నారు . 42 ఏళ్ల సక్సెస్ ఫుల్ సర్వీస్ కంప్లీట్ చేయడం అంటే చిన్నవిషయం కాదు . దేవుడు సంకల్పం ఉంటేనే ఇ లాంటి మంచి ఘడియల్ని మనం చూడగలం అని పేర్కొన్నారు . శ్యామల గారు కూడా 35 ఏళ్లు సర్వీస్ ను పూర్తి చేసారు . ఒక వైపు కుటుంబాన్ని చక్కదిద్దుకుంటూ , పిల్లల్ని గొప్పచదువులు చదివించి ఉన్నతమైన వైద్యులుగా తీర్చిదిద్దటమనేది గొప్ప విషయం గా పేర్కొన్నారు . శ్యామల గారు వైద్యసేవ చేయడమనేది నేటితో అంతం కాదు ..వారి కుటుంబ సభ్యులద్వారా దీనిని కంటిన్యూ చేస్తూ సంతృప్తి పొందుతారు . ఇది వీరికి మాత్రమే లభించిన అరుదైన అవకాశమని అన్నారు . పిల్లల చదువు విషయమై శ్యామల గారు నన్ను గతంలో సంప్రదించ గా .. చదివించండి .. వారికి దేనిలో ఆసక్తి వుందో ఆ మేరకు వారిని వుత్సాహపరచండి అని అన్నాను .. ఆ మేరకే వారి ఇద్దరి పిల్లల్ని వైదులుగాను , ఒకర్ని సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గాను తీర్చి దిద్దారని కొనియాడారు . వారు కూడా ఈ వేడుకలో పాల్గొనడం ఇది ఒక పదవీవిరమణ కార్యక్రమం లాగా కాకుండా పెళ్లి వేడుకలా అనిపిస్తుంది . దండలు మార్చుకోవడం .. ఫోటోలు దిగడం లాంటి సన్నివేశాలు పెళ్లిరోజుల్ని గుర్తుకు తెచ్చాయన్నారు . ఆద్యంతం హుషారైన పలకరింపులతో , ప్రసంగాలతో సాగిన ఈ కార్యక్రమంలో రైల్వే హాస్పిటల్ డాక్టర్ లు , వైద్య సిబ్బంది పాల్గొన్నారు .

## 50 మెగావాట్ల సామర్ధ్యంతో 15 వేల సోలార్ ప్లాంట్లు

**విశాఖపట్నం, జూన్ 30, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ(ఏపీఈపీడీసీఎల్) సంస్థ పరిధిలోని వినియోగదారులకు 50 మెగావాట్ల సామర్ధ్యం కలిగిన 15 వేల రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసామని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో సబ్సిడీపై గ్రిడ్ కనెక్టెడ్ రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ఏపీఈపీడీసీఎల్ గృహ వినియోగదారుల నుంచి స్పందన రోజురోజుకి పెరుగుతుందన్నారు. 2024 నుంచి 2025 ఏప్రిల్ నెలాఖరు నాటి వరకు 10 వేల రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయగా మే, జూన్.. కేవలం ఈ రెండు నెలల్లోనే 5 వేల రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసామని, ఇదే స్ఫూర్తితో మరిన్ని ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో అపార్ట్మెంట్ నివాసాలు ఎక్కువగా ఉన్నందున అపార్ట్మెంట్లపై వ్యక్తిగత సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశం లేనందున ఆదే డివిజన్ పరిధిలో వేరొక ప్రాంతంలో వినియోగదారునికి మరొక సొంత ఇల్లు ఉన్నట్లయితే ఆ ఇంటి మిద్దెపైన సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొని అక్కడ ఉత్పత్తి చేసిన సోలార్ విద్యుత్ యూనిట్లను వర్చువల్ నెట్ మీటరింగ్ పద్ధతి ద్వారా ఈపీడీసీఎల్ గ్రిడ్ కు ఎక్స్ పోర్ట్ చేసి అపార్ట్మెంట్ నివాసంలో వినియోగించుకొనే అవకాశాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ రకమైన వర్చువల్ నెట్ మీటరింగ్ పద్ధతికి వినియోగదారుల నుంచి మరింత ఆసక్తి పెరిగిందని తెలిపారు. ఒక్కసారి పెట్టుబడితో 20 ఏళ్ల వరకు ఇంటికి సరిపడా విద్యుత్ వినియోగించడంతో పాటు, మిగిలిన విద్యుత్ ను గ్రిడ్ కు పంపించి ఆదాయం పొందే అవకాశాలు ఉండడంపై దీనికి ఆదరణ పెరుగుతోందన్నారు. సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుంటున్న వారిలో 80శాతం 3 కిలోవాట్ల సామర్థ్యం తో రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటివరకు 50,002 కిలోవాట్ల సామర్ధ్యం కలిగిన 15,120 రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లను గ్రిడ్ కు అనుసంధానించడం ద్వారా వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం నుంచి సెంట్రల్ ఫైనాన్స్ అసిస్టెన్స్ (సబ్సిడీ)గా 115 కోట్ల రూపాయలు లబ్ది చేకూరిందని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో 1650 మంది వినియోగదారులకు 5054 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్లు, పార్వతీపురం మన్యం 289 మందికి 880 కిలోవాట్లు, విజయనగరం 1549 మందికి 4845 కిలోవాట్లు, విశాఖపట్నం 2056 మందికి 7511 కిలోవాట్లు, అనకాపల్లి 1239 మందికి 3827 కిలోవాట్లు, అల్లూరి సీతారామరాజు 9 మందికి 30 కిలోవాట్లు, డాక్టర్ అంబేద్కర్ కోనసీమ 943 మందికి 3022 కిలోవాట్లు, కాకినాడ 1676 మందికి 5815 కిలోవాట్లు, తూర్పుగోదావరి 1716 మందికి 5818 కిలోవాట్లు, పశ్చిమగోదావరి 1794 మందికి 5898 కిలోవాట్లు, ఏలూరు 2199 మందికి 7298 కిలోవాట్ల సామర్ధ్యం కలిగిన సోలార్ ప్లాంట్లను గ్రిడ్ కు అనుసంధానించామని వివరించారు. ఈ పథకాన్ని వినియోగదారులకు మరింత చేరువ చేసేందుకు విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వినియోగదారులు తమ ఇంటి మిద్దెపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకొని విద్యుత్ బిల్లులను గణనీయంగా తగ్గించుకొనే అవకాశాన్ని వినియోగించుకోవాలని సీఎండి విజ్ఞప్తి చేసారు. ఈ పథకంలో భాగంగా ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్ ను ఏర్పాటు చేసుకోవాలనుకొనే వినియోగదారులు తమ ఇంటి పైకప్పుపై కనీసం 100 చదరపు అడుగుల స్థలం కలిగి ఉండాలన్నారు. ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొన్నవారికి 30,000 రూపాయలు, 2 కిలోవాట్లకు 60 వేలు, 3 కిలోవాట్లకు గరిష్టంగా 78,000 రూపాయల వరకు సబ్సిడీ లభిస్తుందని బి సి లకు అదనంగా 20,000 రూపాయల సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. 3 కిలోవాట్లు ఏర్పాటు చేసుకొన్న ఇంటికి నెలకు కనీసం 360 యూనిట్ల వరకు ఉత్పత్తి అవుతుందని, ఇంటి అవసరాలకు వాడుకోగా మిగిలిన అదనపు విద్యుత్‌ను విద్యుత్ సంస్థకు విక్రయించడం ద్వారా అదనపు ఆదాయాన్ని కూడా పొందవచ్చున్నారు. అపార్టుమెంట్లలోని కామన్ సర్వీస్ కు ఉన్న కాంట్రాక్టు లోడుకు అనుగుణంగా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చున్నారు. 500 కిలోవాట్ల వరకు కిలోవాట్ కు 18,000 రూపాయల చొప్పున సబ్సిడీ అందిస్తున్నామన్నారు. సోలార్ ప్లాంట్లు ఏర్పాటుచేసుకొనేందుకు ఈఎంఐ పద్ధతిలో చెల్లించేందుకు అతి తక్కువ వడ్డీకి బ్యాంకులు రుణాలను సమకూరుస్తున్నామన్నారు. వినియోగదారులు పీఎం సూర్యఘర్ పోర్టల్ లో దరఖాస్తు చేసుకొని, అందులో ఎంపానల్ అయిన 503 మంది వెండర్స్ లో తమకు నచ్చిన వారివద్ద నుంచి సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చున్నారు. దరఖాస్తుకు గానీ, నెట్ మీటర్ కోసం గానీ ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదని స్పష్టం చేసారు. మరిన్ని వివరాలకు ఈపీడీసీఎల్ వెబ్ సైట్ ను సందర్శించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగదారులకు చేరువ చేసేందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ సీఎండి అభినందనలు తెలిపారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటుకు సంబంధించిన సందేహాల నివృత్తి కోసం ప్రజలు టోల్ ఫ్రీ నెంబర్ 1912 కు ఫోన్ చేయవచ్చని సీఎండి పృథ్వీతేజ్ తెలిపారు

## సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

### జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్



**పార్వతీపురం, జూన్ 30, మేజర్ న్యూస్ :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపాలనే జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్. శోభిక, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, డిఆర్.డిఎ పిడి సుధారాణి లతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. సాలూరు మండలం బంగారమ్మపేట గ్రామానికి చెందిన ఎ. సూర్యనారాయణ కు, సీతానగరం మండలం ఇప్పలవలస గ్రామానికి చెందిన పి. కుమార్ స్వామి కి చెవిటి మిషన్ ను జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ చేతుల మీదుగా అందజేయడం జరిగిందిప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమంలో 112 అర్జీలు అందాయి. ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన కొన్ని అర్జీ వివరాలు:సీతంపేట మండలం అంటి కొండ పెద్ద గోడ గ్రామంలో ప్రస్తుతం ఉన్న పాఠశాల భవనం పిల్లలకు సరిపోవడంలేదని, పిల్లల చదువు నిమిత్తం అదనంగా పాఠశాల భవనాన్ని మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని గ్రామస్తులు అర్జీ అందజేశారు.గరుగుబిల్లి మండలం రావివలస గ్రామంలో ఉన్న ఎంపిపిఎస్(ఎస్ డబ్ల్యూ) స్కూల్లో బేసిక్ ప్రైమరీ స్కూల్ గా కొనసాగించాలని బి.తిరుపతిరావు,ఇతరలు కోరారుపాచిపెంట మండలం కేరంగి గ్రామానికి కరెంట్ స్తంభాలు లేక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం వారు 30 స్తంభాలకు గాను ఆరు స్తంభాలు సాంక్షన్ అయ్యాయని, మిగిలిన 24 స్తంభాలు కూడా సాంక్షన్ చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ ఎస్.లచ్చయ్య, ఇతరులు దరఖాస్తు అందజేశారు.సాలూరు పట్టణానికి చెందిన కె. సంధ్యారాణి కొత్త రేషన్ కార్డు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు.పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామానికి చెందిన ఎ. అప్పలరాజు మూడు చక్రాల వాహనాన్ని మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పి డి కె.రామచంద్ర రావు, ఐ.సి. డి. ఎస్. పి.డి.డా.టి.కనకదుర్గ,ట్రైబల్ వెల్ఫేర్ డి.డి ఆర్.కృష్ణ వేణి, జిల్లా పశు సంవర్ధక శాఖ జె.డి.ఎస్.మన్మధరావు, ఏ.డి సర్వే లక్ష్మణ రావు,ఆర్. డబ్ల్యూ. ఎస్ ఓ.ప్రభాకర్ రావు,జిల్లా రిజిస్ట్రార్ రామలక్ష్మి, డి పి ఓ కొండల రావు, ఎన్. సి. డి ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. టి.జగన్ మోహన రావు,సోషల్ వెల్ఫేర్ డి. డి ఇంచార్జ్ అప్పన్న, ఎస్. డి సి ధర్మ చంద్రా రెడ్డి.

## గిరిజన సంక్షేమ పాఠశాలలో పదోన్నతులు



**పార్వతీపురం, జూన్ 30, మేజర్ న్యూస్ :** పార్వతీపురం పరిధిలోని గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న అర్హులైన ఎస్ జి టి లకు స్కూల్ అసిస్టెంట్స్, ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం లుగా పదోన్నతులు కల్పించడం జరిగిందని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్. కృష్ణవేణి తెలిపారు. ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు పదోన్నతుల ప్రక్రియ సోమవారం పార్వతీపురం ఐటిడిఏ కార్యాలయంలో నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కౌన్సిలింగ్ లో 19 మందికి పదోన్నతులు కల్పించడం జరిగిందని అందులో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 49 ఖాళీలకు 19 మందికి ఎస్ జి టి విభాగం నుండి పదోన్నతులు కల్పించడం జరిగిందని చెప్పారు. ఎస్ ఎ తెలుగు -1, ఎస్ ఎ ఇంగ్లీషు -3, ఎస్ ఎ లెక్కలు -3, ఎస్ ఎ ఫిజికల్ సైన్స్ -1, ఎస్ ఎ భౌతిక శాస్త్రం -3, ఎల్ ఎఫ్ ఎల్ ప్రధానోపాధ్యాయులు -8 మంది అన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ కె. దేశ్, ఏ టి డబ్ల్యు ఓ కె . చంద్రబాబు పాల్గొన్నారు.




## మాదక ద్రవ్యాల పట్ల అవగాహన కలిగి ఉండాలి



**పార్వతీపురం, జూన్ 30, మేజర్ న్యూస్ :** మాదక ద్రవ్యాల పట్ల ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ అన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు, మత్తు మందులు కుటుంబాలను, ఆరోగ్యాన్ని నాశనం చేస్తుందన్నారు. అవగాహన అత్యావశ్యమన్నారు. ఆరోగ్యమే మహా భాగమని, దానిని కాపాడుకోవడం మన కర్తవ్యం అని ఆయన చెప్పారు. యోగా వంటి ఆరోగ్య అంశాల పట్ల ఆసక్తి కలిగి ప్రతీ రోజు సాధన చేయడం వలన ప్రయోజనాలు ఉంటాయని ఆయన వివరించారు. మాదక ద్రవ్యాలు, మత్తు మందులు ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీయడమే కాకుండా ఆర్థికంగా, మానసికంగా కుటుంబాలను నాశనం చేస్తుందన్నారు. పాఠశాలలు, వసతి గృహాలు పునః ప్రారంభం అయ్యాయని వాటి చుట్టు పక్కల ఎటువంటి విక్రయాలు, కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన నిఘా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. అటవీ, మారు మూల ప్రాంతంలో నాటుసారా తయారీ వంటి అంశాలను గమనించాలని ఆయన ఆదేశించారు. మాదక ద్రవ్యాల విక్రయాలు వివిధ రూపాల్లో ఉండే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయన సూచించారు. మాదక ద్రవ్యాలు, మత్తు మందుల ఉత్పాదకత, సరఫరా, రవాణా, విక్రయాలు, వినియోగం జరిగితే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. వీటికి సంబంధించిన వివరాలు తెలిసినవారు 1972 ఫోన్ నంబరుకు సమాచారం అందించాలని ఆయన కోరారు. రవాణా వాహనాలను తనిఖీలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు.పోలీస్ సూపరింటెండెంట్ ఎస్ వి మాధవ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న చర్యలు వివరించారు. ఈ సమావేశంలో పాలకొండ డి.ఎస్.పి ఎం. రాంబాబు, జిల్లా రవాణా అధికారి వి. దుర్గాప్రసాద్ రెడ్డి, ఏపిఎస్ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ కె.సుమిత్ర, డ్రగ్ ఇన్స్పెక్టర్ ఆశ షేక్, ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ వి. వి. వి. ఎస్. ఎస్. బాబు, ఆర్.పి.ఎఫ్.ఎస్సైఎ.కె.పాణిగ్రహి, పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో పలు అభివృద్ధి పనులను పరిశీలించిన మోటా బృందం



**గుమ్మలక్ష్మీపురం, జూన్ 30 (మేజర్ న్యూస్):** కేంద్ర ప్రభుత్వానికి చెందిన మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ ఎఫైర్స్ బృందం సోమవారం గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఏజెన్సీలో పర్యటించారు. ఈ బృందానికి మోటా సెక్షన్ అధికారి రాహుల్ కురానా నాయకత్వం వహించారు. ఈ బృందం మోటా అందించిన నిధులతో పార్వతీపురం గిరిజన ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వీరు ముందుగా గుమ్మ లక్ష్మీపురంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను పరిశీలించారు. అక్కడ విద్యార్థుల విద్యా ప్రమాణాలను, వసతుల కల్పన, విద్యార్థులకు పెడుతున్న మెనూ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం కురుపాం మండలం, వోబ్బంగి పంచాయతీలో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఏజెన్సీలో జరుగుతున్న కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, పివిటీజీ లబ్ధిదారులకు మంజూరు చేసిన గృహ నిర్మాణం తదితర పనులను పరిశీలించారు. ఈ బృందం వెంట ఐటీడీఏ ఏపీవో మురళి, పిఎఒ శ్రీనివాస్, కురుపాం ఎంపీడీవో ఉమామహేశ్వరి, తహసిల్దార్ జయ, ఐటీడీఏ ఏఈ తిరుపతిరావు, భద్రగిరి టి డబ్ల్యూ ఏఈ అప్పారావు, భద్రగిరి కురుపాం ఐసిడిఎస్ సిడిపిఓలు కె.విజయ గౌరీ, ఎన్. రాజ్యలక్ష్మి, తదితరులు ఉన్నారు.

## పంచాయతీ కార్యదర్శులు సమస్యలు పరిష్కరించాలి



**పార్వతీపురం, జూన్ 30, మేజర్ న్యూస్ :** పార్వతిపురం మన్యం జిల్లా గ్రామపంచాయతీ కార్యదర్శుల సంఘం, పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై పార్వతిపురం మన్యం జిల్లా కలెక్టర్ కి వివిధ మండలాల నుండి వచ్చిన మండల కార్యవర్గ సభ్యులతో కలిసి పార్వతిపురం మన్యం జిల్లా కార్యవర్గం వారు వినతిపత్రం అందజేయడం జరిగింది. దీనిపై జిల్లా కలెక్టర్ వారు సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కారానికి పంచాయతీరాజ్ కమిషనర్ వారికి సిఫారసు చేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడం జరిగింది. దీనిపై జిల్లా కార్యవర్గ సభ్యులు పంచాయతీ కార్యదర్శులు కలెక్టర్ కి ధన్యవాదాలు తెలియజేసుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గం మండల కార్యవర్గ సభ్యులు జిల్లా అధ్యక్షులు బి.రామకృష్ణ ఆధ్వర్యంలో పాల్గొన్నారు.

## 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక ' కార్యక్రమాన్ని నిర్వహించిన ఎస్పీ



**పార్వతీపురం, జూన్ 30, మేజర్ న్యూస్ :** పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి, సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులు వేధింపులు, భర్త/అత్తారింటి వేధింపులు,భూ-ఆస్థి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్లైన్ మోసం,ప్రేమ పేరుతో మోసం,ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని,తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రదాన కార్యాలయానికి పంపవలెనని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 11 ఫిర్యాదులు అందాయి.ఈ కార్యక్రమంలో ఎస్పీ గారితో పాటుగా డిసిఆర్బీ సిఐ ఆదామ్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

జనం కోసమే
సూర్య
www.suryaa.com
మీ అభిప్రాయాలే మా కథనాలు,
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గదర్శకులు.
ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై
మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే
మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి
చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం
మరింత సమాచారం అందించాల్సిన వారు
ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా
తెలియజేయాలని, ఎల్లవేళా అందుబాటులో
ఉంటామని తెలియజేస్తున్నాం..
బి. శ్రీనివాసరావు
ఉత్తరాంధ్ర ఇన్‌చార్జ్
9110383594

# నిఘా నీడలో అప్పన్న గిరిప్రదక్షిణ..!





- ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ
- భారీగా తరలిరానున్న భక్తులు
- ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి ఏర్పాటు
- పోలీసు భద్రత కట్టుదిట్టం
- వారం ముందే అధికారులతో సమీక్ష
- పూర్తిస్థాయిలో పోలీస్ నిఘా
- ట్రాఫిక్ మళ్లింపులు ప్రత్యేక దృష్టి

(మేజర్ న్యూస్, క్రైం బ్యూరో)

దక్షిణ భారతదేశంలోని అత్యంత పవిత్రమైన వైష్ణవ క్షేత్రాలలో తిరుమల తిరుపతి దేవస్థానం కాగా, మరోక పుణ్యక్షేత్రం సింహాద్రి అప్పన్నస్వామి దేవాయలం. తిరుమల తిరుపతి దేవస్థానం తర్వాత అంతటి ఆదాయం కలిగిన దేవాలయంగా సింహాద్రి అప్పన్న దేవాలయం విరాజిల్లుతోంది. సింహాద్రి అప్పన్న దేవస్థానం విశాఖపట్టణానికి 11 కి.మీ.దూరంలో తూర్పు కనుమల్లో, సముద్రమట్టానికి 244 మీటర్ల ఎత్తున సింహగిరి పర్వతంపై వెలసింది. ఈ ఆలయం అత్యంత మహిమాన్వితమైనదిగా భక్తులు చెప్తుంటారు. సింహాద్రి అప్పన్న నిజరూప దర్శనం సంవత్సరానికి 12 గంటలు మాత్రమే భక్తులకు ఉంటుంది. మిగిలిన సమయంలో విగ్రహం చందనంతో కప్పబడి ఉంటుంది. ఉత్తరాంధ్ర ఇలావేల్పు సింహాచలం సింహాద్రి అప్పన్న స్వామి. ఉత్తరాంధ్ర ప్రాంతాలతోపాటు యావత్ దేశంలోని పలు రాష్ట్రాల భక్తుల కొంగుబంగారంగా సింహాచలం సింహాద్రి అప్పన్న స్వామిని కొలుస్తుంటారు. దేశంలోని ఒడిస్సా, పశ్చిమ బెంగాల్‌లో ఉండే భక్తులు తరలివస్తుంటారు. ఈ సింహాద్రి అప్పన్న స్వామి ఆలయంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే గిరిప్రదక్షిణలో పాల్గొనేందుకు విశాఖ చేరుకుంటారు. సింహాద్రి అప్పన్న గిరి ప్రదర్శన తేదీని జూలై 9, 10 న మంచి ముహూర్తం అని సింహాచలం దేవస్థానం అధికారులు వెల్లడించారు.

గిరి ప్రదర్శనకు లక్షలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో తొలి పావంచ వద్ద కొబ్బరికాయలు కొట్టే మార్గంలో అధిక సంఖ్యలో క్యూలైన్లు, కొబ్బరికాయలు కొట్టే ప్రదేశాలు ఎక్కువగా ఏర్పాటు చేయాలని సింహాచలం దేవస్థానం అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే మౌళిక వసతులు ఏర్పాటు చేస్తున్నారు. అనంతరం సింహాచలం కొండపైకి వెళ్లే రెండు ఘాట్ రోడ్ల ప్రవేశ మార్గాలను, గిరి ప్రదర్శన రోడ్డు మార్గాన్ని పరిశీలించి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయనున్నారు.

## 32 కిలోమీటర్ల పాడవున కాలినడకన ప్రదక్షిణ..

విశాఖ జిల్లా సింహాచలం క్షేత్రంలో గిరిప్రదక్షిణ మహోత్సవం అత్యంత వైభవోపేతంగా జరుగనుంది.ఈ పవిత్రమైన గిరిప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొనేందుకు దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఈ కార్యక్రమానికి సుమారు 12 లక్షల మంది హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు.సింహాచలం దేవస్థానం తొలి పావంచ, అడవివరం, అప్పుఘర్,లుంబిని పార్కు, సీతమ్మధార ,కైలాసపురం, మాధవధార మాధవ స్వామి దేవాలయం పరిసరాలు, గోపాలపట్నం మీదుగా సింహాచలం వరకు భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తారు. ఆషాఢ శుద్ధ చతుర్దశి నాటి రాత్రి కొండ దిగువన ఉన్న తొలి పావంచా దగ్గర నుంచి భక్తులు గిరి ప్రదక్షిణ మొదలు పెడతారు. సింహాచలం కొండ చుట్టూ



32 కిలోమీటర్ల పొడవున భక్తులు కాలినడకన ప్రదక్షిణ చేసే ఈ కార్యక్రమానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.గిరి ప్రదక్షిణ అనేది సింహాచలం కొండ చుట్టూ 32 కిలోమీటర్ల దూరం కాలినడకన తిరిగే ఒక మతపరమైన కార్యక్రమం. ఈ ప్రదక్షిణను ఆషాడ శుద్ధ చతుర్దశి రోజున మొదలుపెట్టి, పౌర్ణమి రోజున ముగిస్తారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు, కాబట్టి, ఏర్పాట్లు చాలా పకడ్బందీగా ఉంటాయి. ప్రదక్షిణ చేసే భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులు నిర్ణయించారు. కొబ్బరికాయ కొట్టి ప్రదక్షిణ ప్రారంభించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాలి నడకన సింహగిరి చుట్టూ భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తారు. గిరి ప్రదక్షిణం చేసిన భక్తులు ఆ మరునాడు పున్నమి నాడు ఆలయంలో అప్పన్న స్వామిని దర్శించుకుంటారు.

## కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రతీతి..

జూలై 9న సింహాచలం గిరి ప్రదక్షిణ జరగనుంది. ఈ గిరి ప్రదక్షిణలో పాల్గొనేందుకు లక్షలాది మంది భక్తులు ఏడాది కాలంగా వేచి చూస్తుంటారు. మనసులోని కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రతీతి సింహాద్రి అప్పన్నగా భక్తులచే పిలవబడే లక్ష్మీనరసింహస్వామి కొలువైన దివ్యక్షేత్రం సింహాచలం. దక్షిణ భారత దేశంలో కొలువైన వైష్ణవ క్షేత్రాల్లో ఈ దివ్యవక్షేత్రం చాలా పవిత్రమైంది. ఈ ఆలయానికి తిరుమల తర్వాత అంతటి ప్రాశస్త్యం ఉంది. ఆషాఢ పూర్ణిమను సింహాచలంలో గిరిపున్నమిగా కొలుస్తారు. అక్షయ తృతీయ నుంచి నాలుగు విడతలుగా చందన సేవను స్వీకరించిన సింహాద్రి అప్పన్నస్వామి గిరిపున్నమి నాటికి సంపూర్ణ రూపాన్ని ధరిస్తాడు. అందుకే పున్నమికి ముందురోజు సాయం కాలం నుంచి 32 కిలోమీటర్ల దూరం కాలినడకన సింహాచల గిరి ప్రదక్షిణ చేసిన భక్తులు పున్నమినాడు స్వామి దర్శనం చేసుకుంటారు. ఈ ప్రదక్షిణలో పౌర్ణమి నాడు నిండు చందమామను పోలిన స్వామి పరిపూర్ణ రూపాన్ని దర్శించుకుని మనసులోని కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

## పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు..

గతంలో జరిగిన పలు గిరి ప్రదక్షిణలాగే ఈ ఏడాది కూడా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి మరింతగా బందోబస్తు ఏర్పాట్లను చేస్తున్నారు. గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులతో పాటు నగర ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, ఎక్కడా ట్రాఫిక్ స్తంభించకుండా ముందస్తు చర్యలు తీసుకోనున్నారు. గిరి ప్రదక్షిణలో భాగంగా సముద్ర స్నానాలు చేసే భక్తులను అప్రమత్తం చేసే ఏర్పాట్లపైన, ప్రత్యేకంగా మహిళలలు, పిల్లలు, వృద్ధుల కోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రదక్షిణ ముగించుకొని దర్శనానికి వెళ్లే భక్తులకు క్యూలైన్లు వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎక్కడికక్కడ బారికేడ్ల ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. గిరి ప్రదక్షిణ చేసే మార్గాలన్నీ పూర్తి లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. డ్రోన్ కెమెరాలు, బాడీ వార్న్ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేపట్టనున్నారు. గత ఏడాది జరిగిన గిరిప్రదక్షిణ విజయవంతం అయ్యింది. కాకపోతే కొండమీద ట్రాఫిక్ సమస్య ఏర్పడటం వలన పలువురు వాహనదారులు, భక్తులు ఇబ్బంది పడ్డారు. చందనోత్సవములో ట్రాఫిక్ విషయంలో పూర్తిగా పోలీసులు విఫలమయ్యారని ఆరోపణలు వచ్చాయి. క్యూలైన్లో గోడ కూలి ఏడుగురు మృతి చెందడంతో సిపి ఈసారి సరికొత్త ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలుస్తుంది.

## ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, సిపి, జివిఎంసి కమిషనర్..

గిరి ప్రదక్షిణ కు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్,మున్సిపల్ కమిషనర్,పోలీసు కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది గిరి ప్రదర్శన కు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. వివిధ వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం,వారికి సేవలు అందుబాటులో ఉండే విధంగా కొండ చుట్టూ స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.ఎక్కడికక్కడ మంచినీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కొండ చుట్టూ భక్తుల నడిచే చోటు వీధి దీపాలు వెలిగేలా ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సిపి మాట్లాడుతూ గిరి ప్రదక్షణ సందర్భంగా ఎటువంటి ఆవాచనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు రెండు వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.డ్రోన్ లతో కూడా గిరిప్రదక్షిణ కొనసాగే ప్రాంతాలలో పూర్తిస్థాయిలో నిఘా పెడుతున్నట్లు వెల్లడించారు. మఫ్టి లో కూడా నేరగాళ్ల పై దృష్టి పెడుతున్నట్లు చెప్పారు.కొండ చుట్టూ పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.500 మీటర్ల కు ఒక పోలీసు వాహనం,అంబులెన్స్ సౌకర్యం ఉండేలా చేస్తున్నామన్నారు.భక్తుల సౌకర్యార్థం టోల్ ఫ్రీ నెంబర్ ను కూడా అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నామని చెప్పారు.ప్రతి సిగ్నల్ జంక్షన్ లో డిఎస్పీ, సిఐ స్థాయి అధికారి తో ట్రాఫిక్ పై చర్యలు ఉంటాయన్నారు. అలాగే బీచ్ వద్ద గజ ఈతగాళ్లను కూడా పెడుతున్నట్లు చెప్పారు.మహిళ పోలీసుల తో మహిళ భక్తుల కు పూర్తిస్థాయిలో భద్రత కల్పించనున్నట్లు వెల్లడించారు.

భక్తుల ముసుగులో కొందరు నేరగాళ్లు వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా ఎక్కడికక్కడ నిఘాను మరింత కట్టుదిట్టం చేసామని వెల్లడించారు.ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో భద్రతను కూడా మరింత కట్టుదిట్టం చేసామని చెప్పారు.భక్తులు మాత్రం నిర్ణయించిన రహదారుల పై పై మాత్రమే నడిచే వెళ్లాలని సూచించారు.ఎటువంటి ఇబ్బందులు కలిగిన పోలీసులను సంప్రదించాలని కోరారు.

## అద్వాన్నంగా రోడ్డు.. పట్టించుకోని పాలకులు



**కురుపాం, జూన్ 30 (మేజర్ న్యూస్):** కురుపాం మండలం వబ్బంగి పంచాయితీ కి చెందిన కాకిలి నుంచి సాకి వెళ్ళేరోడ్డు సుమారు 5 నుంచి 6 కిలోమీటర్లు ఉండగా రోడ్డు మొత్తం అద్వాన్నంగా తయారైంది రోడ్డుపై రాళ్లు తేలడంతో ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. దయచేసి కాకలి నుంచి సాకి రోడ్డును తారు రోడ్డు వేసి ప్రజలకు విముక్తి కలిగిస్తారని ప్రజలు కోరుతున్నారు

## మున్సిపల్ పోర్టికోలో కుర్చీలు తొలగింపుపై వైసిపి కౌన్సిలర్‌లు అభ్యంతరం





**బొబ్బిలి, జూన్ 30, మేజర్ న్యూస్:** మున్సిపల్ సాధారణ సమావేశం సోమవారం మున్సిపల్ చైర్మన్ ఆర్ శరత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎజెండా లో పలు అంశాలను ఏకగ్రీవంగా సభ్యులు ఆమోదించారు. అనంతరం వైసిపి సభ్యులు మాట్లాడుతూ 31 వార్డులకు సమానంగా జనరల్ ఫండ్ ఖర్చుపెట్టి, అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. త్రాగునీటి సమస్య ఎక్కువగా ఉంది,దీనిపై తక్షణం అధికారులు చర్యలు తీసుకోవాలని వైస్ చైర్మన్ చెలికాని మురళి మరియు ఇతర కౌన్సిలర్స్ అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. ప్రజలకు అవసరమైన ప్రాంతాలలో పబ్లిక్ టాయిలెట్స్ కట్టాలని ఒకటో వార్డు కౌన్సిలర్ చోడుగంజి రమేష్ విజ్ఞప్తి చేశారు. పట్టణం లో పారిశుధ్యం పనులు మరియు డ్రైనేజ్ వ్యవస్థ నిర్వహణ ప్రకడ్బందీగా చేపట్టారని కౌన్సిలర్ లు అందరు అధికారులకు సూచించారు.అభివృద్ధి పనులన్నీ పారదర్శకంగా,వేగవంతంగా జరగాలని అధికారులకు కౌన్సిలర్లు అందరూ సూచించడం జరిగింది.మున్సిపల్ ఆఫీస్ పోర్టు–కో వద్ద కుర్చీలు తొలగింపుపై,వైసీపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆఫీస్ గేటు ముందర కుర్చీలు ఎక్కడ ఉండవు,ఆఫీస్ లోపల ఉంటాయి అని మున్సిపల్ చైర్మన్ శరత్ వైసిపి కౌన్సిలర్ లకు గట్టిగా సమాధానం చెప్పారు. కౌన్సిలర్స్ వారి పనుల నిమిత్తం చైర్మన్ వద్దకు,అలాగే కమిషనర్ వద్దకు ఎప్పుడైనా రావచ్చు,పనులు చేయించుకోవచ్చు అని చైర్మన్ తెలిపారు. సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు అధికారులు స్పష్టమైన సమాధానాలు ఇవ్వడం లో విఫలం అయ్యారు. అనంతరం సభ్యులు అడిగిన అన్ని సమస్యలపైన దృష్టి పెట్టి, త్వరితగతిన పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను చైర్మన్ శరత్ బాబు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎల్, రామలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

## సిపిఓ సేవలు అభినందనీయం




**పార్వతీపురం, జూన్ 30, మేజర్ న్యూస్ :** జిల్లా ప్రణాళిక అధికారి వీర రాజు సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ అన్నారు. జిల్లా ప్రణాళిక అధికారి వీర రాజు పదవీ విరమణ కార్యక్రమం సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వీర రాజు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీరరాజు మంచి సేవాతత్పరతతో వృత్తిని నిర్వహించారన్నారు. అంకితభావంతో సేవలు అందించడం వలన మన్ననలు పొందగలరని పేర్కొన్నారు సీనియర్ల సేవలను జూనియర్లు గుర్తించి వారిని మార్గదర్శకంగా తీసుకొని పనిచేయాలని సూచించారు. జిల్లా ప్రణాళిక అధికారి పి. వీర రాజు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో పనిచేయడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. వృత్తిలో సంతృప్తిని పొందానని ఆయన పేర్కొన్నారు. విధులు సక్రమంగా నిర్వర్తించుటకు సహకరించిన జిల్లా కలెక్టర్, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎస్ఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బొబ్బిలి నియోజకవర్గంలో ఉన్న దేవాలయాల సమస్యలను పరిష్కరించాలి



**బొబ్బిలి, జూన్ 30, మేజర్ న్యూస్:** బొబ్బిలి నియోజకవర్గంలో ఉన్న దేవాలయాల సమస్యలను పరిష్కరించాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కె కె రంగారావు (బేబినాయన) కోరారు. ఈ మేరకు అమరావతి పర్యటనలో భాగంగా గౌరవ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ని వారి పేషీ యందు ఎమ్మెల్యే బేబినాయన మర్యాదపూర్వకంగా కలిసి బొబ్బిలి నియోజకవర్గంలో ఉన్న దేవాదాయ శాఖకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా సిజిఆఫ్ నిధుల మంజూరు చేయాలని కోరారు. బొబ్బిలి నియోజకవర్గంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న దేవాలయాలకు సంబంధించి పెండింగులో ఉన్న ధూప దీపాల నిధులు విడుదల చేయాలన్నారు. బలిజిపేట మండలం అజ్జాడలో ఉన్న బొబ్బిలి వేణుగోపాలస్వామి ఆలయానికి సంబంధించిన భూములు గురించి మాట్లాడారు. వీటిపై మంత్రి ఆనం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.గౌరవ మంత్రి అధికారులతో చర్చించి వీలైనంత త్వరగా ఈ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపుదల చేయాలి



**గరుగుబిల్లి, జూన్ 30, మేజర్ న్యూస్:** మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంపుదల చేయాలని మండల విద్యా శాఖ అధికారి(1)సామల సింహాచలం అన్నారు.మండల విద్యాశాఖ కార్యా లయంలో సోమవారం ఎన్రోల్మెంట్ స్పెషల్ డ్రైవ్ పై ప్రత్యేకంగా సి ఆర్ ఎం టి లతో సమావేశం నిర్వహించా రు.ఈసందర్భంగా మండల విద్యా శాఖ అధికారి సింహాచలం మాట్లా డుతూ విద్యార్థుల నమోదును శత శాతం పూర్తి చేయాలని ఆదేశించా రు.మోడల్ ప్రైమరీ స్కూల్స్ లో విద్యార్థుల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.అదే విధంగా ఒకటి,ఆరు తరగతుల నమోదు శత శాతం పూర్తి చేయాలని సూచించా రు.మండలంలో డ్రాపౌట్స్ లేకుండా తగిన విధంగా చర్యలు తీసుకో వాలన్నారు.సిఆర్ఎంటిలు క్షేత్ర స్థాయిలో పాఠశాలలను సందర్శించి విద్యార్థుల హాజరు, స్టూడెంట్ కిట్స్ పంపిణీ అదేవిధంగా పాఠశాలల స్థితిగతులపై నివేదిక సమర్పించా లని కోరారు.ఈకార్యక్రమంలో ఎంఈ ఓ (2) కె కొండలరావు, సి ఆర్ ఎం టి లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నా రు.

## శివాలయానికి బంగారు మకర తోరణం బహూకరించిన గులివెందల గౌతం




**గుమ్మలక్ష్మీపురం, జూన్ 30 (మేజర్ న్యూస్):** స్థానిక శ్రీశ్రీశ్రీ కైలాసనాథ స్వామి శివాలయానికి 15000 రూపాయల విలువగల బంగారు మకర తోరణాన్ని శివాలయం మండపం వద్ద కీర్తిశేషులు గులివెందుల వేణు జ్ఞాపకార్థం ఆయన చిన్న కుమారుడు గులివెందుల గౌతమ్ సోమవారం బహూకరించారు. శివలింగం వెనుక ఉన్న మకర తోరణం తయారు చేయడానికి 15000 రూపాయలు గౌతమ్ ఆయన కుమార్తె చిట్టితల్లి చేతుల మీదుగా గతంలో గ్రామ పెద్దలకు అందజేశారు. అయితే సోమవారం గ్రామ పెద్దల సమక్షంలో దేవునికి సమర్పించడం జరిగిందన్నారు. ఈ మేరకు గౌతం, వారి కుటుంబ సభ్యులకు పంచాయతీ తరపున ధన్యవాదములు తెలియజేస్తున్నామని సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మద్ది దొరబాబు, కొనసా సూర్యం, ఆచారి, కోరాడ మన్మధ రావు, కొత్తకోట విష్ణు ప్రసాద్, సొంటీన సురేష్ కుమార్, బోద్దాపు గణేష్, కే. మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతికి పాల్పడిన సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవు: తహశీల్దార్ శ్రీను



**బొబ్బిలి, జూన్ 30, మేజర్ న్యూస్:** రెవిన్యూ సమస్యలు పరిష్కారానికి సిబ్బంది చిత్తశుద్ధితో నిజాయితీ తో విధులు నిర్వహించాలని, అవినీతికి పాల్పడిన సిబ్బంది పైన కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఎం శ్రీను హెచ్చరించారు.ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రామ రెవెన్యూ అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పైన సకాలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని తహశీల్దార్ ఎం శ్రీను తెలిపారు. జీఓ నెంబర్ 30 ప్రభుత్వ స్థలాల్లో 2019 ముందు ఇల్లు నిర్మాణం చేపట్టిన ఇల్లుకు క్రమబద్ధీకరణ చేయడానికి వచ్చిన దరఖాస్తులపైన పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని ఆదేశించారు.

## శంభంగిని మర్యాదపూర్వకంగా కలిసిన తూముల దంపతులు



**బొబ్బిలి, జూన్ 30, మేజర్ న్యూస్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళ విభాగం ప్రధాన కార్యదర్శిగా తూముల అచ్యుతవల్లి ని అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి నియమించిన విషయం తెలిసిందే.ఈ సందర్భంగా సోమవారం ఉదయం బొబ్బిలి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ని విద్యాసంస్థలు అధినేత తూముల భాస్కరరావు, అచ్యుతవల్లి దంపతులు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

# కార్పొరేట్లకు వరాలు-ప్రజలపై భారాలు



**పాలకొండ, జూన్ 30, మేజర్ న్యూస్:** టిడిపి కూటమి ఏడాది పాలన "కార్పొరేట్లకు వరాలు ప్రజలపై భారాలు" గా ఉన్నదని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దావాల రమణారావు అన్నారు. స్థానిక సిపిఎం పార్టీ పాలకొండ మండల కేంద్రంలో దారి తప్పుతున్న టిడిపి కూటమి ఏడాది పాలన పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ఏడాది పాలన తల క్రిందులుగా ఉన్నదని అన్నారు. ప్రజలకు హామీలు, వాగ్దానాలు, మాటలే మిగిలాయని, కార్పొరేట్లకు కారుచౌకగా భూములు కట్టబెడుతున్నారని, వారి పనులు వేగమవుతున్నాయని వారు విమర్శించారు. సూపర్ -6 తో సహా హామీలు వైఫల్యం, విద్యుత్తు, పన్నుల భారాలు, గిట్టుబాటు ధర లేకపోవడం కనీస వేతనాలు అమలు కాకపోవడం, ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుందని వారు అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలు ఏఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదని, జీడికి గిట్టుబాటు ధర ఇచ్చి బోర్డు ఏర్పాటు చేస్తామన్న వాగ్దానం అమలు జరగలేదని, తోటపల్లి ఎడమ కాలువ ఆధునీకరణ నిధులు కేటాయించి ఆయకట్టు రైతులకు సాగునీరు అందిస్తామన్నారు జంపర్ కోట రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు పాలకొండలో రైతు బజార్ గిరిజన ఉత్పత్తులతో చిన్న చిన్న పరిశ్రమలు నెలకొల్పే యువతకు ఉపాధి కల్పిస్తామని తదితర సమస్యలు పరిష్కారం నేటికీ అమలు జరగలేదని వారు విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో అధమ స్థానంలో ఉన్న ప్రభుత్వం ప్రజల పైన భారాలు వేయడంలో ప్రథమ స్థానంలో ఉందని వారు విమర్శించారు. స్మార్ట్ మీటర్లు తో సామాన్యులకు లక్షలలో బిల్లులు వస్తున్నాయని, ఈ సంవత్సరంలో విద్యుత్ ఛార్జీల ద్వారా 15 వేల నాలుగు వందల ఎనభై ఐదు కోట్ల రూపాయల భారాన్ని వేసిందని విమర్శించారు. నగరాల్లో ఇల్లు, షాపులు, ఖాళీ స్థలాలు కు విలువ ఆధారిత ఆస్తి పన్ను భారీగా పెంచారని విమర్శించారు. టిడిపి ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని చెప్పడంతో పాటు స్మార్ట్ మీటర్ల కు వ్యతిరేకంగా కోర్టులో కేసు వేశారని,. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత టిడిపి స్మార్ట్ మీటర్లు బిగిస్తోందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు ప్రజలు వ్యతిరేకించాలని వారన్నారు. టిడిపి కూటమి ఇచ్చిన వాగ్దానాలను ఇకనైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాలకొండ నగర పంచాయతీలు డంపింగ్ యార్డ్ సమస్య త్రాగునీరు సమస్య చివరి ప్రాంతాల మౌలిక సదుపాయాలు రోడ్డు విస్తరణ బైపాస్ రోడ్డు ఏర్పాటు మినీ స్టేడియం పాలిటెక్నికల్ కాలేజీ తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు అర్ధముడి లక్ష్మణరావు, కాదా రాము ,దూసి దుర్గారావు, ఏ భాను సుందర్, వివిధ ప్రజాసంఘాల నాయకులు ఎస్ మజ్జి య ,ఎస్ చిన్నారావు, రమేష్ ,జోషి ,తదితరులు ఉన్నారు.

# మెగా విద్యా కమిటీ సమావేశాలు విజయవంతం చేయాలి



**రామభద్రపురం, జూన్ 30 మేజర్ న్యూస్:** మండలంలో ఈ నెల 5వ తేదీన జరగనున్న మెగా విద్యా కమిటీల సమావేశాలు విజయవంతం చేయాలని మండల టీడీపీ అధ్యక్షులు కరణం విజయభాస్కర్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ సమావేశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, కావున ప్రతీ ఒక్కరూ పాల్గొని పండగ వాతావరణంలా ఈ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. విద్యాశాఖా మంత్రి లోకేష్ ఈ సమావేశాలపై ఎంత చిత్తశుద్ధి కనబరుస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా విద్యావ్యవస్థలో పెనుమార్పులు సాధించడానికి మంత్రి లోకేష్ పట్టుదలతో ఉన్నారని, ఇందులో భాగంగా విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు తెచ్చి విద్యాభివృద్ధికి తోడ్పాటు అంది సు న్నారని తెలిపారు. ఈ విషయంలో ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకొని ఈ సమావేశాలు జరపాలని కోరారు. ఈ సమావేశంలో కొండకెంగువ మాజీ సర్పంచ్ సిరిపురపు శ్రీనివాసరావు తదితర లు పాల్గొన్నారు.

# కార్యదర్శులపై వినతి పత్రం అందజేత



**గరుగుబిల్లి, జూన్ 30, మేజర్ న్యూస్:** గ్రామపంచాయతీ కార్య దర్శుల సమస్యలు పరిష్కరించ డంతోపాటు కార్యదర్శులకు పని భారం తగ్గించాలని కోరుతూ ఇంచార్జ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాలి అర్జునరావుకు గ్రామ పంచాయ తీ కార్యదర్శులు సోమవారం వినతి పత్రం అందజేశారు.ఈ మేరకు గ్రామపంచాయతీ కార్యదర్శులు బంటు అప్పారావు, నీరస రవికుమార్, బొంతల వైకుంఠరావు, మరిశర్ల భార్గవ్, పత్తి వెంకటరమణ, శివ్వాల రాంబాబులు మాట్లాడుతూ పంచాయతీరాజ్ కమిషనర్ మౌఖిక ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శుల పంచాయతీలకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఉదయం ఆరు గంటల నుండి పారిశుధ్య పనులు నిర్వహణ నిమిత్తం విధులకు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసి ఉన్నారని దీనివల్ల మహిళా కార్యదర్శులుతోపాటు, వయసు పైబడిన మరియు ఆరోగ్య సమస్యలు ఉన్న కార్యదర్శులు ఇబ్బందులకు గురవుతున్నారని ఎంపీడీవోకు అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు.అదేవిధంగా పారిశుద్ధ్య పనులలో భాగముగా రోజువారి చెత్త సేకరణ విధులు నిర్వహణ కొరకు ఐ.వి.ఆర్.ఎస్ కాల్స్ ఆధారంగా పంచాయతీ కార్యదర్శుల పనితీరును బేరీజు వేయకుండా ఉండాలని కోరారు.డీడీవోలుగా విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షణలో సచివాలయ సిబ్బంది అందరూ సర్వీసు పుస్తకం (ఎస్ ఆర్)లేనందు వల్ల ఆ సర్వీస్ పుస్తకాలు నిర్వహించే లైన్ డిపార్ట్మెంట్ కు చెందిన అధికారులు జీతభత్యాలు ఇచ్చే విధంగా ఆదేశాలు జారీ చేయాలని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఉదయం 6 గంటలకు విధులు కు హాజరు కావలసి వస్తే ఉదయం 6 గంటల నుండి పదిన్నర వరకు మరియు మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదున్నర గంటల వరకు పని వేళలు మార్పు చేయాలని కోరారు. గ్రామపంచాయతీ కార్యదర్శుల సమస్యలను ఉన్నతాధికారులు పరిష్కరించని యెడల జులై 4వ తేదీన నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలియజేయడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శులు అప్పారావు, రవికుమార్, వైకుంఠరావు, భార్గవ్, తదితరులు తెలిపారు. అప్పటికి ఉన్నతాధికారి నుంచి ఎటువంటి స్పందన లేనియెడల తొమ్మిదవ తేదీన కార్యదర్శుల విధులకు సంబంధించి పెన్డౌన్ చేస్తూ నిరసన తెలియజేయునన్నామని పేర్కొన్నారు.15వ తేదీ నుండి శాంతియుత నిరసన తెలియజేస్తూ రాష్ట్ర సంఘాల ఆదేశాల మేరకు తొలుత ధర్నా కార్యక్రమం చేపట్టిన అనంతరం సమ్మెబాట పట్టనున్నామని కార్యదర్శులు తెలియజేశారు.ఈమేరకు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్యదర్శులు వినతి పత్రంను అందజేయడం జరిగిందని ఈ విషయంను ఉన్నతాధికారులకు తెలియజేయడం జరుగుతుందని ఇన్చార్జ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాలి అర్జునరావు వెల్లడించారు.

# ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై కఠిన చర్యలు



**రామభద్రపురం, జూన్ 30 మేజర్ న్యూస్:** మండలంలో ప్రభుత్వ స్థలాలు, భూముల ఆక్రమణదారులపై ఖటిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అజు రఫీ జాన్ హెచ్చరించారు. మ ండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఆక్రమణదారుల జాబితాలను సిద్ధం చేస్తున్నామని, వారికి నోటీసులు ఇవ్వనున్నట్టు తెలిపారు. అలాగే మం డలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, ముఖ్యంగా విఆర్వోల వద్ద ఎటువంటి పెండింగ్ కేసులు ఉంచరాదని సూచించారు. గ్రీవెన్స్లో వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా కొండకెంగువ, కొట్టిక్కి, తారాపురం, రామభద్రపురం గ్రామాల్లో ఎక్కువగా సమస్యలు ఉన్నట్టు గుర్తించామన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి చిత్తశు ద్ధితో పనిచేస్తామన్నారు.

# తుఫాన్‌కు అప్రమత్తమైన విద్యుత్ శాఖాదికారులు

## పలుగ్రామాల్లో పర్యటించిన ఏఈ బడే శ్రీనువాసనాయుడు



**గరుగుబిల్లి, జూన్ 30, మేజర్ న్యూస్:** బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ శాఖకు సంబంధించి అప్రమత్తంగా ఉన్నామని మండల విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ బడే శ్రీనువాసనాయుడు తెలిపారు. తుపాన్ కారణంగా మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పరిశీలించిన అనంతరం మండల కేంద్రంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. తుఫాన్ కారణంగా గాలులు వీచే అవకాశం ఉన్నందున ఏ గ్రామంలోనైనా విద్యుత్ స్తంభాలు, విరిగిన, వైర్లుతెగిన, తక్షణమే సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించడంతో పాటు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే గ్రామస్థాయి విద్యుత్ శాఖ అధికారులకు తెలియ జేశామన్నారు.తుఫాన్ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. విద్యుత్తు స్తంభాలను సిద్ధంగా ఉంచామన్నారు.అదేవిధంగా ఏగ్రామంలోనైనా విద్యుత్ వైర్లు తెగితే తక్షణమే సమాచారం అందించాలని ఏ ఈ శ్రీను వాసనాయుడు కోరారు.

# మద్యంతాగి వాహనాలు నడపడంవలన కుటుంబాలు నాశనం అవుతాయి



**రామభద్రపురం, జూన్ 30: మేజర్ న్యూస్:** : మద్యం తాగి వాహనాలు నడపడం వలన ఎన్నో కుటుంబాలు నాశనమవుతున్నాయని ఎస్ఐ వెలమల ప్రసాదరావు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్లో సోమవారం మద్యం తాగి వాహనాలు నడిపేవారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యంతాగినవారే కాకుండా అమాయక ప్రజలు కూడా ఈ సంఘ ఎటనలో బలైపోతున్నారని తెలిపారు. ప్రతీరోజూ చాలా మంది యువత మద్యానికి బానిసై బంగారు జీవితాలు నాశనం చేసుకుంటున్నారని, కనీసం హెల్మెట్లేకుండా కూడా ప్రయాణం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం ఇప్పటికే ఎన్నో కఠినమైన చట్టాలు తీసుకువచ్చినప్పటికీ ఎవరూ స్పందించక పోవడం విచారకరమని అన్నారు. ఇటీవల కాలంలో మద్యంతాగి వాహనాలు నడిపిన వారికి ఒక్కొక్కరికి రూ.10వేల జరిమానా లేదంటే జైలు శిక్ష కూడా శిధిస్తున్నారని తెలిపారు. రాత్రివేళల్లో విస్తృతంగా వాహన తనిఖీలు చేస్తున్నావ ఎని ఇందులో బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షలు చేస్తున్నప్పుడు 3 నుంచి 400 వరకు రీడింగ్వడం ఆందోళన కలిగిస్తోందని ఇప్పటికైనా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

# పింఛన్‌లు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి




**గరుగుబిల్లి, జూన్ 30,మేజర్ న్యూస్:** ఎన్ టి ఆర్ భరోసా పెన్షన్లు జూన్ నెలకు సంబంధించి మంగళవారం పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఇంచార్జ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాలి అర్జునరావు తెలిపారు.మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు.మండల పరిధిలోని ఆయా గ్రామాల గ్రామ పంచాయతీల కార్యదర్శులు నగదును సిద్ధం చేసుకుని పంపిణీకి తగు చర్యలు చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా పింఛన్ల పంపిణీకి సంబంధించి తగు సూచనలు సలహాలు అందజేయడం జరిగింద న్నారు.మంగళవారం సాయంత్రంలో గా పింఛన్లు పంపిణీ పూర్తి చేసేందు కు చర్యలు చేపట్టాల్సి ఉందని తెలిపారు.పంపిణీ చేయగా ఇంకా ఎవరైనా పింఛన్లు తీసుకోని యెడల ఆవివరాలను మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంకు తెలియ జేయాల్సి ఉందని ఎంపీడీవో అర్జున రావు వెల్లడించారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేత



**పూసపాటిరేగ, జూన్ 30, మేజర్ న్యూస్:** నెల్లిమర్ల నియోజకవర్గం లోని వివిధ ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతూ శస్త్ర చికిత్సలు చేసుకున్న ముగ్గురికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చెక్కులు మంజూరు కావడంతో వాటిని జనసేన పార్టీ కార్యాలయంలో నాగ మాధవి చేతులమీదుగా భారతి తో కుటుంబాలకు సోమవారం అందజేశారు. భోగాపురం మండలంలోని గూడెప వలస గ్రామానికి చెందిన సరగడ రామదాసు అనారోగ్యంతో బాధపడుతుండగా రూ.2.20లక్షలు, చిన్న రావాడ గ్రామానికి చెందిన బమ్మిడి సూరి అనారోగ్యంతో బాధపడుతుండగా అతని వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 62,000, పెదరావాడ గ్రామానికి చెందిన గొంప సాగర్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండగా అతని వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1,62000 లు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు మంజూరు కావడంతో వాటిని బాధిత కుటుంబాల సమక్షంలో ఎమ్మెల్యే లోకం నాగ మాధవి చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు కూడా పాల్గొన్నారు.

## వెంగళరాయ సాగర్, పెద్ద గెడ్డ కలువల అభివృద్ధికి మంత్రి సంధ్యారాణి కృషి చేయాలి



**బొబ్బిలి, జూన్ 30: మేజర్ న్యూస్:** సాలూరు, బొబ్బిలి నియోజకవర్గానికి సంబంధించిన వెంగళరాయ సాగర్, పెద్ద గెడ్డ కాలువలు అభివృద్ధి కి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కృషి చేయాలని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కె కె రంగారావు (బేబినాయన) కోరారు.ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా అండ్ శిశు సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి ని మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే బేబినాయన కలిసారు.ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే బేబినాయన అమరావతిలో గౌరవ మహిళా %ఁ% శిశు సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి ని మర్యాదపూర్వకంగా కలిసి, పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబినాయన మాట్లాడుతూ బొబ్బిలి సాలూరు నియోజకవర్గాల కు సంబంధించి వెంగళరాయ సాగర్ కాలువ మరియు పెద్దగెడ్డ కాలువల అభివృద్ధి గురించి మాట్లాడారు.పాతబొబ్బిలి నుంచి మక్కువ వెళ్లే రోడ్డు అభివృద్ధి గురించి చర్చించారు మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ, సత్వరమే ఈ సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి రెండు నియోజకవర్గాలకు సంబంధించిన ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతానని తెలిపారు.

## పెదమానాపురంలో పోలీసులు పల్లెనిద్ర



**దత్తిరాజేరు, జూన్ 30, మేజర్ న్యూస్:** మండలంలో పెద మానాపురం గ్రామంలో అంగన్వాడి కేంద్రం వద్ద పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై జయంతి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వం శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టి తద్వారా శాంతిభద్రతలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాల జోలికి పోయి యువత జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. అసాంఘిక కార్యకలాపాలుకు, గంజాయి రవాణా అడ్డుకట్ట వేయడానికి గ్రామస్తుల సహకరించాలన్నారు.

## దేశవ్యాప్త సమ్మెలో వీఆర్ఏలు భాగస్వామ్యం కావాలి



**పూసపాటిరేగ, జూన్ 30, మేజర్ న్యూస్:** దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గ్రామ సేవకులు భాగస్వాములై తమ డిమాండ్లను పరిష్కారం అయ్యే విధంగా సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని విఆర్ఏలు తాసిల్దార్ సంజీవ్ కుమార్ కు సోమవారం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం 42 కార్మిక చట్టాలు గాను 29 చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లుగా విభజించిందని ఈ చట్టాల వలన కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందంటూ వీఆర్ఏలు ఆవేదన వ్యక్తం చేశారు. జులై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో వీఆర్ఏలు భాగస్వామ్యులై వీఆర్ఏలకు పే స్కేలు ప్రభుత్వం అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని, వీఆర్ఏలకు ప్రమోషన్లతో పాటు నామినేల్ గా ఉన్న వారిని వీఆర్ఏలుగా నియమించాలని, అదేవిధంగా అటెండర్లు, నైట్ వాచ్మెన్ లకు 20 శాతం ఉన్న ప్రమోషన్ కోటాను 70 శాతానికి వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ వినతలతో కూడిన పత్రాన్ని తాసిల్దార్ సంజీవ్ కుమార్ కు తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం అందజేశారు.

## గిరిజనులకు భూపట్టాలు పంపిణీ చేయాలి





**మెంటాడ, జూన్ 30, మేజర్ న్యూస్:** గిరిజనులు, దళితులు గత యాభై ఏళ్లుగా సాగుచేస్తున్న అటవీ, బంజరు,ప్రభుత్వ భూములకు పట్టాలు పంపిణీ చేయాలని గిరిజనులు, దళితులు ధర్నా చేపట్టారు.సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు రాకోటి రాములు మాట్లాడుతూ మండలంలో సుమారుగా 1500మంది గిరిజన, హరిజన నిరుపేదలు ఎన్నో ఏళ్లుగా సాగుచేస్తున్న అటవీ, బంజరు, ప్రభుత్వ పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారికి భూపట్టాలు పంపిణీ చేయడంలో జాప్యం చేస్తున్నారని ఆయన డిమాండ్ చేశారు.గత తహశీల్దార్ శ్రీనివాసరావు వద్ద పట్టాల పంపిణీ విషయంలో పలుమార్లు అర్జీలు పెట్టుకున్న తరుణంలో భూసర్వే నిర్వహించారు.సర్వే అనంతరం సబ్ డివిజన్ చేయకపోవడంతో పంపిణీ చేయలేదు.ఇంతలో ఆయన బదిలీపై వెళ్లిపోయారు.ప్రస్తుత తహశీల్దార్ అరుణకుమారి నిరుపేదలకు సబ్ డివిజన్ చేయించి అర్హులైన వారికి భూపట్టాలు పంపిణీ చేయాలని ఆయన కోరారు.అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం గా రైతులకు ఇవ్వడం జరుగుతుందని ప్రభుత్వం ప్రకటించింది.ఈ పథకం వీరికి వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని రాములు డిమాండ్ చేశారు.సుమారుగా పది గిరిజనగ్రామాలు మల్లేడవలస,సారాడవలస,కొండపర్తి, పనసలవలస, పనుకువానివలస, జక్కువ, లోతుగెడ్డ,జీరికవలస,ఆంధ్ర,కొండలింగా వలసపంచాయితీ మధుర గిరిజన గ్రామాలు తదితరులు 300మంది బారీగా దరఖాస్తులు సోమవారం చేసుకున్నారు.అనంతరం దరఖాస్తులు తహశీల్దార్ అరుణకుమారి కి అందజేసారు. మెంటాడ నుంచి మల్లేడవలసకు,ఆంధ్ర నుంచి కుంబివలస కు,కొండపర్తి వద్ద కల్వర్టు నిర్మించాలని ఎంపిపి రెడ్డి సన్యాసి నాయుడు, ఎంపిడిఓ ఏ భానుమూర్తి కు వినతిపత్రం అందజేశారు.అలాగే త్రాగునీరు కొండపర్తి,మల్లేడవలస,మిర్తివలస గ్రామాల కు తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.ఈకార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు రాయిపల్లి రాము,దాట్ల హనుమంతరాజు, గిరిజన సంఘ జిల్లా సహాయ కార్యదర్శి తామరపల్లి సోములు,జంగమయ్య,సిడగం జానకి,మల్లేడ రవి తదితరులు పాల్గొన్నారు.

## నిఘా నేత్రాల నీడలో చోడమగ్రహారం



**పూసపాటిరేగ, జూన్ 30, మేజర్ న్యూస్:** జాతీయ రహదారిని ఆనుకుని నిచ్చో రద్దీగా ఉండే చోటమ్మా అగ్రహారం పంచాయతీకి మెగా నేత్రాలను ఏర్పాటు చేసి నిర్ఘయంతను అరికట్టాలని పంచాయితీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. పంచాయతీ పరిధిలో పరిశ్రమలు ఉండడంతో పాటు వాణిజ్యపరంగా రద్దీగా ఉండడంతో స్థానిక సర్పంచు కొత్తకోట శ్రీరాములు నీకానేత్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. జాతీయ రహదారిని ఆనుకొని పడమర భాగంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో ఒక సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా తూర్పు భాగంలో జాతీయ రహదారిని ఆనుకొని రక్షిత మంచినీటి పథకం సమీపంలో మరో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అత్యధిక మంది బాలికలు చదువుతుండగా బాలికల రక్షణ చర్యల్లో భాగంగా ఒక సీసీ కెమెరాను ఏర్పాటు చేయగా రక్షిత మంచినీటి పథకం వద్ద నేరాలు జరగకుండా ముందు జాగ్రత్తగా మరో సీసీ కెమెరాలు పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ కొత్తకోట శ్రీరాములు తెలిపారు.

## గ్రీన్ అంబాసిడర్ల ఆకలి మంటలు అధికారులకు పట్టవా?

### సీఐటీయు జిల్లా నాయకుడు బలసా శ్రీనివాసరావు





**రామభద్రపురం, జూన్ 30 (మేజర్ న్యూస్):** గ్రీన్ అంబాసిడర్లకు బకాయి ఉన్న జీతాలు వెంటనే విడుదల చేయాలని సిఐటీయు జిల్లా కమిటీ సభ్యులు బలసా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలల నుంచి 15 నెలల వరకు జీతాలు బకాయిలు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గ్రామ పంచాయతీలో అపారిశుధ్యం నిర్మూలించడానికి గ్రీన్ అంబాసిడర్లు ఎంతో శ్రమ చేస్తున్నారని, అయినప్పటికీ ప్రభుత్వం ప్రతినెలా జీతాలు చెల్లించకుండా వారి జీవితాలతో చెలగాటం ఆడడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. ప్రజల ప్రాణాలను కాపాడుతున్న గ్రీన్ అంబాసిడర్లకు చాలీచాలని జీతంతో జీవితాలు నెట్టుకొస్తున్నారన్నారు. అంతేకాకుండా అధికారులు కూడా ఈ బకాయిలు చెల్లించడంలో అలసత్వం చూపుతున్నారని ఆరోపించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో రత్నంకు అందించారు. ఈ సందర్భంగా 15వ ఆర్థిక సంఘం నుంచి గ్రీన్ అంబాసిడర్లకు బకాయిలు చెల్లిస్తామని ఎంపీడీవో హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు పోలిరాజు, రామకృష్ణ, గంగరాజు, రాము, శ్రీరాము పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ క్రికెట్ పోటీలను ప్రారంభించిన కూటమి నాయకులు



**పరవాడ, జూన్ 30, మేజర్‌న్యూస్:** రియా ఫౌండేషన్ పరవాడ జర్నలిస్ట్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విశాఖ ఫార్మాసిటీ క్రీడామైదానంలో ఒక్కరోజు ఆహ్వానపు జర్నలిస్టు క్రికెట్ పోటీలు సోమవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. రియా ఫౌండేషన్ ఐదో వార్షికోత్సవం సందర్భంగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సోదరుడు పంచకర్ల ప్రసాద్, రియా ఫౌండేషన్ చైర్మన్ ఎండి రాజు, ఏపీయూడబ్ల్యూజే పరవాడ ప్రెస్ క్లబ్ సెక్రటరీ కోమటి శివాజీ తదితరుల జన్మదిన%శీ% పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈ క్రికెట్ పోటీలను కూటమి నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. మాజీ జడ్పిటిసి సభ్యులు పైలా జగన్నాధ రావు, జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా కార్యదర్శి బుగుడి రామ గోవిందరావు, మండల జనసేన పార్టీ అధ్యక్షుడు బొద్దపు శ్రీను కాసులు, పరవాడ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు, పంచకర్ల ప్రసాద్ కుమారుడు మణికంఠ, పెద్ద చెరువు ఆయకట్టు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసురావు, తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ప్రారంభం అనంతరం కొద్దిసేపు క్రీడాకారులతో క్రికెట్ ఆడారు. విశాఖ వారియర్స్, గాజువాక ఏ, గాజువాక బి, పరవాడ క్రికెట్ టీం తో సహా నాలుగు జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బండారు రాజు, టిడిపి నాయకులు వసంతరావు, పరవాడ జర్నలిస్ట్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు లోకేష్,రియా ఫౌండేషన్ చైర్మన్ ఎండి రాజు, పరవాడ జర్నలిస్ట్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, వివిధ టీములకి చెందిన జర్నలిస్టు క్రికెట్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## దళితుల భూముల ఆనుకొని ఉన్న రాళ్ల క్వారీ రద్దు చేయాలి



**నర్సీపట్నం, జూన్ 30, మేజర్‌న్యూస్:** నర్సీపట్నం డివిజన్ మాకవరపాలెం మండలంలోని జి.కోడూరులో 23 దళిత కుటుంబాలకు చెందిన సర్వే నెంబర్.332 లో గల సాగుభూముల పరిసరాల్లో అనుమతించబడిన రాళ్ల క్వారీని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో దళిత రైతులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన నాయకులు బొట్టా నాగరాజు మాట్లాడుతూ రైతుల సాగుభూములకు అతి సమీపంలో రాళ్లను బాంబులతో పేలుస్తుండడం వల్ల రైతులు తీవ్ర భయానికి గురవుతున్నారు. ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందో అనే అనిశ్చితితో జీవనం సాగిస్తున్నారు. దళిత కుటుంబాల భద్రతకు ప్రమాదకరమని, వ్యవసాయం చేయడానికే భూములు ఉన్నాయని, పేలుళ్లతో నాశనం చేయడానికి కాదాని మండిపడ్డారు. దళితులకు ఈ భూములే జీవనధారం అని ఈ కొద్ది భూమునే నమ్ముకొని బ్రతుకుతున్నారని ఈ క్వారీ కారణంగా మట్టి,నీటి కాలుష్యంతో పాటు పంటలు కూడా నష్టపోతున్నాయన దళిత రైతుల ఆర్థిక, భౌతిక భద్రతలకు ఇది పెద్ద సవాలుగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు రైతుల పక్షాన నిలిచి,వెంటనే ఈ క్వారీని రద్దు చేయాలని,రైతుల హక్కులు కాపాడాలని డిమాండ్ చేశారు.రైతులు మాట్లాడుతూ గౌరవ స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఈ సమస్యపై ప్రత్యేక చొరవ తీసుకొని రైతుల బాధలను పరిష్కరించాలని రైతులు స్పీకర్ అయ్యన్నను వేడుకొంటున్నామని తెలిపారు.ర్యాలీ అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ప్రజా పిర్యాదుల పరిస్కార వేదిక వద్ద తహసీల్దార్ వి. రామారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జి.కోడూరు,వెంకటాపురం,సుభద్రయపురం గ్రామాల రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శ్రీ రాంపురంలో రైతులకు విత్తనాలు పంపిణీ



**పాయకరావుపేట, జూన్ 30, మేజర్‌న్యూస్:** రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశాలు మేరకు టిడిపి మండల అధ్యక్షుడు చించలపు పద్ధు,పట్టణ అధ్యక్షుడు యాళ్ళ వరహాల బాబు ఆధ్వర్యంలో శ్రీరాంపురం గ్రామంలో రైతులకు రాయితీ పై విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బొంది కాశీ విశ్వనాథ్,కంకిపాటి వెంకటేశ్వరరావు,మల్లి బాబు,గుడబంటి శాంతమ్మ,సన్యాసమ్మ,లక్ష్మి, రైతులు,అధికారులు పాల్గొన్నారు.


## ఓల్టేజీ నివారణకు అదనపు ట్రాన్స్ ఫార్మర్

### ఏపీ ట్రాన్స్ కో ఏడి సురేష్



**రావికమతం, జూన్ 30, మేజర్‌న్యూస్:** మండలంలో మేజర్ పంచాయతీ మేడివాడ తో పాటు టి. అర్జాపురంలలో లోఓల్టేజీ నివారణకు రెండు అదనపు ట్రాన్స్ ఫార్మర్ లు అమర్చనున్నామని ఏపీ ట్రాన్స్ కో మాడుగుల సబ్ డివిజన్ ఏడి సురేష్ తెలిపారు. వీటికి సంబంధించి 5 లక్షల రూపాయలు నిధులు మంజూరు అయినందున తక్షణం పనులు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. ఈ రెండు గ్రామాలలో లోఓల్టిజీ వలన వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నేటి దినపత్రిక సూర్య లో వరుస కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన ఆయన ఈనెల 17న క్షేత్రస్థాయిలో పర్యటించి లో ఓల్టేజీ నివారణకు అవసరమైన చర్యలను గుర్తించారు. ఈ మేరకు ప్రతిపాదనలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపేమని చెప్పారు. తాను పంపిన ప్రతిపాదనలు అంగీకరించి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు నిధులు మంజూరు చేశారని చెప్పారు . దీంతో మేడివాడ, టి అర్జాపురం ఒక్కొక్క గ్రామంలో 16 కె.వి సామర్థ్యం గల ట్రాన్స్ఫార్మర్ అమర్చుతున్నామని ఆయన తెలిపారు. అలాగే అదనపు విద్యుత్ స్తంభాలు అవసరమైన చోట విద్యుత్ లైన్ కూడా వేస్తున్నామని ఆయన వివరించారు.

## విద్యుత్ సమస్యలుపై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు వినతి పత్రం



**రావికమతం, జూన్ 30, మేజర్‌న్యూస్:** పి. పొన్నవోలు పంచాయితీ ఆర్. కొత్తూరు గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు నర్సీపట్నం ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అప్పారావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. తమ గ్రామంలో తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోయి పునరుద్ధరణకు రోజులు తరబడి నోచుకోలేదనని వినతి పత్రంలో పేర్కొన్నారు. 180 మంది గృహ విద్యుత్ వినియోగదారులు, 140 అగ్రికల్చర్ సర్వీసులు తమ గ్రామంలో ఉన్నప్పటికీ లైన్మెన్ లేనందున తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. వినియోగానికి తగిన ట్రాన్స్ఫార్మర్ కూడ లేనందున లో ఓల్టేజి సరఫరా వలన విద్యుత్ ఉపకరణాలు తరచూ డ్యామేజ్ అవుతున్నాయని ఈ ఈ దృష్టికి తీసుకెళ్లారు. సాధ్యమైనంత త్వరలో ఈ సమస్యలపై నివేదిక తెప్పించుకొని పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

## దొంగతనం కేసులలో నలుగురు నిందితులను అరెస్టు

- రూ.4 లక్షల10 వేలు నగదు, పెద్ద మొత్తంలో బంగారు నగలు, వెండి వస్తువులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నర్సీపట్నం డి.ఎస్.పి



**నర్సీపట్నం, జూన్ 30, మేజర్‌న్యూస్:** నర్సీపట్నం రూరల్ పోలీస్ సర్కిల్ పరిధిలోని మాకవరపాలెం మండల పరిధిలో దొంగతనాలకు పాల్పడిన నలుగురు నిందితులను మాకవరపాలెం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుండి రూ.4 లక్షల 10వేల నగదు, 166.8గ్రాముల బంగారం, 706 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం నర్సీపట్నం డి.ఎస్.పి పి శ్రీనివాసరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. 2023లో మాకవరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు చోరీ కేసులు, 1 హౌస్ బ్రేకింగ్ చోరీ కేసు, 2024లో ఒక హౌస్ బ్రేకింగ్ చోరీ కేసు నమోదయ్యాయన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నర్సీపట్నం డి.ఎస్.పి ఆధ్వర్యంలో రూరల్ సీఐ ఎల్ రేవతమ్మ, మాకవరపాలెం ఎస్సై దామోదర నాయుడు , సిబ్బంది రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసుల దర్యాప్తు చేపట్టారు. అదే సమయంలో తామరం గ్రామానికి చెందిన దల్లి కామిరెడ్డిని తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు పోలీసులు అరెస్టు చేశారని తెలుసుకొని, రూరల్ సీఐ రేవతమ్మ కేసుల దర్యాప్తులో భాగంగా అతనిని విచారణ చేయగా, మాకవరపాలెం పోలీస్ స్టేషన్లో నమోదైన నాలుగు కేసులలో సహచరులతో కలిసి చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడన్నారు. ఈ కేసులలో అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం తామరం గ్రామానికి చెందిన దల్లి కామిరెడ్డి, చినరాచపల్లి గ్రామానికి చెందిన కచ్చుళ్ల చిరంజీవి, జంగాలపల్లి గ్రామానికి చెందిన సఖిలేటి సాయి, మాకవరపాలెం గ్రామానికి చెందిన దొండపాటి రవీంద్ర కుమార్ లను అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ. 4 లక్షల 10 వేల నగదు తో పాటు166.8 గ్రాముల బంగారు ఆభరణాలు, 706 గ్రాముల వెండి వస్తువులు రికవరీ చేసామన్నారు. ఈ కేసుల దర్యాప్తులో చురుకుగా వ్యవహరించిన ఏఎస్ఐ మూర్తి, ఐ డబ్ల్యు అచ్చియ్య, హెచ్ సి కృష్ణ, కానిస్టేబుళ్లు నవీన్, నానాజీ, రమేష్ రామకృష్ణ, కోర్టు హెచ్ జీ రమణ, డ్రైవర్ అప్పారావు లను జిల్లా ఎస్పీ అభినందించి డి.ఎస్.పి ద్వారా నగదు బహుమతులు అందజేశారన్నారు. నిందితులు ప్రజల మధ్యనే తిరుగుతూ, ఇళ్ల వద్ద రెక్కీ చేసి జనసంచారం లేని సమయంలో దొంగతనాలకు పాల్పడే వారని, అందువల్ల కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరించినట్లయినా, అనుమానాస్పదంగా కనిపించినా పోలీసులకు సమాచారం అందించాలని డి.ఎస్.పి కోరారు. దర్యాప్తు బృందాన్ని డి.ఎస్.పి అభినందించారు. ఈ సమావేశంలో నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్ రేవతమ్మ, మాకవరపాలెం ఎస్సై దామోదర నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్లోరినేషన్ పనులను పరిశీలించిన డిప్యూటీ ఎండిఓ



**రావికమతం, జూన్ 30, మేజర్‌న్యూస్:** మండల కేంద్రం త్రాగునీటి వనరుల లో క్లోరినేషన్ పనులను డిప్యూటీ ఎండిఓ స్వామి సోమవారం తనిఖీ చేశారు. పంచాయతీకి చెందిన పారిశుధ్య సిబ్బంది రక్షిత మంచినీటి పథకం ట్యాంకును నిర్దేశించిన విధంగా శుభ్రం చేస్తున్నది లేనిది స్వయంగా ట్యాంక్ ఎక్కి పరిశీలించారు. ఈ వర్షాకాలంలో త్రాగునీటి పథకాలలో క్లోరినేషన్ అశ్రద్ధ చేయవద్దని సిబ్బందికి సూచించారు. పైపులైను లీకేజీలు ఎప్పటికప్పుడు సరిచేయాలని పంచాయతీ కార్యదర్శి కృష్ణ మోహన్ కు ఆదేశాలు జారీ చేశారు.. బ్లీచింగ్ పౌడర్ నాణ్యమైనది మాత్రమే ఉపయోగించాలని ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడకూడదని తెలిపారు.

# అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లాలి

**జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు**

**217 అర్జీలు స్వీకరణ**



**శ్రీకాకుళం, జూన్ 30, మేజర్‌న్యూస్:** అర్జీలు పరిష్కారానికి క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో ఆయన అర్జీదారుల నుండి అర్జీలు స్వీకరించారు. అర్జీలు పరిష్కారానికి సంబంధిత అర్జీ దారుని వద్దకు క్షేత్రస్థాయిలోకి వెళ్లి మాట్లాడి వారికి నాణ్యమైన సమాచారం అందజేయాలన్నారు. అర్జీలు సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్వీకరించిన అర్జీలలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, డ్వామా, మహిళా శిశు సంక్షేమం, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పంచాయతీ, ఎపిఈపీడిసియల్, సర్వే, భూగర్భ గనులు, ఇరిగేషన్, తదితర శాఖల సమస్యల పై 217 అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరణలో డిప్యూటీ కలెక్టర్లు పద్మావతి, అప్పారావు, ఐసీడీఎస్ పీడీ బి. శాంతిశ్రీ ఉన్నారు. జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి కూటమి ఏడాది పాలన..

**– కార్పొరేట్లకు వరాలు – ప్రజలకు భారాలు.**

**: సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పుస్తకమావిష్కరణ..**




**శ్రీకాకుళం, జూన్ 30, మేజర్‌న్యూస్:** "కార్పొరేట్లకు వరాలు – ప్రజలపై భారాలు"సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి. గోవిందరావు, కార్యదర్శి వర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో దారి తప్పుతున్న టిడిపి కూటమి ఏడాది పాలన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ఏడాది పాలన తల క్రిందులుగా ఉన్నదని అన్నారు. ప్రజలకు హామీలు, వాగ్దానాలు, మాటలే మిగిలాయని, కార్పొరేట్లకు కారుచౌకగా భూములు కట్టబెడుతున్నారని, వారి పనులు వేగమవుతున్నాయని వారు విమర్శించారు. సూపర్ –6 తో సహా హామీలు వైఫల్యం, విద్యుత్తు, పన్నుల భారాలు, గిట్టుబాటు ధర లేకపోవడం కనీస వేతనాలు అమలు కాకపోవడం, ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుందని వారు అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలు ఏఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదని, జీడికి గిట్టుబాటు ధర ఇచ్చి బోర్డు ఏర్పాటు చేస్తామన్న వాగ్దానం అమలు జరగలేదని, జిల్లాలో ఐటిడిఏ ఏర్పాటు చేస్తామన్న హామీ నేటికీ నెరవేరలేదని, కోడి రామ్మూర్తి స్టేడియం పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని, వంశధార నిర్వాసితులకు ఇస్తామన్న స్పెషల్ ప్యాకేజ్ నేటికీ అమలు జరగలేదని వారు విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో అధమ స్థానంలో ఉన్న ప్రభుత్వం ప్రజల పైన భారాలు వేయడంలో ప్రథమ స్థానంలో ఉందని వారు విమర్శించారు. స్మార్ట్ మీటర్లు తో సామాన్యులకు లక్షలలో బిల్లులు వస్తున్నాయని, ఈ సంవత్సరంలో విద్యుత్ ఛార్జీల ద్వారా 15 వేల నాలుగు వందల ఎనభై ఐదు కోట్ల రూపాయల భారాన్ని వేసిందని విమర్శించారు. నగరాల్లో ఇల్లు, షాపులు, ఖాళీ స్థలాలు కు విలువ ఆధారిత ఆస్తి పన్ను భారీగా పెంచారని విమర్శించారు. టిడిపి ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని చెప్పడంతో పాటు స్మార్ట్ మీటర్ల కు వ్యతిరేకంగా కోర్టులో కేసు వేశారని,. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత టిడిపి స్మార్ట్ మీటర్లు బిగిస్తోందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు ప్రజలు వ్యతిరేకించాలని వారన్నారు. టిడిపి కూటమి ఇచ్చిన వాగ్దానాలను ఇకనైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలో ఉన్న మున్సిపల్ కార్యాలయము, పెద్ద మార్కెట్ , బాపూజీ కళామందిర్, నగరంలో ఉన్న ఐదు పార్కులు, జిల్లా కేంద్ర గ్రంథాలయము మొదలగు ప్రభుత్వ ఆస్తులు ప్రైవేటీకరణ ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోనారి మోహనరావు, పి.తేజేశ్వరరావు ఉన్నారు.

# ఘనంగా పోలీసు సిబ్బందిని సత్కరించిన జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి



**శ్రీకాకుళం, జూన్ 30, మేజర్‌న్యూస్:** సుదీర్ఘకాలం జిల్లా పోలీసు శాఖలో అంచెల అంచెలుగా వివిధ హోదాల్లో ఉద్యోగ విధి నిర్వహణలు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందుతున్న ప్రతి పోలీసు ఉద్యోగి ఉద్యోగ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో శేష జీవితాన్ని గడపాలని జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి ఆకాంక్షించారు.జూన్ 30, ఉద్యోగ విరమణ పొందుతున్న పోలీసు ఉద్యోగస్తులకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఘనముగా సాలువతో సన్మానం చేసి, ప్రశంస పత్రాలు,జ్ఞాపికలను అందజేసి,పుష్పమాలలతో సత్కరించారు. సబ్ ఇన్స్పెక్టర్లు ఆర్ శంకర్ రావు,(వి. ఆర్) వి నేతాజీ (డి సి ఆర్ బి) ,ఎన్. కృష్ణ రావు (ఎచ్చెర్ల), పి.ఎస్.నారాయణ (విశాఖ పట్నం), బి.వి సత్యనారాయణ (శ్రీకాకుళం రూరల్), ఆర్.రవి కుమార్ (వజ్రపు కొత్తూరు), వై నర్సింహులు,బి. రామీ నాయుడు,(డి ఎ ఆర్ ఎచ్చెర్ల) హెడ్ కానిస్టేబుల్స్ కె. మల్లేశ్వరరావు,బి.మాధవ రావు(ఎ.ఆర్),ఆఫీసు స్వీపర్లు బి.గన్నయ,ఎన్. లలిత, హోమ్ గార్డులు ఆది నారాయణ, సూర్య నారాయణ అను వారు గత 35 సంవత్సరాలుగా పోలీస్ డిపార్ట్మెంట్లో మంచి క్రమశిక్షణతో సర్వీస్ చేసి అధికారులచే ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... సుమారు 35 ఏళ్ళు పోలీసు ఉద్యోగులు గా ప్రజలకు నిస్వార్థమైన సేవలు అందించిన వారికి సమాజం లోఎప్పుడూ గౌరవం లభిస్తుందని జిల్లా ఎస్పీ కొనియాడారు. సర్వీసులో అనేక ఒడిదుడుకులు, ఒత్తిడిలు ఎదుర్కొని అటు ఉద్యోగానికి ఇటు కుటుంబానికి సమాన తూకంగా వేసుకొని క్రమశిక్షణతో విధులు నిర్వర్తించడం అనేది చాలా గొప్ప విశేషమని ఎస్పీ తెలిపారు.ఉద్యోగ విరమణ అనంతరం లభించిన ప్రతి ప్రయోజనాన్ని,ప్రతి రూపాయిని ప్రణాళిక బద్ధంగా ఖర్చుచేసి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని ఎస్పీ ఆకాంక్షించారు.ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. పోలీస్ డిపార్ట్మెంట్ కు చేసిన సేవలను ప్రత్యేకంగా ఎస్పి కొనియాడితు,హృదయపూర్వక పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేసినారు.పదవి విరమణ పొందిన తర్వాత డిపార్ట్మెంట్ పరంగా ఏ అవసరం ఉన్నా సరే స్వయంగా వచ్చి నన్ను నేరుగా కలవచ్చునని ఎస్పి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కెవి రమణ, పరిపాలన అధికారి సి హెచ్ గోపీ నాథ్, డిఎస్పీ ఎల్ శేషాద్రి, ఆర్ఐ కె నర్సింగ రావు,పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్ కృష్ణం నాయుడు,ట్రెజరర్ భుజంగరావు,జగదాంబ, సిబ్బంది,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వెల్కమ్ బోర్డు ఏర్పాటు..




**నరసన్నపేట, జూన్ 30, మేజర్‌న్యూస్:** నరసన్నపేట జాతీయ రహదారి నుండి పట్టణంలోకి వచ్చే మార్గాలు సత్యవరం జంక్షన్, తామరపల్లి గ్రామాల వద్ద వెల్కమ్ బోర్డులను ఏర్పాటు చేసిన నరసన్నపేట మిలీనియం లైన్స్ క్లబ్ ప్రతినిధులు. సోమవారం లైన్స్ క్లబ్ ప్రతినిధులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో నిర్వహించారు. పట్టణంలోకి ప్రవేశించే ప్రధాన మార్గం సత్యవరం జంక్షన్, తామరపల్లి వద్ద ప్రయాణికుల సౌకర్యార్థము వెల్కమ్ టు నరసన్నపేట బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట మిలీనియం లైన్స్ క్లబ్ అధ్యక్షులు రమణ సాహూ, సెక్రటరీ కలివరపు సాయిరాం, పొట్నూర్ రమేష్, కాసిన రమేష్, లైన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల బదిలీలకు ముగిసిన కౌన్సెలింగ్



**శ్రీకాకుళం, జూన్ 30, మేజర్‌న్యూస్:** జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌ను అంబేద్కర్ ఆడిటోరియంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూదన రావు పర్యవేక్షణలో నిబంధనల మేరకు సజావుగా నిర్వహించారు. ఐదేళ్లు పూర్తి చేసిన ఉద్యోగులకు బదిలీ అవకాశం కల్పించగా, మొదట విభిన్న ప్రతిభావంతులు, స్పౌజ్ కేటగిరీకి చెందినవారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అభ్యర్థుల నుంచి ఇప్పటికే తీసుకున్న ఆప్షన్లు, ఖాళీల ఆధారంగా సీనియారిటీ పద్ధతిలో ఎంపికలు జరిపారు. మొత్తం 5 సంవత్సరాలు సర్వీసు దాటిన 340 మందికి, అలాగే ఇతరులు 60 మందికి బదిలీల కౌన్సెలింగ్ చేపట్టినట్లు డీడీ తెలిపారు.

# సుపరిపాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

**– శిక్షణ తరగతులు సమావేశంలో**

**పాల్గొన్న ఎమ్మెల్యే బగ్గ**



**నరసన్నపేట, జూన్ 30, మేజర్‌న్యూస్:** సుపరిపాలనలో తొలి అడుగు శిక్షణ తరగతులను నరసన్నపేట , పోలాకి మండలాల ముఖ్యనాయకులకు పలు సూచనలు చేసి అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తొలి కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంగా చేసిన కార్యక్రమాలు రానున్న నాలుగు సంవత్సరాలలో కూటమి ప్రభుత్వం చేయనున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు.గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసంతో రాష్ట్రం పూర్తిగా నాశనమయిందని,ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని గాడిలో పెట్టి ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తున్నామని కూటమి ప్రభుత్వం చేయనున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గ అర్చన మరియు నరసన్నపేట, పోలాకి మండలాల ముఖ్య నాయకులు,కార్యకర్తలుప క్లస్టర్, యూనిట్ ఇన్చార్జులు, రాష్ట్ర ,జిల్లా ,మండల అనుబంధ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సూర్య

మంగళవారం 1 జూలై 2025

# 12వ రోజుకు చేరిన ధర్నా



**నర్సీపట్నం, జూన్ 30, మేజర్‌న్యూస్:** ఈనెల 19 నుండి నర్సీపట్నం మున్సిపాలిటీ ఇంజనీరింగ్ కార్మికులు నర్సీపట్నం సబ్ కలెక్టర్ ఆఫీస్ ఎదుట చేపడుతున్న ధర్నా కార్యక్రమం 12వ రోజుకు చేరుకుంది. కార్మికులు రోజుకు ఒక వినూత్న నిరసన తెలియజేస్తున్నారు . సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తుండడంతో ఇంజనీరింగ్ కార్మికులు ఆర్డీవో కార్యాలయం నుండి మున్సిపల్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నా నిర్వహిస్తున్న కార్మికులకు మద్దతుగా స్పీకర్ సతీమణి పద్మావతి టిడిపి కౌన్సిలర్లు కార్మికుల సమస్యలు విని కచ్చితంగా న్యాయం చేస్తామని కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశామని స్పీకర్ దృష్టికి తీసుకువెళ్లి ముఖ్యమంత్రితో మాట్లాడి ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పద్మావతి హామీ ఇచ్చారు ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ స్పీకర్ సతీమణి పద్మావతికి తమ బాధలను చెప్పుకున్నారు. 13వేల చాలీచాలని జీతంతో కుటుంబ పరిస్థితులు భారంగా మారాయని తమకు న్యాయం చేయాలని మున్సిపాలిటీలోని ఇతర శాఖల కార్మికులకు మాదిరిగానే తమకూ పనికి తగ్గ వేతనం అందించాలని పద్మావతిని కోరారు. కార్మికులకు మద్దతుగా మున్సిపల్ సమావేశంలో అందరం కలిసి తీర్మానం చేశామని వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ కార్మికులకు తెలిపారు.వైసిపి కౌన్సిలర్లు కార్మికులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్ల సంఘం (జేఏసీ) జిల్లా అధ్యక్షుడు గొర్లె మురళీకృష్ణ, కార్యదర్శి కరక మహేష్, నర్సీపట్నం శాఖ అధ్యక్షుడు మాకిరెడ్డి అప్పలనాయుడు, ఉపాధ్యక్షులు కరక రామకృష్ణ, యర్రా ప్రకాష్, కోశాధికారి లాలం నాగేంద్ర, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

## రాంకో సిమెంట్ యూనిట్-2 ను ఆపివేయాలి

### కలెక్టరుకు ఫిర్యాదు అందచేసినా బుద్ధ వెంకటరమణ

**కశింకోట, జూన్ 30,మేజర్‌న్యూస్:** కశింకోట మండలంలోని తాళ్లపాలెం వద్ద గల రాంకో సిమెంట్ కంపెనీ వారు నిర్మించ తలపెట్టిన యూనిట్-2 ను ఆపివేయాలని, గొబ్బూరుకు చెందిన బుద్ధ వెంకటరమణ అనే వ్యక్తి సోమవారం కలెక్టర్కు ఫిర్యాదు చేశాడు. ఇప్పటికే రాంకో సిమెంట్ కంపెనీ ద్వారా వెలువడు కాలుష్యం వలన పంటలకు నష్టం కలుగుతుందని, రోగాలు ప్రబలుతున్నయని, పంటలు ఎండిపోయి రైతులకు నష్టం కలుగుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఇంకా ఈ నకలు అనకాపల్లి ఆర్డీవో, కశింకోట తహసిల్దార్ కు,గొబ్బూరు పంచాయతీ కార్యదర్శికు పంపినట్లు వెంకటరమణ పేర్కొన్నారు.

## జూనియర్ అసిస్టెంట్ చెక్క అప్పారావు పదవి విరమణ



**సబ్బవరం, జూన్ 30, మేజర్‌సూర్య:** సబ్బవరం మండలం సబ్బవరం గ్రామం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సీతాలక్ష్మి ఆధ్వర్యంలో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నటువంటి, చెక్క అప్పారావు పదవీ విరమణ కార్యక్రమం జరిగింది. అప్పారావు సుమారు 38 సంవత్సరాల పాటు, వివిధ కళాశాలలో పనిచేస్తూ, ఈరోజు పదవి విరమణ చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన, ఉత్తరాంధ్ర పట్టపదుల నియోజకవర్గ శాసన మండల సభ్యులు డాక్టర్ వేపాడ చిరంజీవి మాట్లాడుతూ.. అప్పారావు అంకిత భావం కలిగినటువంటి ప్రభుత్వ ఉద్యోగి అధ్యాపకులకు మరియు విద్యార్థులకు ఎంతగానో సహాయపడ్డారని, రిటైర్మెంట్ తర్వాత ఆయన ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని, ఈ సందర్భంగా తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో డాక్టర్ నివేదిత , వి.ఎం. సి.మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లారెన్స్ , కళాశాల అధ్యాపకులు సహాయక బృందం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మున్సిపల్ సమావేశంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపిన వైసిపి కౌన్సిలర్లు





**నర్సీపట్నం, జూన్ 30, మేజర్‌న్యూస్:** నర్సీపట్నం పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఎజెండా కాపీ చదివి వినిపించక ముందే నల్ల బ్యాడ్జీలతో సమావేశానికి వచ్చిన వైసిపి కౌన్సిలర్లు ఎందుకు నిరసన తెలియజేస్తున్నారో తెలియజేయాలని మున్సిపల్ కౌన్సిలర్ స్పీకర్ సతీమణి శ్రీమతి చింతకాయల పద్మావతి వైసిపి కౌన్సిలర్లను నిలదీశారు. దానికి సమాధానంగా వైసిపి మున్సిపల్ వైస్ చైర్మన్ లు తమరాన అప్పలనాయుడు. కోనేటి రామకృష్ణ కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లి దొర సమాధానం చెబుతూ గత నెలలో టిడిపి కౌన్సిలర్లు దౌర్జన్యాన్ని ఖండిస్తూ బెదిరింపులకు నిరసనగా నల్ల బ్యాడ్జీలతో వచ్చామని తెలియజేయడంతో కౌన్సిలర్ పద్మావతి సమాధానం చెబుతూ కౌన్సిల్ సమావేశం సమాధానంగా జరగాలని కోరుకుంటున్నామని అనవసరమైన విషయాలకు రెచ్చగొట్టి గొడవలు చేసుకోవద్దని.అభివృద్ధికి అందరూ సహకరించాలని ఆమె కోరారు. 15వ ఫైనాన్స్ నిధులు పురపాలక సంఘానికి ఎలా సమకూరుతాయో తెలియజేయాలని డీఈ కామేశ్వరరావును వైసిపి వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ వివరణ అడిగారు. నర్సీపట్నం ప్రధాన రోడ్ లో గత ప్రభుత్వంలో 100 అడుగుల రోడ్డు విస్తీర్ణంలో బిల్లులు చెల్లించలేదని కోటి రూపాయలు కుంభకోణం జరిగిందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పత్రిక ముఖంగా తెలిపారని. కాంట్రాక్టర్కు బిల్లు చెల్లించకపోవడంతో కోర్టుకు వెళ్లాడని వర్క్ కూడా పూర్తి కాలేదని. ప్రభుత్వము నిధులు మంజూరు చేయకపోయినా కోటి రూపాయల కుంభకోణం ఎలా జరుగుతుందని వివరించాలని మున్సిపల్ అధికారులను నిలదీశారు. వంద అడుగుల రోడ్డు విస్తరణకు 8 కోట్ల 30 లక్షలు టెండర్ ఖరారు కాగా కేవలం కోటి 19 లక్షల వర్క్ మాత్రమే జరిగిందని వర్కు నాణ్యతగా లేదని అధికారులు గుర్తించి 15 లక్షల రూపాయలు ఫైన్ విధించారని. సిబ్బందిపై కూడా ఎంక్వయిరీ వేశారని ఏఈ రవి తెలిపారు. కాంట్రాక్టర్ డబ్బు చెల్లించాలని కోర్టులో కేసు వేశారని కౌన్సిలర్లకు తెలిపారు. ఎనిమిదవ వార్డులో మాకిరెడ్డి వరలక్ష్మి పేరున టాక్స్ విధించడం చట్ట విరుద్ధం అంటూ మాకిరెడ్డి బుల్లి దొర కమిషనర్ ను నిలదీశారు. లీగల్ ఒపీనియన్ తీసుకోకుండా కమిషనర్ సురేంద్ర ఏకపక్షంగా వ్యవహరిస్తూ పన్ను విధించడం కరెక్ట్ కాదని పన్ను విధింపు న్యాయబద్ధంగా లేదని నిలదీశారు. నిబంధనలకు విరుద్ధంగా వెళితే ఇబ్బందులు పడాల్సి వస్తుందని బుల్లిదొర కమిషనర్ కు తెలిపారు. టాక్స్ విధింపు పై సభలో గందరగోళం మొదలైంది. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా పెండింగ్ బిల్లులు కాంట్రాక్టర్లకు వెంటనే చెల్లించాలని సభకు దృష్టికి తీసుకువచ్చారు. క్రమ పద్ధతిలో బిల్లులు పరిష్కరించడానికి కృషి చేస్తున్నట్లు ఏఈ రవి సమాధానం ఇచ్చారు. జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య మాట్లాడుతూ మున్సిపల్ శాఖ ఇంజనీరింగ్ కార్మికులు గత 12 రోజులుగా ధర్నా చేస్తున్నారని వారికి న్యాయమైన కోర్కెలు నెరవేర్చాలని జనసేన తరపున వారికి మద్దతు తెలుపుతున్నానని ఆమె అన్నారు. గత నాలుగు సంవత్సరాలు కాలంలో ఒక విద్యుత్తు పోలు కూడా పురపాలక సంఘం నుంచి వేయలేదని ఆమె కమిషనర్ ను కోరారు. కుక్కల బెడద ఎక్కువగా ఉందని వెంటనే పరిష్కరించాలని. డాన్ బాస్కో స్కూలు వద్ద కల్వర్టు నిర్మాణం చేయాలని కమిషనర్ ను కోరారు. రోడ్లు. డ్రైనేజీలు పూర్తయిన వెంటనే విద్యుత్ పోల్స్ కూడా కొనుగోలు చేసి వేస్తామని కమిషనర్ సురేంద్ర తెలిపారు. ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న న్యాయమైన డిమాండ్స్ పరిష్కారానికి టిడిపి మద్దతు ఇస్తుందని అందరూ సహకరించాలని కౌన్సిలర్ పద్మావతి తీర్మానాన్ని ప్రవేశపెట్టగా టిడిపి జనసేన వైసిపి కౌన్సిలర్లు. చైర్పర్సన్ సుబ్బలక్ష్మి మద్దతు తెలిపారు.

# పది, ఇంటర్ టాపర్లకు ప్రోత్సాహక బహుమతులు



**విశాఖపట్నం, జూన్ 30, మేజర్‌న్యూస్:** జగదాంబ జంక్షన్ లోని విజేత హాస్పిటల్ లో 2024- 25 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ మరియు 10వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన అఖిల గాండ్ల తెలికుల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ప్రధానం చేసారు. పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు నరవ వివేక్ సాయి, గండేపల్లి పుష్ప కానంద్ వాండ్రాసి హేమంత్, అలాగే ఇంటర్లో విశాఖ జిల్లాకే కాక రాష్ట్ర టాపర్ గా నిలిచి విద్యా,ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ తో లాప్టాప్ బహుమతి పొందిన దూది రేష్మ, జామి సాయి చైతన్య, మొల్లేటి నికితలకు రాష్ట్ర సంఘం నగదు, మెడల్, సర్టిఫికెట్ల ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో విజేత హాస్పిటల్స్ ఎండీ జిల్లా ట్రస్ట్ బోర్డు చైర్మన్ మరియు అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ కళ్లేపల్లి కూర్మనాథ్, జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి బోయిదాపు రామారావు, జిల్లా సంఘ పెద్దలు యెల్లేటి నరసింగరావు సి.టి.ఓ ధర్మవరపు కృష్ణ జిల్లా సంఘం న్యాయ సలహాదారులు గండేపల్లి త్రినాథ్ మూర్తి ఎన్ఏఎన్ రాజు సిటీ సంఘం అధ్యక్షులు రాజు, కెల్ల హరి తదితరులు పాల్గొన్నారు విద్యార్థులతో పాటుగా తల్లిదండ్రులను కూడా అభినందించారు.

## ఉపాధి పనులను పరిశీలించిన ఎంపీడీవో



**కశింకోట, జూన్ 30, మేజర్‌న్యూస్:** కశింకోట మండలంలోని తేగాడ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను కశింకోట ఎంపీడీవో వివి రవికుమార్ పరిశీలించారు. ఉపాధి కూలీలతో ఎంపీడీవో రవికుమార్ మాట్లాడుతూ సమయపాలన, ఉపాధి పనులు కొలతలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఎంత మంది కూలీల పని చేస్తున్నారు ఎంతవరకు పనులు జరుగుతున్నాయి అన్నదానిపై ఆరా తీశారు. ఉపాధి కూలీల మస్తర్లు సక్రమంగా వేస్తున్నారా లేదా అని మేట్లను అడిగి తెలుసుకున్నారు.

## నరసింహ అవతారంలో దర్శనమిచ్చిన జగన్నాథ స్వామి



**కశింకోట, జూన్ 30, మేజర్‌న్యూస్:** మండల కేంద్రమైన కశింకోట వడ్డీ వీధిలో గల శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో జగన్నాథుని రథోత్సవాలలో భాగంగా స్వామివారు సోమవారం నరసింహ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.భక్తులు పాల్గొని స్వామి వారికి పూజలు జరిపారు.రేజేటి రామాచార్యులు పర్యవేక్షణలో రేజేటి మారుతి, రేజిటి కన్నబాబు ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు జరిపారు. అనంతరం భక్తులకు కేంద్ర ప్రసాదాలు పంపిణీ చేశారు.

## 'నాడు-నేడు' కూటమి ప్రభుత్వం అటకెక్కించింది

**- రాష్ట్ర విద్యావ్యవస్థలో చోటుచేసుకుంటున్న పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి**

**- ఇది విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుంది**



**పాతపట్నం, జూన్ 30, మేజర్‌న్యూస్:** నాణ్యమైన విద్యను అందించడంలో కూటమి ప్రభుత్వం యొక్క నిబద్ధత ప్రశ్నార్థకంగా మారుతోందని వైఎస్సార్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే శ్రీమతి రెడ్డి శాంతి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కూటమి ప్రభుత్వం విద్యా రంగంలో సంస్కరణల పేరుతో తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు విద్యా ప్రమాణాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని, ఇది దీర్ఘకాలంలో రాష్ట్ర ప్రగతికి ఆటంకం కలిగిస్తుందని అన్నారు. ఒక బలమైన మరియు సమర్థవంతమైన విద్యావ్యవస్థే ఒక సమాజానికి పునాది అని, దీనిని నిర్లక్ష్యం చేయడం వల్ల భవిష్యత్ తరాలు తీవ్రంగా నష్టం కలుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత కూటమి ప్రభుత్వం వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారి నాయకత్వంలో అమలు చేయబడిన విద్యా రంగ సంస్కరణలను పూర్తిగా నిర్వీర్యం చేస్తోంది. 'నాడు-నేడు' వంటి విప్లవాత్మక కార్యక్రమాల ద్వారా రాష్ట్ర విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులను కూటమి ప్రభుత్వం అటకెక్కించి, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోంది. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారి పాలనలో, విద్యారంగం సమూలమైన మార్పులకు శ్రీకారం చుట్టింది. 'నాడు-నేడు' కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. తరగతి గదుల నుంచి మౌలిక సదుపాయాల వరకు అన్నింటినీ ఆధునీకరించి, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో డిజిటల్ తరగతులు, ఆంగ్ల మాధ్యమం వంటి అనేక సంస్కరణలు ప్రవేశపెట్టబడ్డాయి. అంతేకాకుండా, విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని అందించడం ద్వారా వారి ఆరోగ్యం, శారీరక ఎదుగుదలకు ప్రాధాన్యతనిచ్చారు. 'జగనన్న గోరుముద్ద' వంటి పథకాలతో కేవలం విద్యా ప్రమాణాలనే కాకుండా, విద్యార్థుల సమగ్ర వికాసాన్ని దృష్టిలో ఉంచుకున్నారు. ఈ సంస్కరణలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలను గణనీయంగా పెంచి, పేద విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందుబాటులోకి తెచ్చారు. కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఈ విద్యా సంస్కరణలన్నింటినీ పూర్తిగా పక్కన పెట్టేసింది. 'నాడు-నేడు' వంటి కార్యక్రమాలకు నిధులు నిలిపివేసి, పాఠశాలల అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. పౌష్టిక ఆహార పథకాల అమలులో అలసత్వం ప్రదర్శిస్తూ, పేద విద్యార్థుల ఆరోగ్యాన్ని విస్మరిస్తున్నారు. ఇది రాష్ట్ర భవిష్యత్తుకు తీరని నష్టాన్ని చేకూరుస్తుంది. "జగన్ మోహన్ రెడ్డి గారు విద్యను ఒక ఆయుధంగా భావించి, పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తే, ఈ ప్రభుత్వం ఆ వెలుగులను ఆర్పేస్తోంది,". "నాణ్యమైన విద్యను దూరం చేసి, పేదల పిల్లలను మళ్లీ చదువుకు దూరం చేయాలని ఈ ప్రభుత్వం చూస్తోంది. ఇది అత్యంత దురదృష్టకరం." కూటమి ప్రభుత్వం తన విధానాలను వెంటనే మార్చుకుని, వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి గారు అమలు చేసిన విద్యా సంస్కరణలను కొనసాగించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడటం ఆపి, వారికి మెరుగైన విద్యను అందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని లేనిపక్షంలో, విద్యార్థులు, తల్లిదండ్రుల పక్షాన వైయస్సార్‌సీపీ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు. ఈ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం పక్కన పెట్టి ఇసుక దందాలు, మద్యం వ్యాపారాలు, అక్రమార్జనకు మాత్రమే వారి ధ్యేయంగా ఉంది. కూటమి ప్రభుత్వం ప్రజల ఆశలను, ఆకాంక్షలను పూర్తిగా విస్మరించి, కేవలం అక్రమ సంపాదన, దందాలకే పరిమితమైంది. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, ఇసుక, మద్యం వ్యాపారాల్లో అక్రమాలకు పాల్పడుతూ, ప్రజాధనాన్ని దోచుకుంటున్నారు. తక్షణమే ఈ అక్రమ దందాలను ఆపి, ప్రజల సంక్షేమంపై దృష్టి సారించాలని హితవు చేశారు.

## పారిశుధ్యంపై కదిలిన పంచాయతీ..



**నరసన్నపేట, జూన్ 30, మేజర్‌న్యూస్:** నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలోని పప్పుల వీధి జంక్షన్ వద్ద పేరుకుపోయిన వ్యర్థాల వల్ల భరించలేని దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు ఇబ్బందులు గురవుతున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు స్పందించిన వార్డు సభ్యులు బంకుపల్లి లోకనాథ్ శర్మ గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులను ఆ ప్రాంతానికి పంపి వ్యర్థాలు తొలగించే కార్యక్రమాన్ని నిర్వహించారు. పప్పుల వీధి జంక్షన్ వద్ద అపరిశుభ్రంగా మన ప్రాంతాన్ని పరిశుభ్రం చేసి క్లోరినేషన్ చేశారు. ఈ ప్రాంత వాసులు చెత్తను నిల్వ చేయడం ద్వారా సమస్య ఉత్పనమవుతుందని, స్థానికులు సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. తమ సమస్యపై స్పందించిన వార్డు సభ్యులు లోకనాథ్ శర్మకు, మేజర్ పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పల్లి ద్రాక్షయిని కు కృతజ్ఞతలు తెలియజేశారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

## బోయిన సోదరులను పరామర్శించిన కూన



**కోటబొమ్మాళి, జూన్ 30, మేజర్‌న్యూస్:** టిడిపి రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర కళింగ కోమటి సంఘం అధ్యక్షులు బోయిన గోవిందరాజులు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్‌ల మాతృమూర్తి ప్రేమకుమారి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆముదాలవలస శాసన సభ్యులు కూన రవి కుమార్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, వారికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

## చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

**ఆమదాలవలస, జూన్ 30, మేజర్‌న్యూస్:** ప్రభుత్వ ఉద్యోగికి చేసిన సేవలే గుర్తింపునిస్తాయని రాష్ట్ర కాలింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీలో ఉద్యోగిగా పని చేసి పదవీ విరమణ చేసిన పీవీకే రాజు కు సోమవారం పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగికి ఏదో ఒక రోజు పదవి విరమణ తప్పదని కానీ వారు చేసిన సేవలు వారికి గుర్తింపునిస్తాయని అన్నారు. పురపాలక సంఘంలో గత 40 సంవత్సరముల నుండి ప్రజల తోపాటు మాజీ ఎమ్మెల్యే సత్యవతి, ప్రస్తుత ఎమ్మెల్యే కూన రవికుమార్ దగ్గర పిఏగా పనిచేసే వారి మన్ననలను పొందిన వ్యక్తి పి వి కే రాజుని ఆయన సేవలను కొనియాడారు. మున్సిపాలిటీ అభివృద్ధికి పలు సూచనలు చేసిన వ్యక్తి పీవీకే రాజుని నారాయణపురం ఆనకట్టు చైర్మన్ సనపల ఢిల్లీ శ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో తమ్మినేని శ్రీనివాసరావు, టిడిపి కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రాజకీయ పార్టీల ప్రతినిధులుతో సమావేశం




**శ్రీకాకుళం, జూన్ 30, మేజర్‌న్యూస్:** రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం, శ్రీకాకుళం నందు ఓటర్ల నమోదు అధికారి, నెం.5 శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గం, రెవిన్యూ డివిజనల్ అధికారిణి కె. సాయి ప్రత్యూష అధ్యక్షతన శ్రీకాకుళం నియోజకవర్గంలో వున్న అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులుతో సమావేశం ఏర్పాటు చేయడమైనది. ఈ సమావేశంలో ఎన్నికల సంఘం వారి ఆదేశాలు ప్రకారం ప్రతి నెల జరుగుతున్న అన్ని రాజకీయ పార్టీల సమావేశం లో మంచి ఓటర్ల జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీల వారు తగు సూచనలు, సలహాలు ఇవ్వవలిసినదిగా తెలియచేసినారు. అలాగే ఎన్నికల సంఘం వారి Pre-revision activities షెడ్యూల్ ను ఇవ్వడం జరిగింద. ఈ సమావేశం లో తేది 06.01.2025 నుంచి తేది 30.06.2025 వరకు ఓటర్లు జాబితా లో వున్న మరణించిన ఓటర్లు , వివాహం జరిగి గ్రామం నుంచి వలస వెళ్ళన ఓటర్లు తొలిగించుట మరియు డబల్ ఓటర్లు ను మొత్తం - 532 లను ఎన్నికల నిబంధనలు లోబడి తొలిగించుట జరిగిందన్ని అన్ని రాజకీయ పార్టీ ల వారు తెలియచేసి వున్నారు. అలాగే అన్ని పార్టీ ల వారికి బూత్ లెవెల్ ఏజెంట్స్ జాబితాను ఇవ్వవలిసినదిగా కోరివున్నారు.ఈ సమావేశంలో శ్రీకాకుళం తహసిల్దార్ ఎస్. గణపతి రావు, శ్రీకాకుళం ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ జి. కె. శ్రీనివాసరావు, మాదారపు వెంకటేష్, జనార్ధన - టీడీపీ, ఆర్. శంకర రావు - వైఎస్ఆర్సిపి ,ఆర్ .పురుషోత్తం - బిజెపి, బి. అర్జునకుమార్, భాస్కర్ రావు - జనసేన పాల్గొన్నారు.

## భారతదేశంలో ఏఐ మౌలిక సదుపాయాల విస్తరణకు ఉర్సా క్లస్టర్స్‌లో సాంకేతిక నిపుణుల నియామకం

**విశాఖపట్నం, జూన్ 30, మేజర్‌సూర్య:** భారతదేశపు మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ ఏఐ మౌలిక సదుపాయాల ప్లాట్‌ఫామ్ డెవలపర్ ఉర్సా క్లస్టర్స్ తన తదుపరి దశ వృద్ధిని ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన సాంకేతిక నాయకుల నియామకాన్ని నేడు ప్రకటించింది. కంపెనీ పలు రాష్ట్రాలలో ఏఐ ఆప్టిమైజ్ చేయబడిన డేటా సెంటర్‌ల నెట్‌వర్క్‌ను నిర్మిస్తుండడంతో, కొత్త నాయకత్వం భారతదేశ ఏఐ పరివర్తనను వేగవంతం చేసేందుకు ప్రపంచ అనుభవాన్ని, లోతైన డొమైన్ నైపుణ్యాన్ని తీసుకువస్తుంది. కొత్త నియామకాలలో ఎరిక్ వార్నర్ ఉండగా, ఆయన చీఫ్ రెవెన్యూ ఆఫీసర్‌గా చేరారు. సన్ మైక్రోసిస్టమ్స్, బిఈఏ సిస్టమ్స్ మరియు ఆర్ ఎస్ ఏ సెక్యూరిటీలలో నాలుగు దశాబ్దాలకు పైగా ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీ నాయకత్వాన్ని తీసుకువచ్చారు. అధిక పనితీరు గల మౌలిక సదుపాయాల కోసం డిమాండ్ పెరుగుతూనే ఉండడంతో, వార్నర్ హైపర్‌స్కేల్ క్లౌడ్ ప్రొవైడర్లు, ఏఐ ఫస్ట్ ఎంటర్‌ప్రైజెస్‌లతో కంపెనీ వాణిజ్య భాగస్వామ్యాలకు నాయకత్వం వహించనున్నారు. తన నియామకం గురించి ఎరిక్ వార్నర్ మాట్లాడుతూ, "భారతదేశం ఏఐ మౌలిక సదుపాయాలకు తదుపరి సరిహద్దును సూచిస్తుంది. ఇక్కడ డిమాండ్ సరఫరా కన్నా చాలా ఎక్కువగా పెరుగుతోంది. భూమి, శక్తి, అనుమతులకు సంబంధించి ఉర్సా క్లస్టర్స్ ముందస్తు అమలు ఈ తదుపరి డిజిటల్ పరివర్తన తరంగానికి నాయకత్వం వహించడానికి ప్రత్యేకంగా స్థానం కల్పిస్తుంది" అని వివరించారు.

# బైక్ దొంగల ముఠా గుట్టు రట్టు

## - ఐదు బైకులు స్వాధీనం



**అచ్యుతాపురం, జూన్ 30, మేజర్‌సూర్య:** అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు, ఆడిషనల్ ఎస్పీ (క్రైమ్స్) మోహన్ రావు ఆధ్వర్యంలో వాహన తనిఖీలను చేపట్టిన అచ్యుతాపురం పోలీసులు ఐదు మోటార్ సైకిళు స్వాధీనం చేసుకున్నారు. పరవాడ ఇన్‌చార్జి డీఎస్పీ మోహనరావు, డిటీసీ, డీఎస్పీ అనకాపల్లి సూచనలతో, ఈరోజు ఉదయం 8:30 గంటలకు అచ్యుతాపురం నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో పరవాడ వైపు నుండి వచ్చిన ఓ వ్యక్తి టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని నిలిపి, పోలీసులు తనిఖీలు చేస్తున్న చోట వద్ద పారిపోయే ప్రయత్నం చేశాడు. సీఐ నమ్మి గణేష్, ఎస్ఐ సుధాకర్ మరియు సిబ్బంది అతన్ని వెంటాడి పట్టుకున్నారు. విచారణలో అతను చరకం గ్రామానికి చెందిన రెడ్డి పైడం నాయుడు అని తేలింది. అతని వద్ద నుండి విచారణ కొనసాగించగా, అచ్యుతాపురంలో టీవీఎస్ ఎక్సెల్, ఎస్.రాయవరం మండలం అడ్డు రోడ్ బ్రిడ్జ కింద గ్లామర్ బైక్, పరవాడ పోలీస్ స్టేషన్ కేసు నెం.158/25 లో దొంగిలించబడిన బైక్, శంకవరం పోలీస్ స్టేషన్ పరిధిలో AP31CG7742 నెంబరు బైక్, తుని పరిధిలో AP05886851 నెంబరు బైక్ సహా మొత్తం ఐదు బైకులు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. ఈ బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తు నిమిత్తం నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ కేసును విజయవంతంగా చేధించిన అచ్యుతాపురం పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించారు.

# ప్రభుత్వ పాఠశాలలో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య

## -ఉపాధ్యాయులను అభినందించిన ఎంఈఓ సురేష్



**కశింకోట, జూన్ 30, మేజర్‌న్యూస్:** గత విద్య సంస్థ వరకు ప్రాథమిక పాఠశాలలో 14 మంది విద్యార్థులతో పాఠశాల నడిచింది. కానీ నేడు మండల విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు, పాఠశాల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, అంగనవాడి టీచర్లకు కృషి ఫలితంగా నేడు అదే పాఠశాలలో 106 మంది విద్యార్థులతో కలకలలాడుతుంది. విద్యార్థుల చేరికను చూసి ఉపాధ్యాయులు మురిసిపోయే వంతయింది. వివరాల్లోకెళ్తే మండల కేంద్రంలో గల నెంబర్-2 ప్రాథమిక పాఠశాలలో ఇంతవరకు 14 మంది విద్యార్థులే ఉండేవారు. కానీ నేడు ఈ పాఠశాలలో 16 మంది విద్యార్థులు చేరారు. కశింకోట మండల విద్యాశాఖ అధికారులు పీవీ సురేష్, కేఎస్ న్ ఆదేశాల మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నేమాల రమణ, అంగన్వాడీ టీచర్ల పట్టుదలతో పాఠశాలలో అదనంగా 92 మంది విద్యార్థులు చేరారు. దీంతో మిగిలిన పాఠశాలలకు ఆదర్శమయింది. ఈ విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారులు, కూటమి నాయకుల చేతుల మీదుగా ఏకరూప దుస్తులు, పుస్తకాలు బ్యాగులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు, అంగన్వాడి టీచర్లను మండల విద్యాశాఖ అధికారులు పీవీ సురేష్, కె ఎస్ ఎన్ మూర్తి, కూటమి నాయకులు మాజీ వైస్ ఎంపిపి వేగి గోపి, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, తాకాసి కృష్ణ లు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు బిశెట్టి ఆనంద్, ఐ ఈ ఆర్ టి టీచర్ బీ.వి.రమణమ్మ, అంగన్వాడి టీచర్ సంతోషి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు న్యాయం చేస్తాం

## రైతులతో హోం మంత్రి అనిత సమావేశం



**నక్కపల్లి, జూన్ 30, మేజర్‌సూర్య:** రైతులకు న్యాయం చేస్తామని హోం మంత్రి అనిత అన్నారు. నక్కపల్లి హోం మంత్రి క్యాంప్ కార్యాలయంలో నక్కపల్లి మండలానికి చెందిన అమలాపురం, కాగిత, వేంపాడు, డి.ఎల్.పురం, నెల్లిపూడి గ్రామాల రైతులు, మత్స్యకారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతులతో అనేక అంశాలపై మంత్రి అనిత చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ "రైతులు దేశానికి వెన్నెముక అని, వారి శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం అని స్పష్టం చేశారు. నేను ఎల్లప్పుడూ పాయకరావుపేట నియోజకవర్గ అభివృద్ధి కోసమే ఆలోచిస్తున్నానని చెప్పారు. 2014 నుండి 2019 వరకు టిడిపి ప్రభుత్వం కాలంలో నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేసామన్నారు. అప్పట్లో 4 వేల ఎకరాల భూమిని అభివృద్ధి కోసం సమీకరించాం అని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో అభివృద్ధికి అంతరాయం కలిగిందని, ఇప్పుడు సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. సీఎం చంద్రబాబు నక్కపల్లి స్టీల్ ప్లాంట్ ప్రాజెక్టును ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నట్టు తెలియజేశారు. స్టీల్ ప్లాంట్ ద్వారా ఉపాధి అవకాశాలు, ఆర్థికాభివృద్ధి జరుగుతుందన్నారు. అమరావతిలో రైతులు 33 వేల ఎకరాల భూమిని రాజధాని కోసం సమర్పించిన త్యాగం అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. ప్రభుత్వం కాగిత, ఉద్ధండపురం గ్రామాల్లో టౌన్ షిప్‌ల నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, ప్రజల అమోదం తరువాతే భూములు తీసుకునే ప్రక్రియ కొనసాగుతుందనీ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని, అందుకే రైతులు, మత్స్యకారులు సహకరించాలని హోం మంత్రి అన్నారు. కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డిఓ రమణ ,ఏపీఐఐసి స్పెషల్ డిప్యూటి కలెక్టర్ అనిత ,నక్కపల్లి తహసీల్దార్ నరసింహామూర్తి,కొప్పిసెట్టి వెంకటేష్,గింజాల లక్ష్మణరావు,నాయకులు పాల్గొన్నారు.

# లారిట్జ్ నాడ్సెన్ ఎలక్ట్రికల్ & ఆటోమేషన్ ఉత్పత్తి పోర్ట్‌ఫోలియో ఆవిష్కరణ

**విశాఖపట్నం, జూన్ 30, మేజర్‌సూర్య:** భారతీయ ఎలక్ట్రికల్ అండ్ ఆటోమేషన్ రంగంలో నాయకుడైన లారిట్జ్ నాడ్సెన్ ఎలక్ట్రికల్ అండ్ ఆటోమేషన్ ఈ రోజు దేశం యొక్క కీలకమైన పారిశ్రామిక సమూహాలు మరియు వృద్ధి కారిడార్లను శక్తివంతం చేసే లక్ష్యంతో తన అతిపెద్ద ఉత్పత్తి పోర్ట్‌ఫోలియోను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా లౌరిట్జ్ నాడ్సెన్ ఎలక్ట్రికల్ ఆటోమేషన్ విభాగ హెడ్ నరేష్ కుమార్ మాట్లాడుతూ ఈ ప్రతిష్టాత్మక చొరవలో భాగంగా, ఈ బ్రాండ్ దేశవ్యాప్తంగా 30 పారిశ్రామిక నగరాలను దాటుతోందని తెలిపారు . స్థానిక నాయకులు, వాటాదారులు మరియు పర్యావరణ వ్యవస్థ భాగస్వాములతో నిమగ్నమై భారతదేశం యొక్క తయారీ మరియు మౌలిక సదుపాయాల కేంద్రాల గుండెలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వేగవంతం చేయడానికి ఉపయుక్తమవుతుందన్నారు. తక్కువ వోల్టేజ్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్ న్యూ ఎనర్జీ ల్యాండ్‌స్కేప్ కోసం పరిష్కారాలపై బలమైన దృష్టితో, లారిట్జ్ నాడ్సెన్ సాంకేతికత నేతృత్వంలోని పరివర్తనను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఇది భారతదేశ పారిశ్రామిక వెన్నెముకలోకి లోతుగా చేరుకుంటుందని, ఈ మైలురాయి ప్రచారం, ప్రభుత్వ వైకిట్ భరత్ 2047 దృష్టికి అనుగుణంగా, సాంకేతికంగా అభివృద్ధి చెందిన, ఆర్థికంగా స్థితిస్థాపకంగా మరియు ఇంధన-స్మార్ట్ భారతదేశాన్ని నిర్మించటానికి సంస్థ యొక్క నిబద్ధతను నొక్కి చెబుతుందన్నారు. లౌరిట్జ్ నాడ్సేన్ వద్ద, ఉద్దేశ్యం కస్టమర్లను సురక్షితంగా, వేగంగా తెలివిగా పనిచేయడానికి శక్తినిచ్చే స్మార్ట్ టెక్నాలజీలను అందించడం అని చెప్పారు. ఈ ఉత్పత్తి ప్రదర్శన ద్వారా, ఆవిష్కరణ ప్రాప్యత, అనువర్తన యోగ్యమైనది మరియు భారతదేశంలోని ప్రతి ప్రాంతంలోని ప్రత్యేకమైన అవసరాలకు సంబంధించినది అనే తమ నమ్మకాన్ని బలోపేతం చేస్తున్నామని అన్నారు.

# నిర్ణిత సమయంలో అర్జీలు పరిష్కరించాలి

## - పి జిఆర్.ఎస్.కు 313 అర్జీలు

## : కలెక్టర్ విజయ క్రిష్ణన్



**అనకాపల్లి ప్రతినిధి, జూన్ 30, మేజర్‌న్యూస్:** ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక (పి.జి.అర్.ఎస్.)లో వచ్చిన అర్జీలు నిర్ణిత సమయంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన పి.జి.అర్.ఎస్. కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, కె ఆర్ ఆర్ సీ పత్యేక డిప్యూటీ కలెక్టర్ ఎస్ సుబ్బలక్ష్మి, ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక పత్యేక డిప్యూటీ కలెక్టర్ రామమణి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి తీసుకున్న అర్జీల గురించి వెంటనే సంబంధిత అదికారులను వివరాలు అడిగి తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పరిస్కారం కాని అర్జీల పై సమీక్ష నిర్వహిస్తూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను నిర్ణిత సమయంలో పరిష్కరించాలని ఆమె తెలిపారు. ప్రజలు అందజేసిన ధరఖాస్తుల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పరిష్కరించిన వినతులను ధరఖాస్తుదారునికి తెలియజేయాలని, పరిష్కారం కాని అర్జీల గూర్చి వారికి అందుకుగల కారణాలు వివరంగా తెలియజేయడం ద్వారా అర్జీలు రీ ఓపెన్ కాకుండా నివారించవచ్చని తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని, ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు. ప్రతి శాఖ అధికారి వారి శాఖకు సంబంధించిన అర్జీల పరిష్కార పరిస్థితిని ప్రతిరోజు పర్యవేక్షణ చేసి నిర్ణిత సమయంలో చర్యలు తీసుకోవాలన్నారు, ఈ రోజు పి.జి.అర్.ఎస్. లో 313 అర్జీలు స్వీకరించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావు, జిల్లా గృహనిర్మాణ, జిల్లా గ్రామీణ అభివృద్ధి, డ్వామా పథక సంచాలకులు శ్రీనివాస్, శచిదేవి, పూర్ణిమ దేవి, జిల్లా విద్యా శాఖ అధికారి జి అప్పారావు నాయుడు, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి వి.సుదీర, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగి సేవలే వారికి విశిష్ట గౌరవం



**కోటబొమ్మాళి, జూన్ 30, మేజర్‌న్యూస్:** ప్రభుత్వ ఉద్యోగి తన ఉద్యోగ జీవితంలో అంకితభావంతో పనిచేస్తే, తను చేసిన సేవలే విరమణ తరువాత కూడా వారికి విశిష్ట గౌరవాన్ని తెచ్చిపెడతాయని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుప్పిల ఫణీంద్ర కుమార్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ అవరణలో మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారి డి. మంగరాణి, ఉద్యోగ విరామణ సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆమె ప్రభుత్వ ఆదేశాలు అనుగుణంగా విధి నిర్వాహణలో తూచ తప్పకుండా క్రమశిక్షణతో, ఎలాంటి అలసత్వం వహించకుండా సేవలను అందించారని ఆయన అన్నారు. అలాగే పలువురు ప్రజా ప్రతినిధులు ఆమె సేవలను కొనియాడారు. సంతబొమ్మాళి, పోలాకి, జలుమూరు ఎంపీడీవోలతో పాటు డిప్యూటి ఎంపీడీవోలు తుల రాజారావు, జే. ఆనందరావు, కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది తదితరులు ఆమె సేవలు కొనియాడారు. అనంతరం పలువురు వివిధ మండలాల నుంచి వచ్చిన ఉద్యోగులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు దుస్సాలువతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

## ప్రజల వద్దకే పరిపాలన

# పలాసలో డివిజన్ స్థాయి గ్రీవెన్స్

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 110 వినతులు

- సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశం



**పలాస, జూన్ 30, మేజర్‌న్యూస్:** ప్రజల నుంచి అందిన వినతులకు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. పలాస తశీల్ధార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జెడ్ పీ సి ఈ ఓ ఎల్.ఎల్.శ్రీధర్ రాజ్, డి ఆర్ డి ఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 110 అర్జీలు అందాయి. డివిజన్ లోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు భూ సమస్యలు, మ్యుటేషన్ లు, రీ సర్వే సరిచేయాలని, సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని అర్జీలు అందజేశారు.పలాస పోస్టుమెట్రిక్ బాలికల ఎస్టీ హాస్టల్ లో తాగునీటి ఇబ్బంది తీవ్రంగా ఉన్నందున సమస్య పరిష్కరించాలని, ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు రక్షణగా స్థానికంగా అందుబాటులో ఉండే వార్డెన్ ను నియమించాలని విద్యార్థినులు ఎస్.ఊర్మిళ, కుంతీదేవి,సుస్మితతో పాటు పలువురు వినతి పత్రం సమర్పించారు.గత కొన్నేళ్లుగా వర్షాభావం వలన శాశ్వత నీటివనరులు లేక పంట నష్టం వాటిల్లుతుందని, పలాస నుంచి కిడిసింగి గ్రామం వరకు సాగు నీరు అందుతుందని, పలాస మండలం బొడ్డపాడు సమీపంలోని వేపాడు చెరువు మీదుగా పల్లం ప్రాంతమైన సంకు జోడు, దామోదరసాగర్, వద్ద నున్న జంతి బంధ ను మినీ రిజర్వాయర్ గా అభివృద్ధి చేసి అనుసంధానం జరిగితే పలాస వజ్రపు కొత్తూరు, ఇచ్ఛాపురం పంచాయతీలకు సాగునీరు అందించేందుకు వాస్తవ పరిస్థితులను పరిశీలించి సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని పలాస డివిజన్ వంశధార జలసాధన కమిటీ అధ్యక్షులు మన్మధరావు, మహేంద్ర రైతు సంఘం అధ్యక్షులు బెస్త కామేశ్వరరావు వినతి అందజేశారు.పలాస కాశీ బుగ్గ మున్సిపాలిటీ 31,24 వార్డు పరిధిలోగల సర్వే నెంబరు 51 లో పురుషోత్త పురం ఎర్ర చెరువు సుమారు 72 ఎకరాల విస్తీర్ణంలో సాగునీరు,నిత్యవసరాలు తీర్చే తాగు నీటి వనరుగా చుట్టుపక్కల ప్రజలు ఆధారపడి ఉన్నారని, అటువంటి చెరువు ఆక్రమణలకు గురైనందున పూర్తిస్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సప్ప నవీన్ కుమార్, కె.శంకర్ రావు అర్జీ అందజేశారు.గ్రామానికి తాగునీరు, స్మశాన వాటిక నిర్మాణం జరపాలని మెలియాపుట్టికి చెందిన సేనాపతి రవికుమార్ కోరారు.ఈ ప్రాంతంలో కిడ్నీ థెరపీ యూనిట్ మంజూరు చేయాలని వజ్రపుకొత్రికి చెందిన కీలు విజయకుమార్ దరఖాస్తు అందించారు.ఆఫ్షోర్ రిజర్వాయర్ నష్టపరిహారం మంజూరు చేయాలని మెలియాపుట్టి మండలం మనిగాం గ్రామానికి చెందిన మనిగాం చిలకయ్య విజ్ఞప్తి చేశారు.గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాల రక్షణ గోడ నిర్మాణం చేపట్టాలని పలాస మండలం సవర గోవింద పురం గ్రామానికి చెందిన సవర పవన్ దరఖాస్తు సమర్పించారు.గ్రామంలో నిర్వహించిన రీ సర్వేలోని తప్పులను సరిచేయాలని పలాస కు చెందిన ఏ.రామారావు కోరారు.ఈ కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధాకర్, ఆర్డీవో జి.వెంకటేష్, డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ మేరీ,పలాస తహశీల్దార్ టి కళ్యాణ చక్రవర్తి, డివిజన్ లోని తహసిల్దార్ లు,డివిజన్ స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జూలై 5 జాతీయ లోక్ అదాలత్

**శ్రీకాకుళం, జూన్ 30, మేజర్‌న్యూస్:** యాక్సిడెంట్ కేసుల ఇన్సూరెన్స్ కంపెనీలు రానున్న లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజి చేయమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జూనైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ వారి ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారు స్థానిక జిల్లా కోర్టు భవనం నందు ఇన్సూరెన్స్ న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెనీలు తో జిల్లాలో గల కోర్టు భవనం నందు సమావేశమును ఏర్పాటు చేశారు.

ప్రజలకు న్యాయం చేకూర్చే విధంగా న్యాయవాదులు ఇన్సూరెన్స్ కంపెనీలు ఇరువురు ఒకచోట కూర్చుని ఇరువురికి న్యాయం చేకూర్చేలా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒకటవ అదనపు జిల్లా జడ్జి పి భాస్కర రావు, 3 వ అదనపు జిల్లా జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్, 4 వ అదనపు జిల్లా జడ్జి ఎస్ ఎం ఫణి కుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం శ్రీధర్ FAC కార్యదర్శి న్యాయ సేవాధికార సంస్థ, ఇన్సూరెన్స్ కంపెనీలు, అధికారులు పాల్గొన్నారు.

## ఇల్లు ,దుకాణాలు, షాపులు

# ఒకేసారి నష్టపరిహారం ఇవ్వాలని

### అనకాపల్లి ఆర్డీవోకు వినతిపత్రం



**అచ్యుతాపురం, జూన్ 30, మేజర్‌న్యూస్:** అనకాపల్లి- అచ్యుతాపురం జరోడ్డు నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరావు మాట్లాడుతూ వి ఎంఆర్డీఏ నిర్వహించిన గ్రామ సభల్లో స్థలాలు, ఇల్లు, షాపులకు టీడీఆర్ లు వద్దని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని చేసిన తీర్మానాలను పక్కనపెట్టడం గ్రామ సభలకు విలువలేకుండా చేయడమేనని అన్నారు. నిర్మాణాలకు నష్టపరిహార జాబితాలు తయారుచేయడం, అనుయాయులతో టీడీఆర్ లకు ఒప్పించి నిర్వాసితుల ఐక్యతను దెబ్బతీయాలని ప్రభుత్వం చూస్తోందని తెలిపారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం నగదు కింద బ్యాంకులో జమచేయాలని గత ప్రభుత్వం గజానికి రూ. 15,000 నుండి రూ.25,000 ఇస్తామని నిర్వాసితుల సంతకాలు తీసుకుందని గుర్తుచేశారు. నిర్వాసితులకు గత ప్రభుత్వం కంటే ఎక్కువ ప్రయోజనం కల్పించకపోగా, మరింత నష్టం తెచ్చిపెడుతోందని అన్నారు.

నిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లించకుండానే రోడ్డు విస్తరణ పనులు చేయడం అన్యాయమని అన్నారు. టీడీఆర్ బాండ్లు ఆలోచన మానుకొని నగదు చెల్లింపులు చేయకపోతే నిర్వాసితులతో కలిసి రోడ్డు విస్తరణ పనులు అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితుల సంఘం కన్వీనర్ ఆర్. రాము, కో కన్వీనర్ కే. రామ సదాశివరావు, రైతు సంఘం నాయకులు కర్రి .అప్పారావు, ఎస్ .బ్రహ్మాజీ, బుద్ధ. రంగారావు, శరగడం. జగ్గారావు ,ఆడారి .శివ, రామకృష్ణ, సరిస .శివ, ఎస్ .కనుమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీముఖ లింగేశ్వర ఆలయ ఈవోగా వాసుదేవరావు



**జలుమూరు, జూన్ 30, మేజర్‌న్యూస్:** జలుమూరు మండలం శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయ ఈవోగా వాసుదేవరావు నియమింపబడ్డారు. పాతపట్నం ఈవో విధులు నిర్వహిస్తున్న పి వాసుదేవరావుకు అదనపు బాధ్యతలను సోమవారం దేవాదాయ శాఖ వారు అప్పగించారు. ప్రస్తుత ఈవోగా పనిచేసిన ప్రభాకర రావు పదవీ విరమణ చేశారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

### మృతదేహంతో రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు



**నందిగాం, జూన్ 30, మేజర్‌న్యూస్:** మండలంలో కవిటీ అగ్రహారామ్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హుండీ నుంచి పలాస వైపు వెళుతున్న కోరికా న చైతన్య అనే యువకుడ్ని ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టినట్లు స్థానికులు చెబుతున్నారు .ఈ ప్రమాదంలో చైతన్య అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు మృతుడు కొండ ఊరు గ్రామానికి చెందిన వాడిగా గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు .ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా నిర్వాహించిన విస్తృత స్థాయి సమావేశం



**అచ్యుతాపురం, జూన్ 30, మేజర్‌న్యూస్:** ఎలమంచిలి నియోజకవర్గంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం అచ్యుతాపురం జంక్షన్, పూడిమడక రోడ్డులో అమూల్ డైరీ ఎదురుగా ఉన్న లేపాక్షి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి అచ్యుతాపురం మండల పార్టీ అధ్యక్షుడు దేశం శెట్టి శంకర్రావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పార్టీ ప్రముఖులు మాట్లాడుతూ అధికార కూటమి ఎన్నికల హామీలను విస్మరించి, 'రెడ్ బుక్కు రాజ్యాంగం' పేరుతో ప్రజలను మోసగిస్తున్నదని విమర్శించారు. చంద్రబాబు ఎన్నికల



మేనిఫెస్టోను గుర్తు చేస్తూ "బాబు షూరిటీ - మోసం గ్యారంటీ" అనే పేరిట ప్రత్యేక క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే చంద్రబాబు ఇచ్చిన హామీలు, వాటి అమలుపై జరిగిన మోసాలపై ప్రజలకు పూర్తి సమాచారం తెలుస్తుందని తెలిపారు. ఈ క్యూఆర్ కోడ్‌ను ఇంటింటికీ తీసుకెళ్లాలని కార్యకర్తలకు ఆదేశించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు గుడివాడ అమర్నాథ్, అనకాపల్లి పార్లమెంట్ ఇంచార్జ్ కరణం ధర్మశ్రీ, అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు శోభా హైమావతి, అరకు పార్లమెంట్ పరిశీలకులు బొడ్డేటి ప్రసాద్, ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త మరియు మాజీ శాసనసభ్యులు యు.వి. రమణమూర్తి రాజు (కన్నబాబు) హాజరై ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సమావేశంలో నియోజకవర్గానికి చెందిన జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గిరి గ్రామాలలో రహదారుల కల్పనకు కృషి

**అంజలి శనివారం సర్పంచ్ రాజబాబు, వైస్ ఎంపీపీ వెంగళరావు**



**చింతపల్లి, జూన్ 30, మేజర్‌న్యూస్:** గిరి గ్రామాలలో రహదారుల కల్పనకు కృషి చేస్తున్నట్లు అంజలి శనివారం సర్పంచ్ పేట్ల రాజబాబు అన్నారు. ఆ పంచాయతీలోని ఈదుల బయలు నుండి ధోని బంధ, ఈదుల బయలు నుండి కోటల గరువు గ్రామాల వరకు మెటల్ రహదారుల నిర్మాణాని కి ఆ పంచాయతీ ఎంపీటీసీ, మండల వైస్ ఎంపీపీ సాగిన వెంగళరావుతో కలిసి శంకు స్థాపన చేశారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ పంచాయతీలోని అనేక గ్రామాలలో రహదారి సమస్య ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుండి పంచాయతీలోని ఈదుల బయలు గ్రామం నుండి ధోని బంధ గ్రామం వరకు, అదే విధంగా ఈదులు బయలు నుండి కోటల గురువు గ్రామం వరకు మెటల్ రహదారి నిర్మాణానికి నేడు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే కొన్ని గ్రామాల కైనా రహదారి సమస్య పరిష్కారం అయి నట్లు అవుతుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కిముడు ఉత్తర కుమారి, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి పేట్ల పోతురాజు, కూటమి నాయకులు కిముడు పరమేశ్వర రావు, లకే రామ స్వామి, పంచాయతీ వార్డు సభ్యులు వనగల మత్య కొండ, ఎస్ బాబురావు, కిముడు నారాయణరావు, లోచల బాబురావు తో పాటు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# రా రింతాడ సమీపంలో కూలిన వృక్షాలు

**- వాహనాల రాకపోకలకు అంతరాయం**

**- వాహనాల పై పడక పోవడంతో ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు, వాహన చోదకులు**



**చింతపల్లి, జూన్ 30, మేజర్‌న్యూస్:** చింతపల్లి - నర్సీపట్నం ప్రధాన రహదారి లోని రా రింతాడ గ్రామ సమీ పంలోని బస్ షెల్టర్ వద్ద వృక్షాలు కూలడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ మేరకు ఏజెన్సీ లో గత 3 రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు తోడు విపరీతంగా వీస్తున్న ఈదురు గాలుల వలన వృక్షాలు నేల కూలుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం ఉదయం 9 గంట ల సమయంలో చింతపల్లి - నర్సీపట్నం ప్రధాన రహదారి లో వాహనాలు రాకపోకలు సాగిస్తున్న సందర్భంలో అకస్మాత్తుగా కూలిన వృక్షాలు రహదారికి అడ్డంగా పడడంతో కొంత సేపు ఎటు వైపు ఉన్న వాహనాలు అటు వైపు నిలిచి పోయాయి. ఈ క్రమంలో వృక్షాలు వాహనాలపై పడనందున వాహన చోదకులు, బస్ లో ఉన్న ప్రయాణీకులు ఊపిరి పీల్చు కున్నారు. ఇదిలా ఉండగా ఇరువైపుల నిలిచిపోయిన వాహన చోదకులు, బస్ లో ఉన్న ప్రయాణికులు సాహసం చేసి చిన్న, చిన్న కొమ్మలను విరవడంతో పాటు వృక్షాలకు త్రాడు కట్టి అతి కష్టం మీద ప్రక్కకు లాగి, వాహనాలు రాకపోకలకు అవరోధం లేకుండా చేశారు. దీంతో వాహనాల రాకపోకలు యధావిధిగా కొనసాగాయి.

# ఐ టి ఐ అభివృద్ధికి కృషి చేస్తా

**ఐ టి ఐ నూతన ప్రిన్సిపాల్‌గా రమణ**



**చింతపల్లి, జూన్ 30, మేజర్‌న్యూస్:** చింతపల్లి మండలం పెంటపాడు గ్రామంలో ఉన్న ఆర్ ఐ టి ఐ లో నెలకొని ఉన్న సమస్యల పై దృష్టి సారించి, ఐ టి ఐ అభివృద్ధి కి కృషి చేస్తానని ఎ .రమణ అన్నారు. ఈ మేరకు ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీ లలో భాగంగా విశాఖపట్నం ఓల్డ్ ఐ టి ఐ లో పనిచేయుచున్న ఆయనను అల్లూరి జిల్లా చింతపల్లి (పెంటపాడు) ఐ టి ఐ కు బదలీ చేశారు.దీంతో ఆయన నూతన ప్రిన్సిపాల్ గా భాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడారు. ఐ టి ఐ లో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే కాకుండా, అభివృద్ధి పరిచేందుకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు అల్లూరి జిల్లా చింతపల్లి (పెంటపాడు) ఐ టి ఐ లో పనిచేస్తున్న శ్రీనివాసాచారి ని విజయనగరం జిల్లా సాలూరుకు ఆ శాఖ ఉన్నతాధికారులు బదలీ చేశారు...

# 104 ఆరోగ్య సేవలపై జిల్లా మేనేజర్ ఆరా



**అరకులోయ, జూన్ 30, మేజర్‌న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రజలకు 104 వాహనం ద్వారా అందుతున్న ఆరోగ్యసేవలపై 104 జిల్లా మేనేజర్ నరేష్ ఆరా తీశారు.ఏ ఎస్ ఆర్ జిల్లాలోని హుకుంపేట మండలం తడిగిరిలో సోమవారం నిర్వహించిన పీఎం జన్మన్ ధర్తి ఆబ జన్ భగిదరి అభియాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా మేనేజర్ 104 వాహనాలను తనిఖీ చేసి ఆరోగ్య సేవలపై వాకాబు చేశారు.తమ సిబ్బంది 104 వాహనాల ద్వారా అందజేస్తున్న ఆరోగ్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగపరచుకోవాలని ఆయన కోరారు.జిల్లాలోని ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమిస్తున్న 104 సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతకుముందు అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా నూతనంగా నియమితులై ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన టి.విశ్వేశ్వర నాయుడును 104 జిల్లా మేనేజర్ నరేష్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. తమ సిబ్బందితో కలిసి డిఎం అండ్ హెచ్ వో ను అభినందించారు.ఈ భేటీను పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి టి. విశ్వేశ్వర నాయుడు 104 జిల్లా మేనేజర్ తో ఆరోగ్య పథకాల అమలుపై సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో104 అరకు డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ (ఓ ఈ) సమర్ధి. రవికుమార్,పాడేరు ఓఈ రామ్ సూరి, ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది,104 ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పైలా దివాకర్‌కి నివాళులర్పించిన కె.కె రాజు



**అక్కయ్యపాలెం, జూన్ 30, మేజర్‌న్యూస్:** సీనియర్ జర్నలిస్ట్, వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా కార్యాలయ పి.ఆర్.ఓ. కీ" శే" పైలా దివాకర్ అనారోగ్యంతో నిన్న స్వర్గస్తులయినారు. తాటిచెట్లపాలెం, 80ఫీట్ రోడ్డులో ఆయన పార్థివదేహాన్ని వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షులు కె.కె రాజు సందర్శించి పార్టీ తరపు న నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కర్తలు మొల్లి అప్పారావు , మాజీ శాసన సభ్యులు తైనాల విజయ కుమార్, పార్టీ కార్యాలయం లో పర్యవేక్షకులు రవి రెడ్డి, రాష్ట్ర పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు బొల్లవరపు జాన్ వెస్లీ, పేర్ల విజయ్ చంద్ర, పార్టీ ముఖ్య నాయుకులు పివిఎస్ఎన్ రాజు (వుడా రవి), అల్లంపల్లి రాజబాబు , ద్రోణంరాజు శ్రీ వాస్తవ కార్పొరేటర్లు పి.వి. సురేష్, శేశికల, జిల్లా అధికార ప్రతినిధి పళ్ళ దుర్గ , జిల్లా అనుబంధ విభాగ నాయుకులు , మారుతీ ప్రసాద్ , బొండా ఉమామహేశ్వరరావు , రాయపురెడ్డి అనిల్ కుమార్, శ్రీదేవి వర్మ , రాధ , పార్టీ అధ్యక్షులు పైడి రమణ , పలువురు వైసిపి నాయకులు, జర్నలిస్టులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మహా న్యూస్ కార్యాలయంపై దాడి అప్రజాస్వామ్యం

**తీవ్రంగా ఖండించిన "ఏపీయూడబ్ల్యూజే" ప్రతినిధులు**




**అనకాపల్లి ప్రతినిధి, జూన్ 30, మేజర్‌న్యూస్:** మహా న్యూస్ కార్యాలయంపై దాడిని ఖండిస్తూ అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ నాయకత్వంలో నిరసన కార్యక్రమం సోమవారం అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ బిఎల్ స్వామి, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యదర్శి చింతల కిషోర్, జిల్లా కార్యదర్శి ఆళ్ల వెంకట అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోరాడ చంద్రరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మద్దాల రాంబాబు పాల్గొని ప్రజాస్వామ్యంపై దాడిని వ్యతిరేకిస్తున్నామన్నారు. పత్రికా స్వేచ్ఛను హరించే హక్కు ఎవరిచ్చారు అని ప్రశ్నించారు. భారతదేశంలో అన్యాయాన్ని అవినీతిని ప్రశ్నించి ఆయా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తున్న మీడియాపై దాడి చేయడం సరికాదన్నారు. తక్షణమే మహా న్యూస్ కార్యాలయం పై దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశంలో పత్రిక స్వేచ్ఛపై దాడులు జరగకుండా ప్రత్యేక చట్టాలను ప్రభుత్వాలు రూపొందించి రక్షణ కల్పించాలని కోరారు. అనంతరం పత్రికా స్వేచ్ఛను కాపాడాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ముందుగా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించకుండా తగిన చర్యలు తీసుకోవాలంటూ ఆర్డీవో ఆయుషాకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వైవి రమణాజీ, అనకాపల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు మళ్ల భాస్కర్, భీమరశెట్టి గణేష్, చాగంటి సర్వారావు(మహా టీవీ న్యూస్ రిపోర్టర్), భీమరశెట్టి నూకేష్, కార్యవర్గ సభ్యులు, పాత్రికేయులు భానోజీ రావు, గంగాధర్, మున్నా, కిరణ్, శ్రీను, మణికుమార్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించిన మొల్లిహేమలత



**మధురవాడ, జూన్ 30, మేజర్‌న్యూస్:** వార్డ్ లో త్రాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరుగుతుందని కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. ఈరోజు వార్డు పరిధి లో గల పరదేశిపాలెం, మారికవలస లలో త్రాగునీటి చేతిపంపు బోర్లు పనులను కార్పొరేటర్ మొల్లి హేమలత ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ హేమలత మాట్లాడుతూ వార్డులో త్రాగునీటి సమస్య పరిష్కారానికి తగిన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, ముఖ్యంగా కొండవాలు ప్రాంతాల్లో ఇప్పటికే సుమారు రెండు కోట్ల నిధులతో పైపులైన్లు వేయడం జరిగిందని, సాయిరాం కాలనీలో సుమారు మూడు కోట్ల నిధులతో త్రాగునీటి స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం



చేపడుతున్నామని, త్రాగునీటి ఇంటి కొళాయి లు లేనిచోట మరియు కొళాయి ల నుండి నీరు సరిగా రానిచోట చేతిపంపు బోర్లు వేయడం జరుగుతుందని, తొందరలోనే ప్రతి ఇంటికి త్రాగునీటి కొళాయి వేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానిక శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు సహకారంతో వార్డులో ఇప్పటికే ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని ఇంకా వార్డులో అభివృద్ధి చేయవలసిన పనులన్నీటిని దశలవారిగా పూర్తి చేస్తామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, కొండపు రాజు, బోర అప్పలసూరిబాబు రెడ్డి, బోర ప్రసాద్, జనసేన నాయకులు శ్రీకాంత్, ఎర్రయ్య రెడ్డి, వెంకటరెడ్డి, సత్యాల కృష్ణ, బోర గోవిందరావు స్థానిక మహిళలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కుకు ఉజ్వల భవిష్యత్

### : ఎం.ఎం.ఎస్.ఎం విభాగాధిపతి ఫణి గోపాల్



**ఉక్కు నగరం, జూన్ 30, మేజర్‌న్యూస్:** విశాఖ ఉక్కు కు ఉజ్వల భవిష్యత్ ఉందని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎం.ఎం.ఎస్.ఎం విభాగాధిపతి పి.. ఫణి గోపాల్ అన్నారు . ఎం.ఎం.ఎస్.ఎం విభాగం లో 34 ఏళ్ల గా విధులు నిర్వహించి సోమ వారం ఉద్యోగ విరమణ చేసిన జనరల్ ఫోర్ మెన్ జి. ఆనంద్ అభినందన కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి హెచ్.ఓ.డి ఫణి గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆనంద్ 34 ఏళ్ల సుదీర్ఘ కాలం విధులు నిర్వ హించి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. ఉక్కు కర్మాగారం భవిష్యత్‌పై ఎలాంటి సందేహాలు వద్దని అన్నారు . ఉమా మహేశ్వర రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ గులాం సర్వర్ , డి.జి.ఎం లు ఎం. చంద్ర శేఖర్ , బోయర్, బి.ఎం. కోసే, ఏ.వి.ఎస్ ,సీనియర్ మేనేజర్ లు సి.హెచ్ .శివ రామ కృష్ణ , ఉద్యోగులు ఐ.చిట్టి బాబు , కె.ఎల్లయ్య , నరేష్ , టి. రవళి, కార్మిక సంఘాల నాయకులు డి.దేముడు , వై.వి.సుబ్బా రావు , ఎం.సుబ్బా రావు, పి. దేముడు పాల్గొన్నారు . కార్యక్రమం లో భాగంగా ఆనంద్ ను జ్ఞాపిక , ప్రశంసాపత్రం ,శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## శ్రీ శిరిడి సాయిబాబా 26వ వార్షికోత్సవ వేడుకలు



**గాజువాక, జూన్ 30, మేజర్‌న్యూస్:** గాజువాక బీసీ రోడ్ దయాల్ నగర్ లో కొలువై ఉన్న శిరిడి సాయిబాబా ఆలయం 26వ వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవం పురస్కరించుకొని ఆలయ ధర్మకర్తలు తిప్పల నితీష్ శ్రీమతి ప్రణీత దంపతుల చేతులు మీదుగా బాబాకి ప్రత్యేక పూజలు, సాయిబాబా హోమం మరియు భస్మాభిషేకం కనుల పండగగా జరిగింది. ఈ కార్యక్రమంలో గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్ రెడ్డి. చేతుల మీదుగా సాయిబాబాకు క్షీరాభిషేకం మరియు సాయిబాబాహోమంలో పాల్గొని బాబాకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ 26 సంవత్సరాల క్రితం దయాల్ నగర్ లో షిరిడి సాయిబాబా ఆలయం నిర్మాణం జరిగిందన్నారు. అంతేకాకుండా కులమతాలకు అతీతంగా పిలిచిన వెంటనే పలికే దైవంగా బాబా అని స్థానికులు అందరూ బాగా కొలుచుకుంటారని ఆయన సన్నిధికి ఎవరు వచ్చినా పరిపూర్ణ శాంతి ఉంటాదని అన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా నిత్యం దేవాలయాన్ని కంటికి రెప్పలా కాపాడుకుంటున్న ఆలయ ధర్మకర్తలు తిప్పల నితీష్ , ప్రణీత దంపతులను అభినందించారు. బాబా సన్నిధానంలో భారీ అన్న ప్రసాదం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాబా అనుగ్రహం పొందిన నాయకులు గాజువాక వైఎస్ఆర్సిపి నాయకులు తిప్పల దేవన్ రెడ్డి, 74 వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీ రెడ్డి, 65 వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు, తిప్పల అప్పలస్వామి, తిప్పల రమణారెడ్డి ఆలయ కమిటీ ప్రతినిధులు ఎన్.వి నాయుడు, అప్పలనాయుడు, రామారావు, నారాయణరావు, కోటీశ్వరరావు, కృష్ణారెడ్డి, జగదీష్ భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పేదల పాలిట దేవుడు డాక్టర్ రామన్



**గాజువాక, జూన్ 30, మేజర్‌న్యూస్:** వైద్య రంగంలో ఎనలేని సేవలు అందించిన డాక్టర్ కెవి రామన్ పేదల ఆత్మబంధువుగా, పేదల పాలిట దేవుడుగా నిలిచారని పలువురు వక్తలు పేర్కొన్నారు.గాజువాక సాయిరామ్ నగర్ లో సింహగిరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివంగత రామన్ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.ట్రస్ట్ చైర్మన్ జమునారాణి,డాక్టర్ కెవిఎస్



కళ్యాణ్ లు రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ట్రస్టు ద్వారా చేపడుతున్న సేవలను వివరించారు. డాక్టర్ రామన్ ఉచిత వైద్యాన్ని అందించి అందరి హృదయాల్లో నిలిచారని అన్నారు.ఆయన పేరిట అన్ని ప్రాంతాల్లో సామాజిక సేవలు అందించనున్నట్లు తెలిపారు.అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మందులు అందజేశారు.పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో వైసీపీ నాయకులు మహమ్మద్ గౌస్,డాక్టర్ సంగీత లక్ష్మీ,మౌనిక,బాలు తదితరులు పాల్గొన్నారు.

## వీడని వర్షాలు - నేల కూలిన వృక్షాలు



(ఘాట్ రోడ్డులో నేల కూలిన వృక్షాలు)

**అరకులోయ, జూన్ 30, మేజర్‌న్యూస్:** అరకులోయ పరిసరాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు కొనసాగుతూనే ఉన్నాయి.బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఓ మోస్తారు వర్షాలతో పాటు తేలికపాటి వర్షం నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి.ఎడతెరిపి లేకుండా ఏకధాటిగా వర్షాలు కురుస్తుండడంతో జనజీవనం అస్తవ్యస్తంగా తయారయ్యింది.వర్షాల కారణంగా లోతట్టు,పల్లపు ప్రాంతాలు జలమయం కాగా, రహదారులు చిత్తడిగా మారాయి.దీంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది.జోరుగా కురుస్తున్న వర్షాల వల్ల నిర్మాణ పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి.ఈ నేపథ్యంలో కార్మికులకు పనులు కరువు అవ్వడంతో అర్థాకలితో అలమటించాల్సిన పరిస్థితి ఏర్పడింది.వర్షాల వల్ల పాఠశాలలకు వెళ్లేందుకు పిల్లలు నానా అవస్థలు పడుతున్నారు.జోరుగా కురుస్తున్న వర్షాలకు తోడుగా ఈదురుగాలులు విస్తృతంగా ఇస్తున్న కారణంగా అరకులోయ ఘాట్ రోడ్డులో పలుచోట్ల భారీ వృక్షాలు నేలకు కూలిపోయాయి. సుంకరమెట్ట మలుపు రోడ్డు వద్ద భారీ వృక్షాలు రహదారికి అడ్డంగా కూలిపోవడంతో ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోయాయి.ఆటోలు, కార్లకు, ఇతర వాహనాలకు తృటిలో ప్రమాదం తప్పింది. దీంతో వాహనచోధకులు, ప్రయాణీకులు ఊపిరి పీల్చుకున్నారు.ఈ భారీ వర్షాలు కొనసాగితే ఘాట్ రోడ్లో మరెన్నో ప్రమాదాలు సంభవించే అవకాశాలు లేకపోలేదు.ఈ మేరకు ప్రయాణికులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

## బీసీ బాలికల హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన హోం మంత్రి అనిత



**పాయకరావుపేట, జూన్ 30, మేజర్‌న్యూస్:** అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలోని బీసీ బాలికల కాలేజ్ హాస్టల్‌ను హోం మంత్రి వంగలపూడి అనిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న మంత్రి, హాస్టల్ లోని సమస్యలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సీసీ కెమెరాలు లేకపోవడం పట్ల మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ వార్డెన్ కూడా గైర్హాజరు కావడం వల్ల మంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన మంత్రి, ఆహార నాణ్యత తక్కువగా ఉండడంతో అధికారులపై సిరియస్ అయ్యారు. మెనులో ఉన్న పదార్థాలను సరైన విధంగా అమలు చేయకపోవడాన్ని గుర్తించారు. ప్రభుత్వ హాస్టల్స్ లో కూడా సన్న బియ్యాన్ని వాడాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా మంత్రి అనిత విద్యార్థులను ధైర్యంగా ఉండాలని, సామాజిక మాధ్యమాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.తక్షణమే హాస్టల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. హాస్టల్‌పై సమగ్ర విచారణ జరిపి, రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని మంత్రి అనిత ఆదేశించారు.